ఉత్సాహంగా
పిడకల సమరం
• 30 మందికి గాయాలు
2

PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 43 సంచిక : 247 | విజయవాడ, గురువారం 11 ఏప్రిల్ 2024 | 8 + 8 పేజీలు వెల : 5. 50

Vol No | Vijayawada, Thursday 11 April 2024 | Rs



ప్రజాశక్తి పాఠకులకు, ఏజెంట్లకు, ప్రకటనకర్తలకు, శ్రేయోభిలాషులకు రంజాన్ శుభాకాంక్షలు

- చీఫ్ జనరల్ మేనేజర్

వలంటీర్లను మెచ్చుకున్నారు

- మా పాలన బాగుందని బాబు ఒప్పుకున్నట్టే
- పథకాలపై ప్రోగ్రెస్ రిపోర్టు ఇస్తున్నాం
- పిడుగురాళ్ల సభలో జగన్ వ్యాఖ్యలు

ప్రజాశక్తి - గుంటూరు జిల్లా ప్రతినిధి, సంతమాగులూరు (బాపట్ల జిల్లా)

వలంటీర్ల వ్యవస్థపై అనేక విమర్శలు చేసిన వారే ప్రస్తుతం వారి సేవలను మెచ్చుకుంటున్నారని రాష్ట్ర ముఖ్యమంత్రి, వైసిపి అధినేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అన్నారు 'మేమంతా సిద్ధం' బస్సు యాత్రలో భాగంగా పల్నాడు జిల్లా పిడుగురాళ్ల అయ్యప్పనగర్ వద్ద బుధవారం సాయంత్రం జరిగిన ఎన్నికల ప్రచార సభలో ఆయన మాట్లాడుతూ వలంటీర్లపై ఎన్‌డిఎ కూటమి పార్టీలు ఎన్నో విమర్శలు చేశాయని చెప్పారు. అధికారంలోకి వస్తే వలంటీర్ల వేతనం 5 వేల రూపాయల నుండి పది వేలకు పెంచుతామని చంద్రబాబు చెబుతున్నారని, దీనర్థం ఐదు సంవత్సరాల తమ పాలన బావుందని ఒప్పుకున్నట్టేనని అన్నారు.

విషం చిమ్మిన వారే మెచ్చుకుంటున్నారంటే తన పరిపాలనకు కితాబు లభించినట్టేనని చెప్పారు. అయితే చంద్రబాబు మాటలను ఎవరూ నమ్మరని అన్నారు. పొరపాటున బాబు అధికారంలోకి వస్తే ప్రస్తుతం ఉన్న వలంటీర్లందరినీ తొలగించి జన్మభూమి కమిటీలకు చెందిన వారిని నియమించుకుంటారని, వారికి పది వేల రూపాయలు ఇవ్వడం ద్వారా మరోసారి రాష్ట్రాన్ని దోచుకుంటారని అన్నారు. తాము అధికారంలోకి వచ్చిన తరువాత 2.3 లక్షల ఉద్యోగాలు ఇచ్చామని, చంద్రబాబు హయంలో కేవలం 32 వేల ఉద్యోగాలు ఇచ్చారని చెప్పారు. తాము ఇచ్చిన హామీల అమలుకు సంబంధించిన ప్రోగ్రెస్ రిపోర్టును ప్రజల ముందుంచుతున్నామని తెలిపారు.

సంక్షేమ పథకాల అమలులో తమ ప్రభుత్వం దేశంలో మొదటి స్థానంలో ఉందన్నారు. చంద్రబాబు 14 ఏళ్లపాటు సిఎంగా ఉన్నా ఎప్పుడూ రైతులకు మేలు చేయలేదని విమర్శించారు. 2014లో రుణమాఫీ పేరుతో రైతులను మోసం చేయలేదా? అని ప్రశ్నించారు. వైసిపికి ఓటు వేస్తే పేదలకు మేలు జరుగుతుందని, టిడిపికి వేస్తే బడాబాబులకు మేలు జరుగుతుందని పేర్కొన్నారు.



పిడుగురాళ్ల సభలో ప్రజలకు అభివాదం చేస్తున్న సిఎం జగన్

ప్రజలకు అభివాదం చేస్తూ ముందుకు సాగిన ముఖ్యమంత్రి

బాపట్ల జిల్లా శావల్యాపురం మండలం గంటావారిపాలెం వద్ద మంగళవారం బస చేసిన ముఖ్యమంత్రి బుధవారం సంతమాగులూరు మండలం వెల్లల చెరువు, కామేపల్లి, అడ్డరోడ్డు జంక్షన్ మీదుగా పల్నాడు జిల్లా పిడుగురాళ్ల సమీపంలోని అయ్యప్ప నగర్‌లో ఏర్పాటు చేసిన బహిరంగ సభ స్థలికి చేరుకున్నారు. ఎండని సైతం లెక్కచేయకుండా జగన్‌ను చూసేందుకు ప్రజలు అడ్డరోడ్డు జంక్షన్ వద్దకు భారీ సంఖ్యలో వచ్చారు. ముఖంలోని ఎడమ సగం భాగంలో మల్టిపుల్‌హై అటెన్యూయేషన్ గడ్డలతో ఆసిఫైయింగ్ ఫైబ్రోమాతో బాధపడుతున్న సంతమాగులూరు మండలం కొమ్మాలపాడుకు చెందిన పదహారేళ్ల బాలుడు షేక్ హుస్సేన్ బాషాను తల్లిదండ్రులు సిఎం వద్దకు తీసుకొచ్చారు. సమస్యను ఆయనకు వివరించారు. దీనిపై ముఖ్యమంత్రి స్పందిస్తూ, ఆ బాలుడి వైద్య అవసరాలను తక్షణమే తీర్చాలని ఆరోగ్యశ్రీ అధికారులను ఆదేశించారు.

యువత భవిష్యత్తే ప్రధానం

- మధ్యతరగతి ప్రజల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి
- తణుకు సభలో చంద్రబాబు, పవన్‌కల్యాణ్

ప్రజాశక్తి- ఏలూరు ప్రతినిధి

తాము అధికారంలోకి రాగానే మొదటి సంతకం మెగా డిఎస్‌సిపై చేస్తామని, దాంతో పాటు యువతకు ఉపాధి కల్పనే లక్ష్యంగా పని చేస్తామని, అందుకే పొత్తు పెట్టుకున్నామని టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు, జనసేన అధినేత పవన్ కల్యాణ్ తెలిపారు. మధ్య తరగతి ప్రజానీకం అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు ప్రజాగళం యాత్రలో భాగంగా బుధవారం పశ్చిమగోదావరి జిల్లా తణుకులో టిడిపి, జనసేన ఉమ్మడి ఎన్నికల ప్రచార సభ నిర్వహించారు.

ఇరుపార్టీల అధినేతలు హెలికాప్టర్‌లో తణుకులోని పాలిటెక్నిక్ కళాశాలకు, అక్కడి నుంచి రోడ్ షోగా నరేంద్ర సెంటర్‌లో ఏర్పాటు చేసిన సభకు చేరుకున్నారు. ఈ సభలో చంద్రబాబు మాట్లాడుతూ జగన్ కబంధ హస్తాల నుంచి రాష్ట్రాన్ని కాపాడుకోవాలని కోరారు. తాను ఇబ్బందుల్లో ఉన్నప్పుడు పవన్ భేషరతుగా మద్దతిచ్చారని, ఇది ఎన్నటికీ మర్చిపోనని అన్నారు. ఓట్లు చీలకూడదనే లక్ష్యంతో పవన్ పని చేస్తున్నారని వివరించారు. కేంద్రం సహకారం అవసరమని బిజెపితో పొత్తు పెట్టుకున్నామని చెప్పుకొచ్చారు.



తణుకులో నిర్వహించిన రోడ్డు షోలో అభివాదం చేస్తున్న చంద్రబాబు, పవన్, సుజన

2014లో మాదిరిగా ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 15 స్థానాలు టిడిపి కూటమికి ఇవ్వాలని కోరారు. ఉద్యోగాలు కావాలన్నా, పోలవరం పూర్తి కావాలన్నా కేంద్రం మద్దతు కావాలని, అందుకే బిజెపితో పొత్తు పెట్టుకున్నామని సమర్థించుకున్నారు. విధ్వంస పాలన, గంజాయి, డ్రగ్స్ కార్యకలాపాలు, రహదారుల ఛిద్రం, అప్పులు, కల్తీ మద్యం, దళితుల హత్య వంటి వాటిపై ప్రజల్లో చర్చ జరగాలన్నారు. రైతులు ఆనందంగా లేరని తెలిపారు. గోనె సంచులు ఇవ్వలేని మంత్రి పౌరసరఫరాల శాఖ చూస్తున్నారని విమర్శించారు. ధాన్యం అమ్ముకోవడానికి రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చిందన్నారు. సూపర్ సిక్స్‌లో భాగంగా మహిళలకు పెద్ద పీట వేస్తామని తెలిపారు. తణుకులో ఉన్న మంత్రి కారుమూరి రూ.850 కోట్లు టిడిఆర్ బాండ్లలో, పేదలకు ఇళ్ల స్థలాల్లో, కాకినాడ పోర్టుకు బియ్యం రవాణాలో అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు.

మధ్యతరగతి ఉద్యోగులకు సహాయసహకారాలు

కూటమి అధికారంలోకి రాగానే అసెంబ్లీలో తమ తొలి మాటలు మధ్య తరగతి ప్రజానీకంపైనే ఉంటాయని పవన్ కల్యాణ్ తెలిపారు. మధ్యతరగతి ఉద్యోగులకు సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. దాదాపు రూ.70 వేల కోట్లు పోలీసులకు సంబంధించి టిఎ, డిఎ, సరెండర్ లీవుల సొమ్ము రాష్ట్ర ప్రభుత్వం దోచుకుందని విమర్శించారు. తాను యువత కోసం పని చేస్తున్నానని, అందుకే పొత్తులో కొంత తగ్గాల్సి వచ్చిందని తెలిపారు. రైతులను ఏడ్పించిన వైసిపి ప్రభుత్వం ఈ ఎన్నికల్లో తుడిచిపెట్టుకుపోవాలన్నారు. పోలవరం పునరావాసం గురించి అడిగితే సదరు మంత్రి డ్యాన్స్‌లు చేస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో టిడిపి జిల్లా అధ్యక్షులు తోట సీతారామలక్ష్మి, జనసేన, బిజెపి నేతలు పాల్గొన్నారు.

విశాఖ ఉక్కుపై పురందేశ్వరి అబద్ధాల ప్రచారం

- సిఐటియు
- కార్మికులు, ప్రజలు మోసపోరని ప్రకటన

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

బిజెపి రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి రానున్న ఎన్నికల కోసం విశాఖస్టీల్ ప్లాంట్‌పై అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని సిఐటియు రాష్ట్ర కమిటీ పేర్కొంది. ఈ మేరకు యూనియన్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎవి నాగేశ్వరరావు, సిహెచ్ నర్సింగరావు బుధవారం విడుదల చేసిన ప్రకటనలో ఈ అబద్ధాలతో కార్మికులు, ప్రజలు మోసపోరని పేర్కొన్నారు. స్టీల్‌ప్లాంట్‌ను లాభాల బాట పట్టించడం కోసం వాటాలు అమ్మకుండా మెరుగ్గా నడిపించడానికి కేంద్రప్రభుత్వం దృష్టిపెట్టినట్లు పురంధేశ్వరి చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. దేశంలోని ప్రైవేట్, పబ్లిక్ సెక్టార్ స్టీల్‌ప్లాంట్‌లన్నీ రెండేళ్లలో లాభాల్లో నడిచాయని తెలిపారు. విశాఖ ప్లాంట్ రెండేళ్ల నుంచి రూ.4వేల కోట్లకుపైగా నష్టాల్లోకి వెళ్లడానికి బిజెపి ప్రభుత్వ విధానాలే కారణమని పేర్కొన్నారు.

వాటాలు అమ్మడమే కాకుండా నూరుశాతం ప్లాంట్‌ను అమ్మాలనే లక్ష్యంతో 2021 జనవరి 27న వ్యూహాత్మకంగా కేంద్రప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసిందని తెలిపారు. దక్షిణకొరియా పోస్కోతో కేంద్ర స్టీల్‌శాఖ ఎంఓయు చేసుకుందని గుర్తుచేశారు. మూడో బ్లాస్ట్ ఫర్నేస్‌కు ముడిసరుకు సరఫరా పేరుతో జిందాల్‌తో చేసిన ఒప్పందం విశాఖ స్టీల్‌ను కారుచౌకగా అమ్మకానికి పెట్టే కుట్రలో భాగమేనని తెలిపారు. నూరుశాతం అమ్మకానికి పెట్టిన వాస్తవాన్ని మరుగునపర్చి ఎన్నికల్లో లబ్ధిపొందడానికి పురంధేశ్వరి అబద్ధాలు ప్రచారం చేస్తున్నారన్నారు.

భూములు ఎక్కడకూ పోవని, ప్లాంట్‌తోనే ఉంటాయని బిజెపి నాయకులు మొదటి నుంచి చేసే వాదన కూడా పూర్తి అబద్ధమని పేర్కొన్నారు. ప్రైవేట్‌కు అమ్మితే 22వేల ఎకరాల ప్లాంట్ భూములు వారి చేతుల్లోకి వెళ్లడం ఖాయమని తెలిపారు. లాభాల బాటలో నడపాలంటే నూరుశాతం అమ్మకం చేయాలనే నిర్ణయాన్ని కేంద్రప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించాలని, తక్షణమే ఎన్‌ఎమ్‌డిసి నుంచి ముడి ఖనిజాన్ని అప్పు రూపంలో సరఫరా చేయించాలని డిమాండ్ చేశారు. జిందాల్‌తో చేసుకున్న మూడో బ్లాస్ట్ ఫర్నేస్‌కు ముడిసరుకు సరఫరా చేసే ఒప్పందం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పదేళ్లుగా కార్మికులు, అధికారులకు పెండింగ్‌లో ఉన్న వేతన ఒప్పందం అమలు చేయాలని కోరారు.

గ్రూప్-2 స్క్రీనింగ్‌లో 92,950 మంది అర్హత

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఎపిపిఎస్‌సి) నిర్వహించిన గ్రూప్-2 స్క్రీనింగ్ టెస్ట్ ఫలితాలు విడుదలయ్యాయి. పరీక్షలో అర్హత సాధించిన వివరాలను కమిషన్ వెబ్‌సైట్ www.psc.ap.gov.inలో పొందుపరిచినట్లు ఎపిపిఎస్‌సి కార్యదర్శి జె ప్రదీప్ కుమార్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వివిధ ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న 897 గ్రూప్-2 పోస్టుల భర్తీ కోసం ఎపిపిఎస్‌సి డిసెంబరు 7న నోటిఫికేషన్ విడుదల చేసిన విషయం తెలిసిందే. ఫిబ్రవరి 25న జరిగిన పరీక్షకు 4.80 లక్షల మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. పరీక్ష రాసిన వారిలో 92,950 మంది అర్హత సాధించారు. 2,557 మంది అభ్యర్థులను వివిధ కారణాలతో తిరస్కరించినట్లు కార్యదర్శి వెల్లడించారు. అర్హత సాధించిన వారి జాబితాను, తిరస్కరించిన వారి జాబితాను విడివిడిగా విడుదల చేశారు. అర్హత సాధించిన అభ్యర్థులకు జులై 28న ప్రధాన పరీక్ష ఉంటుందని వెల్లడించారు.

ఇదేనా వికసిత భారత్?

- పోషకాహార లోపంతో చిన్నారుల కుంగుబాటు
- మహిళలు, పిల్లల్లో పెరుగుతున్న రక్తహీనత
- ఆకలితో అల్లాడుతున్న శిశువులు
- ఆహార సబ్సిడీల్లో కోత
- మోడీ వైఫల్యాలను ఎండగట్టిన 'రిపోర్ట్ కార్డ్'

లోపలి పేజీల్లో...

ఎన్నికలు ముగిసేవరకు ఐజాక్ జోలికెళ్లొద్దు

- ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్‌కు కేరళ హైకోర్టు ఆదేశం



గొంతెండుతోంది... నీరివ్వండి

- ఖాళీ బిందెలతో ఆందోళన
- మద్దతు తెలిసిన సిపిఎం

ప్రజాశక్తి- అజిత్‌సింగ్‌నగర్ (విజయవాడ)

'ప్రజల గొంతెండుతోంది. వెంటనే తాగునీరు సరఫరా చేయండి' అంటూ విజయవాడ నగరంలోని 64వ డివిజన్ నేతాజీ సుభాష్ చంద్రబోస్ నగర్ (కండ్రిక కాలనీ), ప్రజాశక్తి నగర్, బర్మాకాలనీ తదితర ప్రాంతాల ప్రజలు బుధవారం ఆందోళనకు దిగారు. స్థానికులు, మహిళలు ఖాళీ బిందెలతో నిరసన తెలిపారు. వారి ఆందోళనకు సిపిఎం విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ అభ్యర్థి, పార్టీ కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు మద్దతు తెలిపారు. గత రెండు నెలలుగా నీటి ఎద్దడితో ఇబ్బంది పడుతున్నామని, మురుగు నీరు సరఫరా అవుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. కృష్ణా నది నీరు కాకుండా బోర్ నీటిని అందిస్తున్నారని బాబూరావు దృష్టికి తీసుకెళ్లారు. నీటి సరఫరా తగ్గిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాప్రతినిధులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని వాపోయారు. ఈ సందర్భంగా బాబూరావు మాట్లాడుతూ కృష్ణా నది చెంతనే ఉన్న విజయవాడలో ఎన్నడూలేని విధంగా తాగు నీటికి ప్రజలు ఇబ్బంది పడాల్సి వస్తోందని తెలిపారు. దీనికి ప్రభుత్వమే బాధ్యత వహించాలన్నారు. తాగునీటితో వ్యాపారం చేయడం తప్ప, నీటి సరఫరాపై నగర పాలక సంస్థకు దృష్టి లేదని విమర్శించారు. ప్రజలకు తాగునీటిని అందించలేని దుస్థితిలో ప్రభుత్వం ఉందన్నారు. మురుగునీటి సరఫరాతో ప్రజల ఆరోగ్యం దెబ్బతింటోందని తెలిపారు. నీటి కాలుష్యంతో నలుగురు మరణించినా ప్రభుత్వం, నగరపాలక సంస్థ స్పందించకపోవడం శోచనీయమన్నారు. మూడు నెలలుగా తాగు నీటి కొరత ఉన్నా వైసిపి ప్రజా ప్రతినిధులు ఎందుకు స్పందించడంలేదని ప్రశ్నించారు. వేసవి ముంచుకొస్తున్నా సమ్మర్ యాక్షన్ ప్లాన్ లేదని, నీటి కొరతను అధిగమించే చర్యలు తీసుకోవడంలేదని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం 24 గంటల మంచినీటి పథకం 'అమృత్' పేరుతో నీటిమీటర్లు బిగించడానికి పూనుకుంటోందన్నారు. ఇందుకుగాను కేంద్రం విధిస్తున్న షరతులకు రాష్ట్ర ప్రభుత్వం లొంగిపోయి నగరంలో లక్ష మీటర్ల ఏర్పాటుకు సిద్ధపడిందని తెలిపారు. నీటి మీటర్లు పెట్టడంపై



విజయవాడ కండ్రిక ప్రాంతంలో ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న ప్రజలు, మహిళలు, సిపిఎం నాయకులు

మిగతా 2లో

ఉత్సాహంగా పిడకల సమరం

- 30 మందికి గాయాలు

ప్రజాశక్తి - ఆస్పరి (కర్నూలు)

కర్నూలు జిల్లా ఆస్పరి మండలం కైరుప్పల గ్రామంలో పిడకల సమరం ఉత్కంఠ భరితంగా సాగింది. ఉగాది పండుగ మరుసటి రోజు పిడకల సమరం నిర్వహించడం ఇక్కడ ఆనవాయితీ. ఆంధ్రా నుంచే కాకుండా మహారాష్ట్ర, తెలంగాణ, తమిళనాడు, కేరళ తదితర రాష్ట్రాల నుంచి వేలాది మంది యాత్రికులు కైరుప్పలకు వచ్చి పిడకల సమరాన్ని వీక్షించారు. యాత్రికులతో ఈ గ్రామం కిక్కిరిసిపోయింది. గ్రామంలో కాళికాదేవి, వీరభద్ర స్వామి వారు రెండు గ్రూపులుగా విడిపోయి పిడకలతో కొట్టుకోవడం, తర్వాత అంత కలిసిపోవడం గ్రామ ఆనవాయితీ. ఉత్సవాల రోజు సాయంత్రం 5.30 గంటలకు ఆస్పరి మండలం కారుమంచి గ్రామం నుంచి రెడ్డి వంశస్తుడు నరసింహారెడ్డి తన అశ్వంపై మంది మార్బలంతో కైరుప్పల గ్రామానికి చేరుకున్నారు. వీరభద్ర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజల అనంతరం ఆయన తిరిగి కారుమంచికి వచ్చారు. నరసింహారెడ్డి వెనుదిరిగిన అనంతరం ఇరు గ్రూపుల వారు అటు, ఇటు వందల మంది రెండు గ్రూపులుగా విడిపోయి ఒకరిపై ఒకరు పిడకలతో కొట్టుకున్నారు. కుప్పలుగా వేసిన పిడకలు అయిపోయేంత వరకు ఈ పోరు కొనసాగింది. సుమారు 30 మందికి స్వల్ప గాయాలయ్యాయి. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలూ చోటు చేసుకోకుండా పత్తికొండ డిఎస్‌పి శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో ముగ్గురు సిఐలు, ముగ్గురు ఎస్ఐలు, వందమంది కానిస్టేబుళ్లతో బందోబస్తు ఏర్పాటు చేశారు.



పిడుకలతో కొట్టుకుంటున్న గ్రామస్తులు

మానవాళికి హితాన్ని బోధించే రంజాన్

- గవర్నర్, ప్రభృతుల రంజాన్ శుభాకాంక్షలు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

మానవాళికి హితాన్ని బోధించే పండగ రంజాన్ అని గవర్నరు ఎస్ అబ్దుల్ నజీర్ పేర్కొన్నారు. సామరస్యానికి, సుహృద్భావానికి, సర్వమానవ సమానత్వానికి, కరుణ, దాతృత్వానికి ప్రతీక అని సిఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. రంజాన్ పండగ సందర్భంగా రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. పవిత్ర దివ్యఖురాన్ అవతరించిన ఈ మాసంలో కఠిన ఉపవాస దీక్షలకు రంజాన్ ఒక ముగింపు వేడుక అని, అల్లా దీవెనలతో రాష్ట్ర ప్రజలకు శుభాలు కలగాలని టిడిపి అధినేత చంద్రబాబు, జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు బుధవారం వేర్వేరు ప్రకటనలు విడుదల చేశారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..
స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ, ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ, అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి, గుంటూరు జిల్లా - 522 501కు కానీ
editorprajasakthi@gmail.comకు పంపవచ్చు.

జనసేనకు నెల్లూరు జిల్లా అధ్యక్షులు గుడ్‌బై

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

జనసేన నెల్లూరు జిల్లా అధ్యక్షులు మనుక్రాంత్‌రెడ్డి ఆ పార్టీకి గుడ్‌బై చెప్పారు. త్వరలో వైసిపిలో చేరుతున్నట్లు ఆయన ప్రకటించారు. బుధవారం రాత్రి మాగుంట లేఅవుట్‌లోని మనుక్రాంత్ నివాసానికి ఎంపిలు, విజయసాయిరెడ్డి, బీద మస్తాన్‌రావు, ఆదాల ప్రభాకర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షులు పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి వెళ్లి, మనుక్రాంత్‌రెడ్డిని కలిశారు. పార్టీలోకి రావాలని ఆయనను ఆహ్వానించారు. అనంతరం మనుక్రాంత్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. తాను ఆరేళ్ల పార్టీ కోసం పనిచేశానని, టికెట్ ఇవ్వకపోవడంతో మనస్తాపం చెందానని తెలిపారు. జగన్ సమక్షంలో వైసిపిలో చేరుతానని ప్రకటించారు.

రూ.7.30 లక్షల నగదు సీజ్

ప్రజాశక్తి-యంత్రాంగం

ఎన్నికల నేపథ్యంలో పోలీసులు బుధవారం పలుచోట్ల చేపట్టిన వాహన తనిఖీల్లో రూ.7.30 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. సరైన పత్రాలు చూపకపోవడంతో పట్టుబడిన నగదును సీజ్ చేశారు. విశాఖ ఎంవిపి కాలనీ సర్కిల్ సమీపంలో పోలీసులు వాహన తనిఖీలు చేస్తుండగా వైసిపి రాజ్యసభ సభ్యులు వైవి సుబ్బారెడ్డి ప్రయివేటు కార్యదర్శి జి.దశరథరామిరెడ్డి కారులో రూ.6 లక్షల నగదును గుర్తించారు. ఇంటి కొనుగోలు నిమిత్తం తీసుకెళ్తున్నానని దశరథ రామిరెడ్డి అధికారులకు వివరించారు. అందుకు తగిన ఆధారాలు చూపకపోవడంతో నగదును సీజ్ చేశారు. ఏలూరు జిల్లా చింతలపూడి మండలంలోని అల్లిపల్లి చెక్‌పోస్ట్ వద్ద ఎస్ఎస్‌టి బృందం తనిఖీలు చేస్తుండగా ఎలాంటి ఆధారాలు లేకుండా తీసుకెళ్తున్న రూ.1.30 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు.

గొంతెండుతోంది... నీరివ్వండి

(మొదటిపేజీ తరువాయి)

ఉన్న శ్రద్ధ, తాగు నీటి సరఫరాలో లేకుండా పోయిందని విమర్శించారు. 24 గంటలూ మద్యం సరఫరా చేస్తున్న ప్రభుత్వం, అరగంట సేపు కూడా మంచినీరు సరఫరా చేయకపోవడం బాధాకరమన్నారు. గత టిడిపి ప్రభుత్వ హయాంలో విజయవాడ నగర పాలక సంస్థ ప్రతి సంవత్సరం ఏడు శాతం చొప్పున మంచినీటి ఛార్జీలు పెంచిందని తెలిపారు. వైసిపి ప్రభుత్వం కూడా అదే దారిలో నడిచిందని వివరించారు. కార్పొరేషన్లో వామపక్షాలు అధికారంలో ఉన్నప్పుడు సింగ్‌నగర్, పాయకాపురం ప్రాంతానికి ఎనిమిది ఎంజిడి ప్లాంట్ ద్వారా కృష్ణా నది నుండి తాగు నీటిని అందించిన విషయాన్ని ఈ సందర్భంగా బాబూరావు గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం సెంట్రల్ సిటీ కార్యదర్శి బి.రమణారావు, నాయకులు కె.దుర్గారావు, ఝాన్సీ పాల్గొన్నారు.

పోలీసు స్టేషన్‌పై దాడి ఘటనలో ముగ్గురు వైసిపి నేతలపై కేసు

ప్రజాశక్తి-కృష్ణాప్రతినిధి

కృష్ణా జిల్లా మచిలీపట్నం పోలీస్ స్టేషన్‌పై దాడి ఘటనలో అధికార వైసిపికి చెందిన ఇద్దరు కార్పొరేటర్లతోపాటు అర్బన్ బ్యాంకు డైరెక్టర్‌పై చిలకలపూడి స్టేషన్‌లో బుధవారం కేసు నమోదైంది. 18, 33 డివిజన్‌ల కార్పొరేటర్లు మేకల వెంకట సుధాకరబాబు (సుబ్బన్న), మీర్ మహ్మద్ సయ్యద్(అస్గర్)లతోపాటు అర్బన్ బ్యాంకు డైరెక్టర్ జువ్వాది రాంబాబులపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉండగా 144 సెక్షన్ అతిక్రమించారని సెక్షన్ 188, ఉద్దేశ్యపూర్వకంగా పోలీస్ స్టేషన్ వద్ద గలాటా సృష్టించారని సెక్షన్ 143, సిసి కెమెరా, ఫర్నిచర్, పోలీసు జీపు సైరన్ ధ్వంసం చేశారనే కారణంతో సెక్షన్ 427 కింద కేసు నమోదు చేశారు. పోలీస్ స్టేషన్ వద్ద సెంట్రీ విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ హరికృష్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. అయితే, స్టేషన్‌కు వెళ్లిన ఎమ్మెల్యే పేర్ని నానిపై కేసు నమోదు చేయకపోవడం గమనార్హం.

మూడు రోజుల క్రితం పోతేపల్లి పంచాయతీ పరిధిలోని ఉల్లిపాలెంలో నిర్వహించిన నూకాలమ్మ జాతర సంబరాల్లో జరిగిన దాడికి సంబంధించి మాట్లాడుతుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. అయితే, తమను ఎస్ఐ స్టేషన్‌కు పిలిచి కొట్టారని వైసిపి కార్యకర్తలు ఆరోపించారు. దీంతో పోలీసు స్టేషన్ వద్ద ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య (నాని) తన అనుచరులతో కలిసి మంగళవారం పోలీసు స్టేషన్ వద్ద ఆందోళనకు దిగారు. ఈ నేపథ్యంలో పేర్ని నాని అనుచరులపై కేసులు నమోదయ్యాయి. వైసిపి కార్యకర్తలు చేసిన ఆరోపణలపై విచారణ చేపట్టిన పోలీసు ఉన్నతాధికారులు ఎస్ఐ చాణక్యను విఆర్‌కు పంపినట్లు సమాచారం.

పెట్రోల్ బంకుల వద్ద ఓటు హక్కుపై అవగాహన

- సిఇఒ ఎంకె మీనా

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర వ్యాప్తంగా పెట్రోల్ బంకుల వద్ద హోర్డింగుల ఏర్పాటు ద్వారా ఓటు హక్కుపై ప్రజల్లో అవగాహన కల్పించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా చమురు పరిశ్రమల ప్రతినిధులను కోరారు. సచివాలయంలోని ఆయన ఛాంబర్‌లో బుధవారం హెచ్‌పిసిఎల్, ఐఒసిఎల్, బిపిసిఎల్ చమురు పరిశ్రమల ప్రతినిధులతో ఓటర్ల అవగాహన కార్యక్రమాల నిర్వహణపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మీనా మాట్లాడుతూ.. క్రమబద్ధమైన ఓటర్ల విద్య, ఎన్నికల భాగస్వామ్యం కార్యక్రమం అమల్లో భాగంగా ఓటర్ల అవగాహన కార్యక్రమాలను చమురు పరిశ్రమల ద్వారానూ నిర్వహించాలని కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశించినట్లు ఆయన తెలిపారు. ఇప్పటికే పోస్టల్‌శాఖ ద్వారా ఓటర్ల అవగాహన కార్యక్రమాలను చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఇసిఐ లోగోతో ఎన్నికల తేదీ, ఓటు హక్కు విలువను తెలియజేసే నినాదాలతో హోర్డింగుల డిజైన్లను అందజేస్తామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని పెట్రోల్ బంకుల వద్ద హోర్డింగులను ఏర్పాటు చేయాలన్నారు. సిఇఒ ప్రతిపాదనలకు కంపెనీల ప్రతినిధులు సానుకూలంగా స్పందించారు. ఈ సమావేశంలో అదనపు సిఇఒ ఎమ్ఎన్ హరీందర్ ప్రసాద్, డిప్యూటీ సిఇఒ ఎస్ మల్లిబాబు, చమురు పరిశ్రమల రాష్ట్ర స్థాయి సమన్వయకర్త జె సంజయ్‌కుమార్, హెచ్‌పిసిఎల్ చీఫ్ రీజనల్ మేనేజరు ఆదిత్య ఆనంద్, ఒసిఎల్ ప్రతినిధి ఎ అనిల్‌కుమార్, బిపిసిఎల్ టెరిటరీ మేనేజరు ప్రసాద్ రాజ్వాడే పాల్గొన్నారు.

హోర్డింగుల గుర్తింపు తప్పనిసరి

ఎన్నికల సంబంధిత మెటీరియల్‌పై హోర్డింగులతో సహా ప్రింటర్, పబ్లిషర్ల గుర్తింపును ఇసి తప్పనిసరి చేసింది. మున్సిపల్ అధికారుల నియంత్రణలో ఉన్న హోర్డింగు స్థలాల్లో గుర్తింపు లేకుండా హోర్డింగులు వెలుస్తున్నాయని ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదులు అందుతున్న నేపథ్యంలో కేంద్ర ఎన్నికల సంఘం ఈ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు తాజాగా రాష్ట్రాలకు పంపిన లేఖలో ప్రజాప్రాతినిధ్య చట్టం 1951లోని సెక్షన్ 127ఎ, ప్రింటర్, ప్రచురణకర్త, చిరునామాను ప్రదర్శించకుండా ఎన్నికల కరపత్రాలు, పోస్టర్లు, ప్లకార్డులు, బ్యానర్లను ముద్రించడం, ప్రచురించడాన్ని నిషేధించిన సంగతి ఇసి గుర్తుచేసింది.



మేనిఫెస్టోను విడుదల చేస్తున్న సిపిఐ నేతలు

సిపిఐ ఎన్నికల మేనిఫెస్టో విడుదల

- ఇండియా వేదిక అభ్యర్థులను గెలిపించాలని పిలుపు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

సిపిఐ రాష్ట్ర కమిటీ ఎన్నికల మానిఫెస్టోను విడుదల చేసింది. 'జనం కోసం-జనంమధ్యకు-జనప్రణాళిక' పేరుతో రూపొందించిన మానిఫెస్టోను ఆ పార్టీ రాష్ట్రకార్యదర్శి కె రామకృష్ణ విజయవాడలోని సిపిఐ కార్యాలయంలో బుధవారం విడుదల చేశారు. దేశంలో వ్యవస్థలను ధ్వంసం చేస్తున్న నరేంద్రమోడీని, బిజెపికి వంతపాడుతున్న వైసిపి, టిడిపిలను ఓడించాలని పిలుపునిచ్చారు. లౌకిక ఇండియా వేదిక అభ్యర్థులను గెలిపించాలని రామకృష్ణ ఈ సందర్భంగా కోరారు. దేశం ఎదుర్కొంటున్న సమస్యలపై వైసిపి, టిడిపి ఒకరినొకరు తిట్టుకునే దురదృష్టకర వాతావరణం నెలకొనడం బాధాకరమన్నారు. వ్యవసాయ పరిస్థితి, పారిశ్రామిక రంగం, సాగునీటి ప్రాజెక్టులు వంటి మౌలిక సమస్యలు, అభివృద్ధి గురించి ప్రస్తావించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రెండు పార్టీలు అలవిగాని వాగ్దానాలు చేస్తున్నాయని, వీటి అమలుకు కేంద్రబడ్జెట్ కూడా సరిపోదన్నారు. 2014 ఎన్నికల్లో రైతులకు స్వామినాథన్ కమిటీ సిఫార్సులు అమలు చేస్తామని చెప్పి నరేంద్రమోడీ రైతులను మోసం చేశారని విమర్శించారు. ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని మోడీ, ప్రతి ఏటా జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని జగన్ నిరుద్యోగులను మోసం చేశారని విమర్శించారు. మెగా డిఎస్సి అని చెప్పి మోసపు డిఎస్సి ఇచ్చారని, ఇప్పుడు ఆ ఉద్యోగాలు కూడా వచ్చే పరిస్థితి లేదన్నారు.సిపిఎస్ అంశాన్ని పక్కన పెట్టాశారని పేర్కొన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి, ప్రధానమైన ప్రజల సమస్యలపై చర్చించి వాటి పరిష్కారం కోసం ఎన్నికల ప్రణాళిక రూపొందించామని చెప్పారు. రైతాంగ వ్యవసాయ రుణాల రద్దు, స్వామినాథన్ కమిటీ సిఫార్సుల మేరకు పంటలకు మద్దతు ధర, గ్రామీణ పేదలకు సాగుభూముల పంపిణీ, కనీసం వేతనం రూ.36వేలు, ఒప్పంద, పొరుగు సేవల ఉద్యోగుల విధానం రద్దు చేసి వారిని క్రమబద్ధీకరించడం, సామాజిక న్యాయం, సిపిఎస్ రద్దు తదితర అంశాలపై మానిఫెస్టో రూపొందించామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, కార్యదర్శివర్గ సభ్యులు జల్లి విల్సన్, జి ఓబులేసు, కెవివి ప్రసాద్, దుర్గాభవాని పాల్గొన్నారు.

వైసిపిలో చేరిన పోతిన మహేష్

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి



వైసిపిలో చేరిన పోతిన మహేష్

పల్నాడు జిల్లా గంటావారిపాలెంలో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ సమక్షంలో పలువురు జనసేన, టిడిపి నాయకులు బుధవారం వైసిపిలో చేరారు. పార్టీ కండువాలు కప్పి వారిని సిఎం జగన్ ఆహ్వానించారు. విజయవాడ పశ్చిమ నియోజకవర్గం జనసేన నాయకులు పోతిన మహేష్ ఇటీవల పవన్ కల్యాణ్‌పై తీవ్ర విమర్శలు చేసి జనసేనకు గుడ్‌బై చెప్పారు. బుధవారం ఉదయం సిఎం జగన్ సమక్షంలో వైసిపిలో చేరారు. జనసేన విజయవాడ నగర ఉపాధ్యక్షులు వెన్న శివశంకర్, పశ్చిమ నియోజకవర్గం డివిజన్ అధ్యక్షులు షేక్ అమీర్ బాషా, పి.శ్రీనివాసరావు, ఎస్.రాముగుప్తా, పిల్లా.వంశీకృష్ణ, సోమి గోవిందరావు, ఎం.హనుమాన్, సయ్యద్ మొబీనా, జెల్లి రమేష్ తదితరులు జనసేన నుంచి వైసిపిలో చేరిన వారిలో ఉన్నారు. తూర్పుగోదావరి జిల్లా పి.గన్నవరానికి చెందిన మాజీ ఎమ్మెల్యే పాముల రాజేశ్వరీదేవి జనసేనకు రాజీనామా చేసి సిఎం జగన్ సమక్షంలో వైసిపిలో చేరారు. తెలుగుదేశం నుంచి రాయచోటి మాజీ ఎమ్మెల్యే ఆర్.రమేష్ కుమార్ రెడ్డి వైసిపిలో చేరారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు ఆళ్ల అయోధ్య రామిరెడ్డి, వైవి.సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

విశాఖ ఉక్కును కాపాడుకుందాం

ప్రజాశక్తి-ఉక్కునగరం (విశాఖపట్నం)

'విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు' అనే నినాదంతో ఏర్పడిన విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకుందామని టిడిపి గాజువాక ఎమ్మెల్యే అభ్యర్థి పల్లా శ్రీనివాసరావు అన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యాన కూర్మన్నపాలెంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు బుధవారం నాటికి 1054వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షా శిబిరాన్ని పల్లా శ్రీనివాసరావు సందర్శించారు. కార్మికులతో కలిసి దీక్షాశిబిరంలో బైఠాయించి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా మొట్టమొదటిసారి గాజువాకలో టిడిపి తరుపున తాను నిరాహార దీక్ష చేశానని గుర్తుచేశారు. విశాఖ ఉక్కును కాపాడుకునేంతవరకు కార్మికులకు టిడిపి అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎంఎస్ విభాగానికి చెందిన కార్మికులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యపై దృష్టిపెట్టాలి

- టిడిపి అధినేత చంద్రబాబు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో తీవ్రంగా ఉన్న తాగునీటి సమస్యపై దృష్టి పెట్టాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు కోరారు. రైతులకు సాగునీరు లేదని, ప్రజలకు తాగునీరు లేదని బుధవారం ఎక్స్(ట్విట్టర్)లో పేర్కొన్నారు. సీమలోని పల్లెల నుంచి గోదావరి జిల్లాలోని ఏజెన్సీ వరకు ఎక్కడ చూసినా అంతా దుర్భర పరిస్థితే అని పేర్కొన్నారు. కరెంటు బిల్లులు కట్టక కొన్ని, నిర్వహణ లేక ఇంకొన్ని తాగునీటి పథకాలు మూలనపడ్డాయని తెలిపారు.

పేర్ని నానిపై ఇసికి ఫిర్యాదు

మచిలీపట్నం పోలీస్ స్టేషన్‌పై మాజీ మంత్రి పేర్ని నాని, వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి పేర్ని కిట్టు దాడి చేశారని, వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సిఇఒ ముకేష్‌కుమార్ మీనాకు టిడిపి ఫిర్యాదు చేసింది. సచివాలయంలో మీనాను కలిసి ఆ పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు వర్ల రామయ్య, మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు బుధవారం ఫిర్యాదు చేశారు. 2019 తర్వాత కడప జిల్లాలో నియమించబడ్డ హోంగార్డులను ఇతర జిల్లాలకు బదిలీ చేయాలని టిడిపి ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామ్‌గోపాల్ రెడ్డి లేఖ ద్వారా సిఇఒకు ఫిర్యాదు చేశారు. సిఎం జగన్ ప్రతిపక్షనేతగా ఉన్న సమయంలో తన వద్దనున్న ప్రైవేటు సెక్యూరిటీని హోంగార్డులుగా నియమించారని తెలిపారు.

కమీషన్ల కోసం సిఎం జగన్ బహిరంగ మార్కెట్‌లో అధిక ధరకు విద్యుత్ కొనుగోలు చేస్తున్నారని టిడిపి కార్యానిర్వాహక కార్యదర్శి నాదెళ్ల బ్రహ్మం చౌదరి విమర్శించారు. టిడిపి కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. సిఎం జగన్, మంత్రి విడదల రజిని చర్యలతో వైద్యరంగం నిర్వీర్యమైందని టిడిపి ఉపాధ్యక్షులు వేమూరి ఆనంద్ సూర్య విమర్శించారు. వలంటీర్లను పార్టీ సేవకులుగా కాకుండా ప్రజాసేవకులుగా తీర్దిదిద్దుతామని ఆ పార్టీ ప్రతినిధి మదిపట్ల సూర్యప్రకాష్ తెలిపారు.

హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ లిమిటెడ్
HDFC BANK
బ్రాంచి: నాల్గవ అంతస్తు, కృషె సప్ఫైర్, ఎంఎస్‌ఆర్ బ్లాక్, హైటెక్ సిటీ మెయిన్ రోడ్, మాధాపూర్, హైదరాబాద్-500081.
CIN L65920MH1994PLC080618 Website: www.hdfcbank.com

డిమాండ్ నోటీసు

ది సెక్యూరిటీ ఇంటెరెస్ట్ (ఎన్ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 3తో చదువబడే ది సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటెరెస్ట్ యాక్ట్, 2002 (చట్టం) యొక్క సెక్షన్ 13(2) క్రింద.

ఏదైతే క్రింది సంతకందారు **హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ లిమిటెడ్** (ఇటీవలి హెచ్‌డిఎఫ్‌సి లిమిటెడ్ అనునది తేది.17 మార్చి 2023నాటి ఉత్తర్వుల ఆధారంగా గౌరవఎన్‌సిఎల్‌టి-ముంబయి వారి ఆమోదంతో స్కీమ్ ఆఫ్ అమాల్గమేషన్ యొక్క విర్చ్యూ ద్వారా హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ లిమిటెడ్‌తో అమాల్గమేషన్ చేయబడినది) **(హెచ్‌డిఎఫ్‌సి)** యొక్క అధీకృత అధికారిగా, ది సెక్యూరిటీ ఇంటెరెస్ట్ (ఎన్ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 3తో చదువబడే ది సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటెరెస్ట్ యాక్ట్, 2002 (చట్టం) యొక్క సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగించి, సదరు చట్టం యొక్క సెక్షన్ 13(2) క్రింద డిమాండ్ నోటీసులు జారీచేసి, ఇందు జాబితాలోని రుణగ్రహీతలు/చట్టబద్ధ వారసులు/చట్టబద్ధ ప్రతినిధులను దిగువ ఇచ్చిన వివరాల ప్రకారం, సదరు నోటీసు తేది నుండి 60 రోజుల్లోగా సదరు డిమాండ్ నోటీసుల్లో పేర్కొనబడిన మొత్తాలను చెల్లించవలసిందిగా కోరబడినది. సదరు రుణగ్రహీతలు/చట్టబద్ధ వారసులు/చట్టబద్ధ ప్రతినిధుల గతంలో తెలిసిన చిరునామాల ఆవరణల వద్ద నోటీసు అతికించుట జరిగింది. సదరు నోటీసుల కాపీలు క్రింది సంతకందారు వద్ద అందుబాటులో ఉంటాయి మరియు సదరు రుణగ్రహీతలు/చట్టబద్ధ వారసులు/చట్టబద్ధ ప్రతినిధులు అవసరమైనచో, క్రింది సంతకందారు నుండి ఏదేని పనిదినమున పనివేళల్లో సదరు కాపీలను సేకరించవచ్చును.

పై దానిననుసరించి, ఇందుమూలంగా మరోసారి సదరు రుణగ్రహీతలు/చట్టబద్ధ వారసులు/చట్టబద్ధ ప్రతినిధులకు ప్రకటన ఇవ్వడమేమనగా, ఈ నోటీసు ప్రచురించబడిన తేది నుండి 60 రోజుల్లోగా ఇందు దిగువ వారి పేర్లకు ఎదురుగా పేర్కొనబడిన మొత్తాలను కాలం(సి)లో దిగువ పేర్కొనబడిన సదరు తేదీ నుండి చెల్లించు తేది/రియలైజేషన్ వరకు సదరు డిమాండ్ నోటీసుల్లో వివరించినట్లు వార్షికానికి 18%తో తదుపరి వడ్డీతోపాటు సదరు రుణగ్రహీతలచే నిర్వహించబడిన ఏవేని రుణఒప్పందం మరియు ఇతర పత్రాలు/వ్రాతలుతో చదువుకోగలరు. రుణాన్ని తిరిగిచెల్లించుటకుగాను హామీగా సదరు రుణగ్రహీతలచేత దిగువ సెక్యూర్డ్ అసెట్స్‌ను **హెచ్‌డిఎఫ్‌సి** వారికి తాకట్టుపెట్టబడినవి. సెక్యూర్డ్అసెట్స్‌ను విడిపించుకొనుటకు అందుబాటులోగల సమయంకు సంబంధించి, చట్టం యొక్క సెక్షన్ 13 యొక్క సబ్-సెక్షన్ (8) యొక్క నియమాలను రుణగ్రహీతలు/చట్టబద్ధ వారసులు/చట్టబద్ధ ప్రతినిధులు శ్రద్ధవహించవలసిందిగా కోరబడుచున్నది.

క్ర. సం.	రుణగ్రహీతలు/చట్టబద్ధ వారసులు/ చట్టబద్ధ ప్రతినిధుల పేరు	పూర్తి బకాయి మొత్తాలు	డిమాండ్ నోటీసు తేది	సెక్యూర్డ్ అసెట్స్/ స్థిరాస్తుల వివరణ
(a)	(b)	(C)	(d)	(e)
1	శ్రీమతి చందోలు శ్రీలక్ష్మి (రుణగ్రహీత) శ్రీ.నిజాంపట్నం నరేంద్ర ప్రసాద్ (సహ-రుణగ్రహీత)	29 ఫిబ్రవరి, 2024 నాటికి రూ.61,87,019/- (రూపాయలు అరవైఒక లక్షల ఎనభైఏడువేల పందొమ్మిది మాత్రమే)	23-MAR-2024	రేండ్లగడ్డ గ్రామం, జి.పి.రామేశ్వరంబండ (గతంలో ఇంద్రేశం జి.పి), అమీన్‌పూర్‌మండలం, సంగారెడ్డి జిల్లా, తెలంగాణ రాష్ట్రంలోని సర్వే నెం.లు 20, 21, 22 మరియు 23లోగల "అల్పైన్ విస్టాస్" యొక్క 165 చదరపు గజాలు లేదా 137.96 చదరపు మీటర్ల విస్తీర్ణంలో నిర్మించిన అందులోని గ్రౌండ్‌ఫ్లోర్‌లో 948చ.అ.లు లేదా 88.07చ.మీ.లు, మొదటి అంతస్తులోని 948చ.అ.లు లేదా 88.07చ.మీ.లు మరియు 180చ.అ.లు లేదా 16.72చ.మీ.ల హెడ్ రూమ్ ఏరియా యొక్క నిర్మితమైన ఏరియా ఆ విధంగా పూర్తి నిర్మితమైన ఏరియా 2076చ.అ.లు లేదా 192.86 చ.మీ.లతో గ్రౌండ్ ప్లస్ ఒక పై అంతస్తు కలిగియున్న విల్లా నెం.71 మొత్తం మరియు సరిహద్దులు: **ఉత్తరం:** 10మీ.ల వెడల్పు రోడ్డు, **దక్షిణం:** విల్లా నెం.70, **తూర్పు:** 10 మీ.ల వెడల్పు రోడ్డు, **పడమర:** విల్లా నెం.72.

ఒకవేళ సదరు రుణగ్రహీతలు చెల్లించు/రియలైజేషన్ తేదీ వరకు వర్తించబడు వార్షికానికి 18% తదుపరి వడ్డీ, ఇన్సిడెంటల్ వ్యయాలు, ఖర్చులు, చార్జీలు మొ॥వాటితో పై చెప్పినట్లు **హెచ్‌డిఎఫ్‌సి** వారికి చెల్లించుటలో విఫలం చెందినట్లైతే, **హెచ్‌డిఎఫ్‌సి** యొక్క ఖర్చులు& కన్సిక్వెన్సెస్‌గా సదరు రుణగ్రహీతలు/చట్టబద్ధ వారసులు/చట్టబద్ధ ప్రతినిధుల పూర్తి బాధ్యతపైననే సదరు చట్టం యొక్క సెక్షన్ 13(4) మరియు వర్తించదు రూల్స్ క్రింద పై సెక్యూర్డ్ అసెట్స్/స్థిరాస్తుల పై చర్యలు తీసుకొంటుంది.

సదరు రుణగ్రహీతలు/చట్టబద్ధ వారసులు/చట్టబద్ధ ప్రతినిధులు సదరు చట్టం క్రింద **హెచ్‌డిఎఫ్‌సి** యొక్క వ్రాతపూర్వక మందస్తు అనుమతిలేనిదే అమ్మకం, లీజు లేదా ఇతర విధానాల ద్వారా పై చెప్పిన సెక్యూర్డ్ అసెట్స్/స్థిరాస్తులను బదిలీచేయలేరు. ఈ చట్టం లేదా దాని క్రింద రూపొందించిన రూల్స్ యొక్క నియమాలలో ఎవరైనా ఉల్లంగించినట్లైతే, చట్టం క్రింద ఇవ్వబడినట్లుగా జైలు శిక్ష మరియు/లేదా జరిమానాకు బాధ్యులగుదురు.

తేది: 10-04-2024
ప్రదేశం: హైదరాబాద్
హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ లిమిటెడ్ తరపున
సం/-
అధీకృత అధికారి
రిజిస్టర్డు ఆఫీసు: హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ హౌస్, సేనాపతి బాపట్ మార్గ్, లోయర్ ప్యారెల్ (వెస్ట్), ముంబయి-400020.

కెనరా బ్యాంక్ Canara Bank (భారత ప్రభుత్వరంగ సంస్థ) సిండికేట్ Syndicate
మధునగర్ బ్రాంచ్ (1620)
అను కాంప్లెక్స్, మధునగర్, మొగల్‌రాజపురం, విజయవాడ-10. ఫోన్: 0866-2475015.

సెక్షన్ 13(4) స్వాధీనత ప్రకటన (స్థిరాస్తి కొరకు)

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 (చట్టం 54, 2002) (ఇకమీదట "చట్టం" గా పిలవబడును) ప్రకారం **కెనరా బ్యాంక్** యొక్క అధీకృత అధికారి అయిన దిగువ సంతకందారు సెక్షన్ 13 (12) కు అనుబంధమైన సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 లోని 3వ నిబంధన ప్రకారం సంక్రమించిన అధికారాలను వినియోగించి **ఋణగ్రహీత: శ్రీ కోట ప్రకాశరావు** వారిని నోటీసులో ఉదహరించబడిన బకాయి సొమ్ము **రూ. 13,64,127.73 (అక్షరాల పదమూడు లక్షల అరవై నాలుగు వేల నూట ఇరవై ఏడు రూపాయలు మరియు డెబ్బై మూడు పైసలు)** మొత్తంను నోటీస్ అందిన తేది నుండి 60 రోజుల లోపు చెల్లించవలసినదిగా కోరుతూ తేది **16.01.2024న డిమాండ్ నోటీసును జారీచేయడమైనది.**

ఋణగ్రహీత సదరు పైన తెలిపిన బకాయిసొమ్మును చెల్లించుటలో విఫలమైనందున, దిగువ సంతకందారు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 లోని సెక్షన్ 13(4) కు అనుబంధమైన సదరు రూల్ 8 & 9 ప్రకారము సంక్రమించిన అధికారములను వినియోగిస్తూ దిగువ తెలిపిన ఆస్తిని **06.04.2024వ తేదీన స్వాధీనపరచుకున్నారని** ఋణగ్రహీత, హామీదారు మరియు యావన్మంది ప్రజానీకమునకు ఇందుమూలముగా తెలియజేయడమైనది.

ప్రత్యేకముగా ఋణగ్రహీత, హామీదారు మరియు ప్రజానీకమును హెచ్చరించునది ఏమనగా ఈ ఆస్తి విషయమై ఎవ్వరూ ఎటువంటి లావాదేవీలు జరుపరాదని, ఒకవేళ లావాదేవీలు జరిపిన అవి **కెనరా బ్యాంక్** వారికి తేది. 03.04.2024 నాటికి చెల్లించవలసిన బకాయి **రూ. 13,91,869.73** + భవిష్యత్తు వడ్డీ మరియు ఇతర ఛార్జీలు కలిపి మొత్తమునకు లోబడివుంటాయి.

సెక్షన్ 13(8) చట్ట ప్రకారము ఋణగ్రహీత'లు తమ తనఖా ఆస్తులను విడిపించుకోవటానికి ఉన్న కాలవ్యవధిని వినియోగించుకోగలరని సూచించడమైనది.

స్థిరాస్తి వివరములు

ఐటమ్ నెం.1: కృష్ణా జిల్లా, పెనమలూరు మండలం, కానూరు, ఆర్.ఎస్.నెం 27/7 నందు 180.55 చ॥గ॥ స్థలంలో అవిభాజ్యపు వాటా 25.792 చ॥గ॥. హద్దులు: తూర్పు: 9 అ॥ వెడల్పు నడక దారి, దక్షిణం: పెర్ని కృష్ణ మూర్తి ఆస్తి, పడమర: లంకె నాగభూషణం ఆస్తి, ఉత్తరం: బోయిన సుబ్బారావు ఆస్తి. **ఐటమ్ నెం.2:** ఐటమ్ నెం.1 స్థలంలోని "వెంకట ఆదిత్య రెసిడెన్సీ" 1వ అంతస్తులో 685 చ॥అ॥ ప్లింత్ ఏరియా, 50 చ॥అ॥ ఉమ్మడి ఏరియా, 80 చ॥అ॥ కారు పార్కింగ్ కలిగిన **ఫ్లాట్ నెం.F.F-1.** హద్దులు: తూర్పు: శూన్యాకాశం, దక్షిణం: శూన్యాకాశం, పడమర: మెట్లు, లిఫ్ట్ మరియు ఉమ్మడి వరండా, ఉత్తరం: శూన్యాకాశం.

తేది: 06.04.2024, ప్రదేశం:విజయవాడ
సం/- అధీకృత అధికారి, కెనరా బ్యాంక్

కెనరా బ్యాంక్ Canara Bank (భారత ప్రభుత్వరంగ సంస్థ) సిండికేట్ Syndicate
విజయవాడ ఎమ్‌పిఎఫ్ బ్రాంచ్
మిల్క్ ప్రొడక్ట్స్ ఫ్యాక్టరీ ప్రాంగణం, విజయవాడ-1. ఫోన్: 8331015691

సెక్షన్ 13(4) స్వాధీనత ప్రకటన (స్థిరాస్తి కొరకు)

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 (చట్టం 54, 2002) ప్రకారం **కెనరా బ్యాంక్** యొక్క అధీకృత అధికారి అయిన దిగువ సంతకందారు సెక్షన్ 13 (12) కు అనుబంధమైన సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 లోని 3వ నిబంధన ప్రకారం సంక్రమించిన అధికారాలను వినియోగించి **ఋణగ్రహీత(లు): శ్రీ అన్నం సుబ్బారావు మరియు శ్రీమతి అన్నం బిందు** వారిని నోటీసులో ఉదహరించబడిన బకాయి సొమ్ము **రూ. 48,59,688.86 (అక్షరాల నలభై ఎనిమిది లక్షల యాభై తొమ్మిది వేల ఆరు వందల ఎనభై ఎనిమిది రూపాయలు మరియు ఎనభై ఆరు పైసలు)** మొత్తంను నోటీస్ అందిన తేది నుండి 60 రోజుల లోపు చెల్లించవలసినదిగా తేది **07.02.2024న డిమాండ్ నోటీసును జారీచేయడమైనది.**

ఋణగ్రహీత సదరు బకాయిసొమ్మును చెల్లించుటలో విఫలమైనందున, దిగువ సంతకందారు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 లోని సెక్షన్ 13(4) కు అనుబంధమైన సదరు రూల్ 8 & 9 ప్రకారము సంక్రమించిన అధికారములను వినియోగిస్తూ దిగువ వివరించిన ఆస్తిని **08.04.2024వ తేదీన స్వాధీనపరచుకున్నారని** ఋణగ్రహీతలు, హామీదారులు మరియు యావన్మంది ప్రజానీకమునకు ఇందుమూలముగా తెలియజేయడమైనది.

ప్రత్యేకముగా ఋణగ్రహీతలు, హామీదారులు మరియు ప్రజానీకమును హెచ్చరించునది ఏమనగా ఈ ఆస్తి విషయమై ఎవ్వరూ ఎటువంటి లావాదేవీలు జరుపరాదని, ఒకవేళ లావాదేవీలు జరిపిన అవి **కెనరా బ్యాంక్, విజయవాడ ఎమ్‌పిఎఫ్ బ్రాంచ్** వారికి తేది. 07.04.2024 నాటికి చెల్లించవలసిన బకాయి **రూ. 50,01,715.86** + వడ్డీ కలిపి మొత్తమునకు లోబడివుంటాయి.

సెక్షన్ 13, సబ్-సెక్షన్(8) చట్ట ప్రకారము ఋణగ్రహీత'లు తమ తనఖా ఆస్తులను విడిపించుకోవటానికి ఉన్న కాలవ్యవధిని వినియోగించుకోగలరని సూచించడమైనది.

స్థిరాస్తి వివరములు:

కృష్ణా జిల్లా, విజయవాడ ఈస్ట్ రిజిస్ట్రేషన్ జిల్లా, విజయవాడ రూరల్ మండలం, గుణదల సబ్-రిజిస్ట్రార్ ఆఫీస్, ప్రసాదంపాడు గ్రామపంచాయితీ, ప్రసాదంపాడు గ్రామం, పాత అసెస్‌మెంట్ నెం. 966, క్రొత్త అసెస్‌మెంట్ నెం. 4869, పాత డోర్ నెం. 8-65, కొత్త డోర్ నెం. 18-77, సర్వే నెం. 77/1 నందు 97 చ॥గ॥ స్థలం. హద్దులు: తూర్పు: రయనపాటి కిరణ్ కుమార్ ఆస్తి - 27.0 అ॥ దక్షిణం: పొర్ల వేణు గోపాలరావు ఆస్తి - 32.3 అ॥, పడమర: 21 అ॥ పంచాయితీ రోడ్డు - 27.0 అ॥, ఉత్తరం: రయనపాటి కిరణ్ కుమార్ ఆస్తి - 32.3 అ॥. 30 చ॥గ॥ విస్తీర్ణంగల స్థలం. హద్దులు: తూర్పు: 1వ ఐటమ్ ఆస్తి, దక్షిణం: జీరో పాయింట్, పడమర: 21 అ॥ పంచాయితీ రోడ్డు, ఉత్తరం: రయనపాటి కిరణ్ కుమార్ ఆస్తి.

తేది: 08.04.2024
ప్రదేశం: విజయవాడ
సం/- అధీకృత అధికారి, కెనరా బ్యాంక్

OFFICE OF THE RECOVERY OFFICER - I
BEFORE THE DEBTS RECOVERY TRIBUNAL AT VISAKHAPATNAM
31-31-21, Narayana Bhawanam, Sai Baba Street,
Daba Gardens, Visakhapatnam-530020.

DEMAND NOTICE
(NOTICE UNDER SECTIONS 25 TO 28 OF THE RECOVERY OF DEBTS & BANKRUPTCY ACT, 1993 AND RULE 2 OF SECOND SCHEDULE TO THE INCOME-TAX ACT, 1961)

RC/61/2016 **Dt.12.03.2024**
Union Bank of India, (e-AB) Gudivada Branch, Krishna District.
Versus
Sri.P Srirama Raju & Others

To, (CD-1) Sri. P Srirama Raju, PlotNo. 581, HMT, Swamapuri, Miyapur, Hyderabad, Telangana. **(CD-2) Sri. Velagagurthy Murali Gopala Krishna** Matlam Village, Kruthivennu Mandal, Krishna District. **(CD-3) Sri. Tirumani Venkateswarulu,** Matlam. Village, Kruthivennu Mandal, Krishna District.**(CD-4) Sri. Chekuri Vijay Rama Raju,** Kalidindi Mandal, Aruteegalapadu Village, Krishna District.

1. This is to notify that as per the Recovery Certificate issued in pursuance of orders passed by the Presiding Officer, Debts Recovery Tribunal Vishakhapatnam in **OA/529/2013** an amount of **Rs.1,99,60,970.80 Ps** (Rupees One crore Ninety Nine Lakh Sixty Thousand nine hundred seventy and eighty paisa only) along with pendentallite and future interest @ 13.75% p.a compounded with quarterly rests from 30.12.2013 till realization / date of payment and the costs of **Rs.1,85,005/-** ((Rupees one lakh eighty five thousand and five only)become due against you (Jointly and severally /Fully/Limited).
2. You are hereby directed to pay the above sum within 15 days of the receipts of the notice, failing which the recovery shall be made in accordance with the Recovery of Debts Due to Banks and Financial Institutions Act, 1993 and Rules there under.
3. You are hereby ordered to declare on an affidavit the particulars of your assets on or before the next date of hearing.
4. You are hereby ordered to appear before the undersigned on **04.04.2024 at 10:30 a.m**. for further proceedings.
5. In addition to the sum aforesaid you will be liable to pay: (a) Such interest as is payable for the period commencing immediately after this notice of the execution proceedings. (b) All costs, charges and expenses incurred in respect of the service of this notice and other process that may be taken place for recovering the certificate amount.
6. Attention is invited to Rule 16 of the Second Schedule to the Income Tax Act, 1961 which is reproduced below: 16(1) Where a notice has been served on a defaulter under Rule 2, the defaulter or his representative in interest shall not be competent to mortgage, charge, lease or otherwise deal with any property belonging to him except with the permission of the Recovery Officer, nor shall any Civil Court issue any process against such property in execution of a decree for the payment of money. 16 (2) Where an attachment has been made under this Schedule, any private transfer or delivery of the property attached or of any interest therein and any payment to the defaulter of any debt, dividend or other moneys contrary to such attachment shall be void as against all claims enforceable under the attachment.
(Given under my hand and the seal of the Tribunal, Visakhapatnam on this day 12th March 2024) Next Hearing Date: 04-04-2024.

(AVASARALA ANIL)
RECOVERY OFFICER
DEBTS RECOVERY TRIBUNAL, VISAKHAPATNAM.

కెన్‌ఫిన్ హోమ్స్ లిమిటెడ్
Can Fin Homes Ltd (Sponsor: CANARA BANK) HOME LOANS • DEPOSITS Translating Dreams into Reality
40-5-9/17, 1వ అంతస్తు, సిద్ధార్ధ కాలేజ్ బస్టాప్ దగ్గర, మొగల్రాజపురం, విజయవాడ-520010, ఫోన్: 7625079119.
Email: vijaywada@canfinhomes.com. CIN: L85110KA1987PLC008699.

అమ్మకపు నోటీసు

రూల్ 8(6) క్రింద సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్ 2002

టూ,

1) శ్రీ రమణ పుణ్ణనా (రుణగ్రహీత), 2) శ్రీమతి పుణ్ణనా కళ్యాణ(సహ రుణగ్రహీత), 9-178 సెంటెన్సన్కూల్‌రోడ్, ప్రసాదంపాడు, విజయవాడ-521108.

మీ లోని 1వ & 2వ వారు ఈ దిగువ ఉదహరించిన ఆస్థిని తనఖాగా ఉంచి మా శాఖ నుండి హౌసింగ్ లోన్ ఋణ సౌకర్యం పొందియున్నారు. మీ లోని 1వ & 2వ వారు సదరు మొత్తం బ్యాంక్‌కు చెల్లించడంలో విఫలమైనారు. **ది. 29-11-2023** తేదిన అకౌంట్ యన్.పి.ఏ (నిర్రక) వర్గీకరించబడింది. కావున నిబంధనలు అనుసరించి **ది. 01-12-2023** తేదిన డిమాండ్ నోటిసు జారీచేయడం జరిగినది.

తనఖా పెట్టిన ఆస్థి వివరము

కృష్ణాజిల్లా, విజయవాడ రూరల్ మండలం, ప్రసాదంపాడు గ్రామం & పంచాయితీ, రామవరప్పాడు, ఆర్.యస్.నెం.79/9, మొత్తం 172.4 చ.గ.లలో 22.34 చ.గ.ల అవిభాజ్యపు వాటాలో గల సంధ్య రెసిడెన్సి రెండవ్ అంతస్తులో 534 చ.అ.ల ప్లింత్ ఏరియా, 146 చ.అ.ల కామన్ ఏరియా, 20 చ.అ.ల పార్కింగ్ ఏరియాతో గల ఫ్లాట్ నెం.ఎస్.ఎఫ్-1 ఈ దిగువ హద్దులలో **ఫ్లాట్ హద్దులు: తూర్పు:** సి.హెచ్ విజయలక్ష్మి గారి ఆస్తి, **పడమర:** పార్కింగ్, లిఫ్ట్ & మెట్లు, **దక్షిణం:** కురిచేటి వెంకట రాధకృష్ణ మూర్తి గారి ఆస్తి, **ఉత్తరం:** 6 అడుగుల వెడల్పు బజార్. **స్థలం హద్దులు: తూర్పు:** ఓపెన్ టూ స్కై, **పడమర:** 4 మరియు 5 కార్యనిర్వాహకుల ఆస్తి కొంత వరకు మరియు 2 వ అంశం మార్గం కొంత వరకు, **దక్షిణం:** 3,4,5 కార్యనిర్వాహకుల ఆస్తి, **ఉత్తరం:** వడ్లమూడి వెంకటేశ్వరరావు ఇతరులకు విక్రయించిన ఆస్తి.

సదరు మొత్తం బ్యాంక్‌కు చెల్లించడంలో విఫలమైనారు, కావున బ్యాంక్ యొక్క అధీకృత అధికారి దిగువ వివరించిన ఆస్థిని సదరు చట్టం యొక్క సెక్షన్ 13(4) రూల్ 8(6) క్రింద సెక్యూరిటి ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్ 2002 ప్రకారం స్వాధీనం చేసుకోవడం జరిగినది.

బ్యాంక్ వారు దిగువ ఆస్థిని అమ్మి తమకు రావలసిన మొత్తం **ది. 01-12-2023 నాటికి రూ. 17,52,660/-** మరియు సదరు మొత్తము పై వడ్డీ, ఇతర ఖర్చులు మరియు ఛార్జీలతో సహ రాబట్టుకొనెదరు. స్వాధీనత నోటిసును రిజిస్టర్ పోస్ట్ ద్వారా ఋణగ్రహీతల చివరి చిరునామాకు పంపడం జరిగినది. నోటిసు ధృవీకరించబడలేదు, కావున ఈ పత్రిక ప్రకటన ప్రచురించబడుతుంది.

సెక్యూరిటి ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్ 8(6) క్రింద ఇదే చివరి నోటిసుగా పరిగణించబడుతుంది. ఈ నోటిసు తేది నుండి 30 రోజుల వ్యవధిలో మొత్తం బకాయిని చెల్లించడానికి మీమ్మల్ని అనుమతిస్తుంది. ఇందులో విఫలమైనచో, దిగువ సంతకందారు సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 యొక్క నిబంధనల ప్రకారం బకాయిని తిరిగి రాబట్టుకొనుటకు వేలం తేదిని నిర్ణయించడం, వేలం నోటిసును ప్రచురించడం మరియు స్థిరమైన సురక్షిత ఆస్తిని విక్రయించడం జరుగుతుంది.

తేది : 10-04-2024
స్థలము : విజయవాడ
సం/- అధీకృత అధికారి
కెన్‌ఫిన్ హోమ్స్ లిమిటెడ్

ఆర్‌టిసి బస్సులో గంజాయి పట్టివేత

ప్రజాశక్తి-ఉక్కునగరం (విశాఖపట్నం)

విశాఖ జిల్లా దువ్వాడ పోలీస్ స్టేషన్ పరిధిలోని అగనంపూడి టోల్ ప్లాజా వద్ద ఆర్‌టిసి బస్సులో గంజాయి పట్టుబడింది. ఎన్నికల నేపథ్యంలో పోలీసులు, ప్రత్యేక స్క్వాడ్ బృందాలతో ఎక్కడికక్కడ చెక్ పోస్టులు ఏర్పాటు చేసి వాహన తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం ఉదయం నర్సీపట్నం నుంచి విశాఖపట్నం వైపుగా వస్తున్న ఆర్‌టిసి బస్సులో తనిఖీ చేశారు. బస్సులో 14 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. గంజాయిని తరలిస్తున్న భార్యాభర్తలు నాగరాజు, భారతీలను పోలీసులు అరెస్టు చేశారు. గంజాయితో పట్టుబడిన నిందితులది నర్సీపట్నం సమీపంలోని కెడి.పేటగా పోలీసులు గుర్తించారు. కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

కొనసాగుతున్న వలంటీర్ల రాజీనామాల పర్వం

ప్రజాశక్తి-యంత్రాంగం

వలంటీర్ల రాజీనామాల పర్వం కొనసాగుతోంది. రాష్ట్రంలోని పలు జిల్లాల్లో 848 మంది వలంటీర్లు బుధవారం రాజీనామా చేశారు. రాజీనామా పత్రాలను ఎంపిడిఒ, మున్సిపల్ కార్యాలయాల్లో, సచివాలయాల్లో అందజేశారు. అనకాపల్లి జిల్లా మునగపాక మండలంలోని మునగపాక, తిమ్మరాజుపేట, చెర్లోపాలెం, పాటిపల్లి, అరబుపాలెం, నాగులపల్లి, కాకరపల్లి గ్రామాలకు చెందిన 151 మంది వలంటీర్లు రాజీనామాలు చేశారు. రాజీనామా పత్రాలను ఎంపిడిఒ మన్మధరావుకు అందజేశారు. అనకాపల్లి జిల్లా చీడికాడ మండలం బి.సింగవరం గ్రామానికి చెందిన ఐదుగురు, విజయనగరం జిల్లా లక్కవరపుకోట మండలంలో 43 మంది, వేపాడ మండలం వావిలపాడు గ్రామ సచివాలయంలో పని చేస్తున్న 13 మంది, డెంకాడ మండలం పినతాడివాడ సచివాలయానికి చెందిన 11 మంది వలంటీర్లు తమ రాజీనామా పత్రాలను ఆయా సచివాలయాల్లోని పంచాయతీ సెక్రటరీలకు అందజేశారు. శ్రీకాకుళం జిల్లా నందిగా మండలంలో 262 మంది, లావేరు మండలంలో 45 మంది, టెక్కలి సచివాలయం-2 పరిధిలో ఒకరు రాజీనామా చేశారు. కర్నూలు జిల్లాలో 11 మండలాల్లోని ఆయా గ్రామ పంచాయతీల పరిధిలో పని చేస్తున్న 254 మంది వలంటీర్ల రాజీనామా చేసినట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సజన ఒక ప్రకటనలో వెల్లడించారు. నంద్యాల జిల్లా నంద్యాల మున్సిపాలిటీ పరిధిలో 63 మంది వలంటీర్లు తమ రాజీనామాలను మున్సిపల్ కమిషనర్‌కు అందజేశారు.

అమలు కాని 'బ్రాండిక్స్' హామీలు

- నామమాత్రంగా పెట్టుబడులు
- లక్ష్యంలో 34 శాతం మందికే ఉపాధి



బ్రాండిక్స్ కంపెనీ

ప్రజాశక్తి- అనకాపల్లి ప్రతినిధి

శ్రీలంకకు చెందిన బ్రాండిక్స్ ఇండియా అపెరల్ సిటీ (బిఐఎసి) ఏర్పాటుతో పెట్టుబడులు వరదలా వస్తాయని అప్పటి ఉమ్మడి రాష్ట్రంలో పెద్ద ప్రచారం సాగింది. దాదాపు కోట్ల రూపాయల పెట్టుబడులు పెడతామన్న, వేలాది మందికి ప్రత్యక్ష ఉపాధి కల్పిస్తామన్న ఈ కంపెనీకి అత్యంత ఉదారంగా ఏడాదికి ఎకరాకు రూపాయికు చొప్పున వెయ్యి ఎకరాలను ప్రభుత్వం లీజుకిచ్చింది. 2005లో ప్రభుత్వంతో చేసుకున్న ఎంఒయు ప్రకారం 60 వేల ఉద్యోగాల హామీతో అడుగుపెట్టిన ఈ కంపెనీ నేటికీ రూ.1500 కోట్ల పెట్టుబడులకే పరిమితమైంది. 20,639 మందికి మాత్రమే ఉద్యోగాలు కల్పించింది. వీరిలో 90 శాతం మంది మహిళలే ఉన్నారు. అతి తక్కువ వేతనంతో వీరితో పని చేయించుకుంటోంది. కార్మిక చట్టాలను తుంగలో తొక్కుతోంది. అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం మండలంలోని ప్రత్యేక ఆర్థిక మండలి (ఎస్ఇజెడ్)లో అడుగుపెట్టిన ఈ కంపెనీ ఇచ్చిన హామీలను 19 సంవత్సరాలు కావస్తున్నా నిలబెట్టుకోలేదు. ఎస్ఇజెడ్ పేరుతో అనుమతులు తీసుకొని సర్వీస్ ట్యాక్స్, ఇన్‌కం ట్యాక్స్, విద్యుత్, నీటి ఛార్జీలు వంటి పలు రాయితీలు పొందింది. ఒప్పందం ప్రకారం పరిశ్రమలు నెలకొల్పి ఉద్యోగాలు కల్పించకపోతే తిరిగి ప్రభుత్వానికి భూమి అప్పగిస్తామని చెప్పింది. కానీ, ఇప్పటికి నెలకొల్పిన 17 యూనిట్లలో ఒకటి మూతపడగా 16 యూనిట్లు నడుస్తున్నాయి. వీటిలో బ్రాండిక్స్‌కు సంబంధించి రూ.305.5 కోట్ల పెట్టుబడితో లోదుస్తులు తయారు చేసే మూడు యూనిట్లు ఉన్నాయి. ఈ యూనిట్లలో 12 వేల మంది పని చేస్తున్నారు. మిగిలినవి ఇతరులకు చెందిన కంపెనీలు. నీటి శుద్ధి, ఎఫ్లూయింట్ ట్రీట్‌మెంట్ ఇతర మౌలిక సదుపాయాల కల్పన పేరుతో భారీగా బ్రాండిక్స్ యాజమాన్యం ఆ కంపెనీల నుంచి అద్దెలు వసూలు చేస్తోంది. ఎస్ఇజెడ్‌లోని కంపెనీ నుంచి విడుదలైన వ్యర్థ రసాయనాలను సరిగా శుద్ధి చేయకుండా సముద్రంలో విడిచిపెట్టడంతో సముద్రంలో చేపల ఉత్పత్తి తగ్గి, మత్స్యకారుల పొట్టకొట్టిందన్న విమర్శలు బ్రాండిక్స్ ఎదుర్కొంటుంది.


సిఎం జగన్ సమక్షంలో వైసిపిలో చేరిన రమేష్‌కుమార్‌రెడ్డి

వైసిపిలో చేరిన మాజీ ఎమ్మెల్యే ఆర్‌ఆర్

ప్రజాశక్తి-రాయచోటి (అన్నమయ్య జిల్లా)

మాజీ ఎమ్మెల్యే, రాయచోటి టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఆర్ రమేష్ కుమార్‌రెడ్డి బుధవారం వైసిపిలో చేరారు. పల్నాడు జిల్లా వినుకొండ వద్ద ఆయనతో పాటు ఆయన ప్రధాన అనుచరులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. మాజీ ఎమ్మెల్యే చేరికతో నియోజక వర్గంలో వైసిపికి మరింత బలం చేకూరిందని నాయకులు పేర్కొన్నారు. వైసిపిలో చేరినవారిలో లక్కిరెడ్డిపల్లె మాజీ జడ్‌పిటిసి సభ్యులు మోహనరెడ్డి, లక్కిరెడ్డిపల్లె మాజీ ఎంపిపి ఉమాపతిరెడ్డి, మార్కెటింగ్ కమిటీ మాజీ ఛైర్మన్ కె ప్రభాకరరెడ్డి, ఆస్పత్రి కమిటీ మాజీ ఛైర్మన్ షేక్ హుస్సేన్, టిడిపి రాష్ట్ర కార్యదర్శి ఓలుదాసు కృష్ణమూర్తి, మండల క్లస్టర్ ఇన్‌ఛార్జి రమణారెడ్డి, దివ్యకుమార్‌రెడ్డి, పలువురు ఇతర నేతలు ఉన్నారు. కార్యక్రమంలో రాజంపేట ఎంపి పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, రాయచోటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

బ్యాంకులకు పట్టని గిరిజన గ్రామాలు

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

గిరిజన ప్రాంతాల్లో ఉన్న వారికి ప్రభుత్వ సాయం కూడా సక్రమంగా అందని పరిస్థితి నెలకొంది. ఏజెన్సీ గ్రామాల్లో బ్యాంకుల సేవలు లభించకపోవడమే ఈ పరిస్థితికి కారణం. అల్లూరి సీతారామరాజు జిల్లా, పార్వతీపురం మన్యం జిల్లాల్లో ఏకంగా 52 గ్రామాలకు బ్యాంకింగ్ సౌకర్యం లేదు.

ఇవన్నీ కనీసం మూడు వేల మంది జనాభా ఉన్న గ్రామాలే కావడం గమనార్హం. వీరంతా బ్యాంకులకు వెళ్లాలంటే కనీసం ఐదు కిలోమీటర్ల దూరం ప్రయాణించాల్సివస్తోంది. ఈ గ్రామాల్లో బ్యాంకు శాఖలను ఏర్పాటుచేయాలని ప్రభుత్వం సూచిస్తున్నప్పటికీ, అనేక అడ్డంకులు కనిపిస్తున్నాయి . కొన్ని గ్రామాల్లో బ్యాంకు శాఖల ఏర్పాటుకు రిజర్వ్‌బ్యాంకు నుంచే అనుమతులు రావడం లేదని స్థానిక బ్యాంకుల అధికారులు చెబుతున్నారు. మరికొన్ని చోట్ల అయితే ఆయా బ్యాంకుల యాజమాన్యాలే విముఖత వ్యక్తం చేస్తున్నట్లు తెలిసింది.

బ్యాంకుల వ్యాపార ధోరణి, లాభాపేక్షే ఈ పరిస్థితికి కారణమని తెలుస్తోంది. కేవలం సాధారణ లావాదేవీలే తప్ప భారీ డిపాజిట్లు ఇక్కడ ఉండవని, దీనివల్ల తమ వ్యాపారానికి ప్రయోజనం ఉండదని కొంతమంది బ్యాంకర్లే చెబుతున్నారు.

అల్లూరి సీతారామరాజు జిల్లాలోని రాజవొమ్మంగి లేదా లాబ్బార్తి గ్రామాల్లో గ్రామీణ వికాస బ్యాంకును ఏర్పాటుచేయాలని ప్రభుత్వం భావించగా, అందుకు రిజర్వ్‌బ్యాంకు నుంచి అనుమతి రాలేదని తెలిసింది. అలాగే ఇదే జిల్లాలోని హుకుంపేట, రంపచోడవరం గ్రామాల్లో బ్యాంకు శాఖ ఏర్పాటు కూడా ఇంకా పెండింగ్‌లోనే ఉంది. బ్యాంకుల విభజన ప్రక్రియ ఇంకా పూర్తి కాకపోవడం వల్లనే ఈ పరిస్థితి నెలకొందని అధికారులు చెబుతున్నారు. మారేడుమిల్లి, యేటపాక, జి.మాడుగుల వంటి ప్రాంతాల్లో బ్యాంకుల ఏర్పాటుకు ఇంకా సర్వేలే కొనసాగుతున్నాయి. స్టేట్‌బ్యాంకు అధ్వర్యంలో జి.మాడుగుల, అనంతగిరి వంటి ప్రాంతాల్లో శాఖల ఏర్పాటు ప్రక్రియ కూడా ముందుకు సాగడం లేదు.

తెలంగాణకు దగ్గరని వద్దన్నారు

చింతూరు గ్రామంలో యూనియన్ బ్యాంకును ఏర్పాటుచేయాలని భావించినప్పటికీ, ఆ గ్రామం తెలంగాణలోని భద్రాచలానికి దగ్గరగా ఉండడం, చింతూరు వాసులు భద్రాచలంలోనే ఎక్కువ సంబంధాలు కలిగి ఉండడం వంటి కారణాలతోపాటు, ప్రభుత్వ రంగ సంస్థల కార్యక్రమాలు అన్నీ భద్రాచలం నుంచే కొనసాగుతుండడంతో చింతూరులో బ్యాంకు శాఖ ఆర్థికంగా నిరుపయోగమని బ్యాంకు అధికారులు తేల్చిచెప్పేసారు.

సిఇసి దృష్టికి తిరుపతి దొంగ ఓట్ల వ్యవహారం

భాను ప్రకాష్‌రెడ్డి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

తిరుపతి అసెంబ్లీ, పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని దొంగ ఓట్ల వ్యవహారాన్ని కేంద్ర ఎన్నికల సంఘం దృష్టికి తీసుకెళతామని బిజెపి అధికార ప్రతినిధి భానుప్రకాష్‌రెడ్డి పేర్కొన్నారు. దొంగ ఓట్ల వ్యవహారంపై బుధవారం సచివాలయంలో సిఇఓ ముఖేష్‌కుమార్‌మీనాను కలిసి ఫిర్యాదు చేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ సుమారు 38వేల ఓట్ల దొంగ ఓట్లు తిరుపతి నియోజకవర్గంలోఉన్నాయని ఆ ఓట్లను తొలగించే వరకు తమ పోరాటం ఆగదన్నారు. టిటిడి ఇఓగా ధర్మారెడ్డి నాలుగున్నర సంవత్సరాలుగా పనిచేస్తున్నాడని ఆయన సుమారు 4వేల ఓటర్లను ప్రభావితం చేస్తున్నారని, వెంటనే ఆయనను ఇఓ బాధ్యతలనుంచి తప్పించాలని సిఇఓకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నటు ఆయన తెలిపారు.

శ్రీశైలంలో ముగిసిన ఉగాది మహోత్సవాలు

ప్రజాశక్తి - శ్రీశైలం

శ్రీశైలం క్షేత్రంలో ఉగాది మహోత్సవాలు బుధవారం ముగిశాయి. చివరి రోజు పూర్ణాహుతి, అశ్వవాహన సేవ, నిజాలంకరణ కార్యక్రమాలు జరిగాయి. ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అశ్వ వాహనంపై ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అశ్వవాహన కార్యక్రమంతో ఉగాది మహోత్సవాలు ముగిశాయి.

చంద్రబాబుపై మల్లాది విష్ణు ఫిర్యాదు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కించపరిచేలా టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు వ్యాఖ్యలు అభ్యంతరకరంగా ఉన్నాయని, తక్షణమే చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్‌కుమార్ మీనాకు ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షులు మల్లాది విష్ణు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు బుధవారం సచివాలయంలో సిఇఒకు ఫిర్యాదు చేశారు. ఎన్నికల ప్రచారం కోసం టిడిపి విడుదల చేసిన 'జరుగు జగన్ - జరుగు జగన్' అనే పాటలోని చరణాలు, 'సైకో పోవాలి- సైకిల్ రావాలి' అనే పాటను నిలుపుదల చేయాలని ఫిర్యాదులో కోరారు. టిడిపి సోషల్ మీడియా చేస్తున్న దుష్ప్రచారం, టిడిపి వాయిస్ మెసేజ్‌లపై సిఇఒ సానుకూలంగా స్పందించారని మల్లాది విష్ణు పేర్కొన్నారు.

రాజధాని ఖరారైతేనే రిజర్వుబాంకు ప్రాంతీయ కార్యాలయం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రాంతీయ కార్యాలయం ఏర్పాటు చేయాలంటే రాజధాని ఏదో రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించాలని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా జనరల్ మేనేజరు సుమేడ్ జువాడే స్పష్టం చేశారు. తాను రాసిన లేఖకు ఆర్‌బిఐ ఈ మేరకు సమాధానం ఇచ్చినట్లు అఖిల భారత పంచాయితీ పరిషత్ (న్యూఢిల్లీ) జాతీయ ఉపాధ్యక్షులు డాక్టర్ జాస్తి వీరాంజనేయులు ఒక ప్రకటనలో తెలిపారు. అమరావతిలో రిజర్వ్ బ్యాంక్ కార్యాలయం ప్రారంభించాలని ప్రధాని నరేంద్రమోడీకి ఇటీవల జాస్తి వీరాంజనేయులు లేఖ రాశారు. ప్రధాని కార్యాలయం నుండి వచ్చిన సూచన మేరకు అదే లేఖను ఆయన ఆర్‌బిఐకి కూడా పంపారు. ఆ లేఖకు బుధవారం ఆర్‌బిఐ నుండి సమాధానం అందింది. రాజధానిని రాష్ట్ర ప్రభుత్వం ఖరారు చేయలేదని, చేసిన తరువాతే ఆర్‌బిఐ కార్యాలయం ఏర్పాటుచేస్తామని లేఖలో పేర్కొన్నారు.

బిజెపి ఎదురీత

- మిత్రుల సహకారంపై అనుమానాలు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో



ఎన్‌డిఎ కూటమిలో భాగంగా బిజెపి బరిలో ఉండే అభ్యర్థులకు రాష్ట్రంలో మిత్ర పక్షాల నుంచి ఆశించిన సహకారం అందుతుందో లేదోననే భయం ఆ పార్టీ నేతలను వెంటాడుతోంది. గత ఎన్నికల్లో ఒక్కశాతం కూడా ఓట్లు తెచ్చుకోలేని బిజెపి, ఈ దఫా టిడిపి, జనసేన మద్దతుతో ఎలాగోలా అసెంబ్లీలో అడుగుపెట్టాలని, లోక్‌సభకు రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం కోసం ఉవ్విళ్లూరుతోంది. పార్టీల అధ్యక్షులు కలిసి ఉన్నప్పటికీ క్షేత్రస్థాయిలో కేడర్ ఎవరి దారి వారిదేనన్నట్లు వ్యవహరిస్తున్నారని ఆయా పార్టీల నేతలు అభిప్రాయపడుతున్నారు. విజయవాడ పశ్చిమ నియోజకవర్గం ఏర్పడినప్పటి నుంచి ఒక్కసారి కూడా గెలవని బిజెపి ఈ దఫా ఎట్టి పరిస్థితుల్లోనూ గెలవాలని కేంద్ర మాజీ మంత్రి సుజనా చౌదరిని రంగంలోకి దించింది. ఈ స్థానాన్ని జనసేన అధికార ప్రతినిధిగా వ్యవహరించిన పోతిన మహేష్ తొలుత టికెట్ ఆశించారు. పొత్తులో భాగంగా స్థానాన్ని బిజెపికి కేటాయించడంతో తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసిన మహేష్, బుధవారం సిఎం జగన్ సమక్షంలో వైసిపిలో చేరారు. మహేష్ తీసుకున్న నిర్ణయంతో బిజెపి నెత్తిమీద తాటికాయపడినట్లయ్యింది. ఇది ఇలా ఉంటే నియోజకవర్గంలో ముస్లిం ఓటు బ్యాంకు అధికంగా ఉండటంతోపాటు స్వతహాగా ఆ వర్గం బిజెపిని వ్యతిరేకిస్తుండటంతో సుజనా చౌదరి ఎదురీత తప్పని పరిస్థితి నెలకొంది.

అనపర్తి నియోజకవర్గంలో టిడిపి బలంగా ఉన్నప్పటికీ ఆ స్థానాన్ని బిజెపికి కేటాయించారు. అక్కడ టిడిపి ఇన్‌ఛార్జిగా ఉన్న నల్లమిల్లి రామకృష్ణారెడ్డికి టికెట్ దక్కకపోవడంతో ఆయన వర్గం బిజెపికి ఎంత మాత్రం సహకరిస్తారోననే అనుమానం నెలకొంది. అనపర్తిలో బిజెపి అభ్యర్థిగా పోటీలో ఉన్న ఎం శివరామకృష్ణమరాజు గడ్డుపరిస్థితిని ఎదుర్కొంటున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ నడుస్తోంది. అనపర్తి ఎఫెక్ట్ రాజమండ్రి పార్లమెంటుపై తీవ్ర ప్రభావం చూపే అవకాశాలున్నాయని పలువురు అభిప్రాయపడుతున్నారు. అందులో భాగంగానే ఈ నెలాఖరులో రాజమండ్రిలో నిర్వహించనున్న ఎన్‌డిఎ కూటమి బహిరంగ సభకు ప్రధాని మోడీ రావాలని ఆహ్వానించినట్లు సమాచారం. కర్నూలు జిల్లా ఆదోని టిడిపి టికెట్‌ను మీనాక్షి నాయుడు ఆశించారు. అయితే పొత్తులో భాగంగా ఆ సీటు బిజెపికి కేటాయించడంతో అక్కడ నుంచి డాక్టర్ పార్థసారధి పోటీ చేస్తున్నారు. తొలుత కొంత అసంతృప్తి వ్యక్తం చేసిన మీనాక్షి నాయుడును టిడిపి అధ్యక్షులు చంద్రబాబు పిలిచి బుజ్జగించడంలో సరేనన్నప్పటికీ ఆయన కేడర్ బిజెపికి సపోర్టు చేసేందుకు ఇష్టపడటం లేదని తెలుస్తోంది. ముఖ్యంగా ముస్లిం ఓటు బ్యాంకు బలంగా ఉన్న ఆదోనిలో బిజెపి గెలవడం అసాధ్యమనే చర్చ నడుస్తోంది. ఇక జమ్మలమడుగులో మాజీ మంత్రి సి ఆదినారాయణరెడ్డి బిజెపి తరపున బరిలో ఉండగా, ఆయన సోదరుడు కుమారుడు భూపేష్‌రెడ్డి కడప నుంచి టిడిపి ఎంపిగా పోటీలో ఉన్నారు. జమ్మలమడుగులో బిజెపి గుర్తు కమలం ప్రజలకు పరిచయం లేనిది కావడంతో ఓటర్లు టర్న్ అవుతారో లేదోననే భయం బిజెపిని వెంటాడుతోంది. అలాగే తిరుపతి ఎంపిగా పోటీ చేస్తున్న వి వరప్రసాద్‌కు కూడా కూటమి నుంచే కొందరు నేతలు విమర్శలు చేస్తున్నారు. తిరుపతి ఎంపి స్థానం నుంచి బిజెపి, ఎమ్మెల్యే స్థానం నుంచి జనసేన పోటీ చేస్తుండటంతో టిడిపి ద్వితీయశ్రేణి నాయకులు, కార్యకర్తలు ఏ మాత్రం సహకరిస్తారో అర్థంకాని పరిస్థితి నెలకొంది. నరసాపురం నుంచి పోటీ చేస్తున్న భూపతిరాజు శ్రీనివాస వర్మ మిత్రపక్షాలైన టిడిపి, జనసేన బలాన్ని నమ్ముకుని రంగంలో ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది.

భారత యూనికార్న్‌లలో స్తబ్దత

- గతేడాది పోల్చితే తగ్గుదల
- ప్రపంచంలో కొత్తగా 171 ఆవిర్భావం
- అమెరికా, చైనా నుంచి భారీగా చేరిక
- హురున్ రీసెర్చ్ ఇన్స్‌ట్యూట్ రిపోర్ట్



న్యూఢిల్లీ : భారత స్టార్టప్‌లు వెనుకబడి పోతున్నాయి. దేశ ఆర్థిక వ్యవస్థ దూసుకుపోతోందని బిజెపి వర్గాలు చేస్తోన్న ప్రచారానికి స్టార్టప్‌ల పెరుగుదల భిన్నంగా ఉంది. 2023లో భారత్‌లో యూనికార్న్‌లు పెరగాల్సింది పోయీ.. పైగా ఒక్కటి తగ్గింది. భారత్‌లో 2022లో మొత్తం 68 యూనికార్న్‌లుండేవని.. గతేడాది ఈ సంఖ్యలో ఒక్కటి తగ్గి 67గా నమోదయ్యిందని హురున్ గ్లోబల్ యూనికార్న్ ఇండెక్స్ 2024 నివేదిక వెల్లడించింది. ప్రపంచంలోనే అత్యధిక విలువ కోల్పోయిన వాటిలో భారత్‌కు చెందిన బైజూస్ టాప్‌లో ఉంది. అయితే.. ప్రపంచ దేశాల్లో మాత్రం భారత్ ర్యాంక్ యథాతథంగా మూడో స్థానంలోనే ఉందని పేర్కొంది. బిలియన్ డాలర్లు (దాదాపు రూ.8300 కోట్లు) పైగా విలువ చేసే స్టార్టప్‌లను యూనికార్న్‌లుగా గుర్తిస్తారు.

హురున్ రిపోర్ట్ ప్రకారం.. 2023లో ప్రపంచ వ్యాప్తంగా మొత్తం 171 స్టార్టప్‌లు యూనికార్న్ హోదాను పొందాయి. ఏడాదిలో రెండు రోజులకు ఒక కొత్త యూనికార్న్‌లుగా మారాయి. ఈ ఏడాది జనవరి 1 నాటికి ప్రపంచవ్యాప్తంగా మొత్తంగా 1,453 యూనికార్న్‌లున్నాయి. 2022తో పోలిస్తే 7 శాతం పెరిగాయి. కొత్తగా అమెరికాలో 70, చైనాలో 56 సంస్థలు యూనికార్న్ స్థాయికి చేరాయి. దాంతో పాటు యుఎస్‌లో 21, చైనాలో 11 కంపెనీలు ఈ హోదా నుంచి తప్పుకున్నాయి. ఇతర దేశాల నుంచి 45 కొత్త అంకురాలు యూనికార్న్‌లుగా నమోదయ్యాయి.

కంపెనీల విలువ ఆధారంగా హురున్ గ్లోబల్ ఇండెక్స్ విడుదల చేసిన జాబితాలో బైట్ డ్యాన్స్ (180 బిలియన్ డాలర్లు), స్పేస్ ఎక్స్ (100 బిలియన్లు), ఓపెన్ఎఐ, యాంట్ గ్రూప్, షీన్ తదితర అగ్రస్థానంలో ఉన్నాయి. టాప్ 10లో ఒక్క భారత కంపెనీ కూడా లేకపోవడం గమనార్హం. అమెరికా ప్రపంచంలోనే మొత్తం 703 యూనికార్న్‌లతో అగ్రస్థానంలో ఉంది. చైనా 340 యూనికార్న్‌లతో రెండో స్థానంలో, 53 యూనికార్న్‌లతో బ్రిటన్ నాలుగో స్థానంలో నిలిచాయి. బైజూస్ 2022లో దాదాపు రూ.1.80 లక్షల కోట్ల విలువను కలిగి ఉండగా.. గతేడాది జాబితాలోనే లేకుండా పోవడం గమనార్హం.

ప్రోత్సాహం తగ్గింది..

భారత్‌లో స్టార్టప్ రంగానికి ప్రోత్సాహం తగ్గిందని హురున్ ఇండియా వ్యవస్థాపకులు అనాస్ రెహ్మాన్ జునైద్ అన్నారు. వెంచర్ క్యాపిటల్ట్‌లు భారీ పెట్టుబడులు పెట్టడం లేదని వెల్లడించారు.

టిడిపిలో చేరిన మాజీ ఎమ్మెల్సీ ఇక్బాల్

- కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన చంద్రబాబు

ప్రజాశక్తి-హిందూపురం



ఇటీవల వైసిపికి గుడ్‌బై చెప్పిన మాజీ ఎమ్మెల్సీ షేక్ మహమ్మద్ ఇక్బాల్ బుధవారం టిడిపిలో చేరారు. చంద్రబాబు ఆయనకు తెలుగుదేశం కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. 2019 ఎన్నికల్లో శ్రీ సత్యసాయి జిల్లా హిందూపురం నియోజకవర్గం నుంచి వైసిపి అభ్యర్థిగా ఇక్బాల్ పోటీ చేశారు. బాలకృష్ణపై ఓడిపోయిన ఆయన హిందూపురం వైసిపి సమన్వయకర్తగా, ఎమ్మెల్సీగా కొనసాగారు. 2024 ఎన్నికలకు ముందు ఆయన్ను వైసిపి సమన్వయకర్తగా అధిష్టానం తొలగించడంతో అప్పటి నుంచి ఆ పార్టీకి దూరంగా ఉన్నారు. గత నాలుగురోజుల క్రితం వైసిపి ప్రాథమిక సభ్యత్వంతో పాటు, ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేశారు. హైదరాబాద్‌లో చంద్రబాబు సమక్షంలో టిడిపిలో చేరారు. ఇక్బాల్ రాకతో టిడిపి మరింత బలోపేతం అవుతుందని టిడిపి హిందూపురం పట్టణ అధ్యక్షులు రమేష్ కుమార్ తెలిపారు.

జనసేన స్టార్ క్యాంపెయినర్లు వీరే

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఎన్నికల్లో జనసేన అభ్యర్థుల విజయాన్ని కాంక్షిస్తూ ఎన్నికల ప్రచారానికి స్టార్ క్యాంపెయినర్లను ఆ పార్టీ అధినేత పవన్‌కల్యాణ్ నియమించారు. క్యాంపెయినర్లలో పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొణిదెల నాగబాబు, క్రికెటర్ అంబటి రాయుడు, సినీ నృత్య దర్శకుడు జానీ, సినీ, టీవీ నటులు సాగర్, పృథ్వీ, హైపర్ ఆది, గెటప్ శ్రీను ఉన్నారు. ఈ మేరకు జనసేన అధ్యక్షులకు రాజకీయ కార్యదర్శి పి హరిప్రసాద్ బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు.


మీడియా సమావేశంలో మాట్లాడుతున్న వడ్లమూరి కృష్ణస్వరూప్

మోడీ మళ్లీ అధికారంలోకొస్తే నియంత పాలనే

- దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షులు వడ్లమూరి కృష్ణస్వరూప్

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్

కేంద్రంలో మరోసారి మోడీ నాయకత్వంలో బిజెపి అధికారంలోకి వస్తే ఇక దేశంలో ఎన్నికలుండవని, నియంత పాలన వస్తుందని దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షులు వడ్లమూరి కృష్ణస్వరూప్ ఆరోపించారు. విశాఖ విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం పార్టీ ఎన్నికల మేనిఫెస్టోను విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశంలో లౌకిక రాజ్యం ఉండదని, మనువాద మాఫియా దోపిడీ పాలన వస్తుందని, రాజ్యాంగానికి పూర్తిగా భంగం కలుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. రాజ్యాంగాన్ని, దేశాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందన్నారు. ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీలు అంతా ఐక్యం కావాలని కోరారు. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలను ప్రయివేటీకరణ చేస్తూ దేశ సంపదను కార్పొరేట్ల చేతుల్లో బందీగా చేస్తున్న మోడీని ఎదుర్కోవడంలో రాష్ట్రంలోని వైసిపి, టిడిపి, జనసేన పూర్తిగా విఫలం చెందాయని విమర్శించారు. ఈ మూడు పార్టీలు రాష్ట్రంలోని ప్రజలను వంచిస్తూ మోడీకి కొమ్ముకాస్తున్నాయన్నారు. ఈ ప్రమాదాన్ని గుర్తించి రానున్న ఎన్నికల్లో ఈ పార్టీలను ఓడించాలని కోరారు. సమావేశంలో పార్టీ విశాఖ పార్లమెంట్ అభ్యర్థి బి రమేష్, గాజువాక అభ్యర్థి ధర్మరాజు, పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థి కోన శంకరరావు, భీమిలి అభ్యర్థి కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రయోజనాల కోసం ఇండియా వేదిక అభ్యర్థులను గెలిపించాలి

- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్


మాట్లాడుతున్న సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ

పోలవరం ప్రాజెక్టు, ప్రత్యేక హోదా వంటి రాష్ట్ర ప్రయోజనాలు నెరవేరాలంటే కేంద్రంలో ఇండియా వేదిక అధికారంలోకి రావాలని, దీనికోసం వేదిక అభ్యర్థులను గెలిపించాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ కోరారు. ఏలూరు కాశీ విశ్వేశ్వర కల్యాణ మండపంలో బుధవారం నిర్వహించిన ఆత్మీయ సమావేశానికి సిపిఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్య అధ్యక్షత వహించారు. సమావేశంలో రామకృష్ణ మాట్లాడుతూ ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంటు ఎన్నికలు దేశంలో అత్యంత ప్రాధాన్యత కలిగినవని, అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని బిజెపి ప్రభుత్వం తుంగలో తొక్కి, మతాల ప్రాతిపదికన దేశాన్ని చీల్చి మళ్లీ అధికారాన్ని సుస్థిరం చేసుకోవాలని చూస్తోందన్నారు. లౌకికవాదానికి ఏమాత్రమూ ప్రాధాన్యత ఇవ్వడంలేదని, ప్రజాస్వామ్యవాదులంతా దీన్ని తిప్పికొట్టాలని కోరారు. గత పదేళ్ల కాలంలో ఈ ప్రభుత్వం ఏ ఒక్క మౌలిక సమస్యనూ పరిష్కరించలేకపోయిందని, 400 స్థానాలు గెలుస్తామని.. 370 స్థానాలు గెలుస్తామని ప్రజలతో మైండ్ గేమ్ ఆడుతుంది తప్ప చేసిన మేలు ఏ ఒక్కటీ చెప్పుకోలేకపోతోందని అన్నారు. రాష్ట్రంలో జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అరాచక పాలన సాగించిందని, పోలవరం ప్రాజెక్టు, ప్రత్యేక హోదా వంటివి సాధించలేకపోయారని, ఆర్థికంగా రాష్ట్రం దివాళా తీసే పరిస్థితి వచ్చిందని విమర్శించారు. సిపిఎం ఏలూరు జిల్లా కార్యదర్శి ఎ.రవి మాట్లాడుతూ ఇండియా వేదికకు సిపిఎం సంపూర్ణ మద్దతు ఇస్తుందని తెలిపారు. రాష్ట్రానికి ద్రోహం చేసిన బిజెపితో టిడిపి, జనసేన జత కట్టడం అంటే రాష్ట్రానికి ద్రోహం చేయడమేనని అన్నారు. కాంగ్రెస్ ఏలూరు అభ్యర్థి కావూరు లావణ్య, సిపిఐ ఏలూరు ఎంఎల్ఎ అభ్యర్థి బండి వెంకటేశ్వరరావును సిపిఎం తరుపున అభినందించారు. కార్మికుల, కష్టజీవుల సమస్యలను చట్టసభల్లో ప్రస్తావించేందుకు ఇండియా వేదిక అభ్యర్థులను గెలిపించాలని కోరారు. సమావేశంలో కాంగ్రెస్ ఎంపి అభ్యర్థి కావూరి లావణ్య, సిపిఐ ఎమ్మెల్యే అభ్యర్థి బండి వెంకటేశ్వరరావు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డేగా ప్రభాకర్, సిపిఎం నాయకులు పి.కిషోర్, కాంగ్రెస్ నాయకులు రాజనాల రామ్మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

మారుతి సుజుకి కార్లు ప్రియం

న్యూఢిల్లీ: దేశంలోనే అతిపెద్ద కార్ల తయారీ కంపెనీ మారుతి సుజుకి తన ఉత్పత్తుల ధరలను పెంచుతున్నట్లు ప్రకటించింది. స్విఫ్ట్, గ్రాండ్ విటారా ఎంపిక చేసిన వేరియంట్ల ధరల పెంపు తక్షణమే అమల్లోకి వచ్చిందని బుధవారం వెల్లడించింది. స్విఫ్ట్ ధరను ఏకంగా రూ.25వేలు పెంచేసింది. గ్రాండ్ విటారా సిగ్మా వేరియంట్ ధరను రూ.19వేలు పెంచింది.

ఇన్వెస్కోతో ఐఐహెచ్‌ఎల్ భాగస్వామ్యం

ముంబయి : ఇరు సంస్థలు కలిసి జాయింట్ వెంచర్‌ను ఏర్పాటు చేసేందుకు ఒప్పందం కుదుర్చుకున్నట్లు ఇండస్ఇండ్ ఇంటర్నేషనల్ హోల్డింగ్స్ లిమిటెడ్ (ఐఐహెచ్‌ఎల్), ఇన్వెస్కో ప్రకటించాయి. అలాగే ఇన్వెస్కో అసెట్ మేనేజ్‌మెంట్ ఇండియా లిమిటెడ్ (ఐఎఎంఐ)లో ఐఐహెచ్‌ఎల్ 60 శాతం వాటా కొనుగోలు చేయనున్నట్లు వెల్లడించాయి. కొత్తగా ఏర్పాటు చేసిన సంస్థలో ఇన్వెస్కోకు 40 శాతం వాటా ఉంటుంది. ఐఐహెచ్‌ఎల్, ఇన్వెస్కో సంస్థలకు స్పాన్సర్ హోదా ఉంటుంది. మారిషస్ ఆధారిత ఐఐహెచ్‌ఎల్‌కు పలు బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సంస్థల్లో పెట్టుబడులు ఉన్నాయి.

ఈవి రుణాల కోసం ప్రత్యేక విభాగం

గ్రీవ్స్ ఫైనాన్స్

హైదరాబాద్ : బ్యాంకింగేతర విత్త సంస్థ గ్రీవ్స్ ఫైనాన్స్ లిమిటెడ్ కేవలం ఈవి రుణాల జారీ కోసమే ఇవిఫిన్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపింది. ఈ నూతన వేదికను హైదరాబాద్‌లో ఆవిష్కరించినట్లు పేర్కొంది. ఎలక్ట్రిక్ మొబిలిటీ, ఇతర సుస్థిర పరిష్కారాలను అందించనుందని వెల్లడించింది. తక్కువ వడ్డీ రేట్లను కోరుకునే వారికి ఇందులో అనేక అప్షన్లు ఉన్నాయని తెలిపింది.

కర్ణాటక కమలంలో కలహాల కుంపటి

- సగానికిపైగా స్థానాల్లో అసమ్మతులు
- చల్లార్చేందుకు నేరుగా రంగంలోకి అమిత్ షా





ప్రజాశక్తి- అనంతపురం ప్రతినిధి

లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో కర్ణాటక బిజెపిలో కలహాల కుంపదచీశీఅవగటి రాజుకుంది. అసమ్మతులు, సహాయ నిరాకరణలు కొనసాగుతున్నాయి. వీటిని చక్కబెట్టేందుకు నేరుగా అమిత్ షా రంగంలోకి దిగినా ఆశించిన ప్రయోజనం కనిపించడం లేదు. కర్ణాటకలో 2, 3వ విడతల్లో లోక్‌సభ ఎన్నికలు నిర్వహిస్తున్నారు. రెండో విడతకు సంబంధించి ఏప్రిల్ 26న ఎన్నికలు, మూడో విడతకు సంబంధించి మే 7న ఎన్నికలు జరగనున్నాయి. ఇక్కడ మొత్తం 28 లోక్‌సభ స్థానాలు ఉన్నాయి. రెండవ విడతలో 14, మూడో విడతలో మిగిలిన 14 స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. 2019 సార్వత్రిక ఎన్నికల సమయంలో కర్ణాటకలో బిజెపి అత్యధిక స్థానాల్లో గెలుపొందింది. 25 సీట్లలో బిజెపి విజయం సాధించింది. కాంగ్రెస్, జెడిఎస్‌లకు చెరో స్థానం దక్కింది. మాండ్య నుంచి సినీనటి సుమలత స్వతంత్ర అభ్యర్థిగా గెలుపొందింది. ఈసారి పరిస్థితులు బిజెపికి అంత అనుకూలంగా లేవన్నది స్పష్టంగా కనిపిస్తోంది. ఎందుకంటే ఆరు మాసాల క్రితం 2023లో జరిగిన కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపికి గణనీయంగా సీట్లు తగ్గిపోయాయి. 104 నుంచి 66 అసెంబ్లీ స్థానాలకు బిజెపి పడిపోయింది. ఇదే పరిస్థితి ఇప్పుడు జరగబోయే లోక్‌సభ ఎన్నికల్లోనూ కనిపిస్తోంది. దీనికితోడు ఆ పార్టీలో అంతర్గత కుమ్ములాటలు అధికమయ్యాయి. బాహాటంగానే నాయకుల మధ్య గ్రూపు తగాదాలు నడుస్తున్నాయి. లోక్‌సభ ఎన్నికల పూర్తి బాధ్యతలను చూస్తున్న మాజీ ముఖ్యమంత్రి యడ్యూరప్పపైనా కొంతమంది సీనియర్ బిజెపి నాయకులు ఆరోపణలు గుప్పిస్తున్నారు. కర్ణాటక బిజెపిలో కుటుంబపాలన నడుస్తోందంటూ కర్ణాటక మాజీ బిజెపి అధ్యక్షులు కెఎస్.ఈశ్వరప్ప విమర్శించారు. యడ్యూరప్ప జాతీయ కౌన్సిల్ సభ్యులని, ఆయన కుమారుడు బివై.విజేంద్ర ఇప్పుడు అధ్యక్షుడిగా ఉన్నారని, మరో కుమారుడు షిమోగా పార్లమెంటు సభ్యుడిగా ఉన్నారని ఈశ్వరప్ప గుర్తు చేస్తున్నారు. హవేరీ లోక్‌సభ స్థానానికి తన కుమారుడికి టికెట్టు ఆశించి భంగపడిన ఈశ్వరప్ప... షిమోగాలో స్వతంత్ర అభ్యర్థిగా బరిలోకి దిగుతానని హెచ్చరిస్తున్నారు. అమిత్ షాను కలిసేందుకు ఆయన ఢిల్లీకి వెళ్లి కలవకుండానే వెనక్కు వచ్చేశారు. ధార్వాడ్ లోక్‌సభ నియోజకవర్గంలో కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషికి వ్యతిరేకత వ్యక్తమవుతోంది. శిరహట్టి బాలేహోసూరు భావైక్యత పీఠానికి చెందిన ఫకీర్ దింగాళేశ్వర్ స్వామి బిజెపికి వ్యతిరేకంగా స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తానని ప్రకటించారు. లింగాయత్ ప్రజలను ఓటు బ్యాంకుగా మాత్రమే బిజెపి చూస్తోందని ఆయన విమర్శించారు.

గత లోక్‌సభ ఎన్నికల్లో తొమ్మిది మంది లింగాయత్‌లు ఎక్కినైనా వారిలో ఏ ఒక్కరికీ మంత్రి పదవి ఇవ్వలేదని ఆయన మండిపడుతున్నారు. కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల సమయంలో బిజెపికి రాజీనామా చేసి కాంగ్రెసు పార్టీలో చేరిన జగదీశ్ షెట్టర్ తిరిగి జనవరిలో బిజెపిలో చేరారు. ఆయనకు బెల్గాం టికెట్టు ఇవ్వడంపై స్థానిక బిజెపి నాయకులు తీవ్ర నిరసన గళాలు వినిపిస్తున్నారు. బీదర్ లోక్‌సభ టికెట్ సిట్టింగ్ ఎంపి దేవేంద్రప్పకు కాదని భగవంత్ ఖుబాకు ఇచ్చారు. దీన్ని ఎమ్మెల్యేలు ప్రభుచౌహాన్, శరణు సలాగర్‌లు బాహాటంగానే వ్యతిరేకిస్తున్నారు. చిత్రదుర్గ, దావణంగేరే, తుముకూరు, చిక్కబళ్లాపూర్ లోక్‌సభ నియోజకవర్గాల్లోనూ అసమ్మతి ఉంది.

మిత్రపార్టీకి సహకారం కరువే!

లోక్‌సభ ఎన్నికల్లో కర్ణాటకలో బిజెపి, జెడిఎస్‌లు కూటమిగా పోటీలో ఉన్నాయి. ఇక్కడ బిజెపి 25 స్థానాల్లో, జెడిఎస్ మూడు స్థానాల్లో పోటీ చేస్తున్నాయి. అందులో కుమారస్వామి... మాండ్య నుంచి పోటీలో ఉన్నారు. గత లోక్‌సభ ఎన్నికల్లో ఇక్కడి నుంచి సినీనటి సుమలత స్వతంత్ర అభ్యర్థిగా గెలుపొందారు. ఈసారి అక్కడి నుంచి పోటీ చేయాలని ఆమె భావించారు. ఆమెను తప్పించి జెడిఎస్‌కు సీటు కేటాయించారు. కుమారస్వామి అక్కడి నుంచి పోటీ చేస్తున్నారు. హసన్ లోక్‌సభ స్థానం నుంచి సిట్టింగ్ ఎంపిగా ప్రస్తుతం హెచ్‌డి దేవేగౌడ మనవడు ఉన్నారు. ఆ స్థానాన్ని తిరిగి ఆయనకే కేటాయించారు. ఇక్కడ బిజెపి నుంచి సహకారం శూన్యంగానే కనిపిస్తోంది. ఈ ఎన్నికల్లో రేవన్నకు కాకుండా కాంగ్రెస్ అభ్యర్థి శ్రేయస్ పటేల్‌కు సహకరించనున్నట్టు బాహాటంగానే బిజెపి మాజీ ఎమ్మెల్యే ప్రీతమ్ జి గౌడ్ సన్నిహితుడు ఉద్దారు పురుషోత్తం ప్రకటించారు. జెడిఎస్‌కు కేటాయించిన కోలార్ లోక్‌సభలోనూ అంతంత మాత్రంగానే సహకారం అందుతోంది.



విజేతలు తక్కువే...!

- పెరుగుతున్న మహిళా అభ్యర్థుల సంఖ్య
- అయినా లోక్‌సభలో అడుగు పెట్టింది కొద్ది మందే
- ధనబలం, కండబలాన్ని తట్టుకోవడం కష్టమవుతోందన్న నిపుణులు


న్యూఢిల్లీ : లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేస్తున్న మహిళా అభ్యర్థుల సంఖ్య క్రమేపీ పెరుగుతోంది. 1957 ఎన్నికల్లో కేవలం 45 మంది మహిళలు మాత్రమే పోటీ చేయగా గత లోక్‌సభ ఎన్నికల నాటికి ఆ సంఖ్య 726కి పెరిగిందని ఎన్నికల కమిషన్ వద్ద ఉన్న సమాచారం చెబుతోంది. అదే సమయంలో పార్లమెంటులో మహిళల ప్రాతినిధ్యం కూడా పెరుగుతోంది. 1957లో పార్లమెంటులో 4.5% మంది మహిళలు మాత్రమే ఉండగా 2019లో వారి ప్రాతినిధ్యం 14.4%కి పెరిగింది. లోక్‌సభకు పోటీ చేస్తున్న పురుష అభ్యర్థుల సంఖ్య కూడా పెరుగుతోంది. 1957లో 1,457 మంది పోటీపడగా గత ఎన్నికల్లో 7,322 మంది పురుషులు బరిలో నిలిచారు. పురుష అభ్యర్థుల సంఖ్య ఐదు రెట్లు పెరిగితే మహిళా అభ్యర్థుల సంఖ్య ఏకంగా 16 రెట్లు పెరిగింది. 1957లో లోక్‌సభకు పోటీ చేసిన అభ్యర్థుల్లో కేవలం 2.9% మంది మాత్రమే మహిళలు. 2019లో ఆ సంఖ్య 9%కి పెరిగింది. అయితే మహిళా అభ్యర్థుల సంఖ్య ఇప్పటి వరకూ వెయ్యి దాటకపోవడం గమనార్హం.

పోటీ చేస్తున్నారు కానీ...

1957లో జరిగిన రెండో సార్వత్రిక ఎన్నికల్లో పోటీ పడిన 45 మంది మహిళా అభ్యర్థుల్లో 22 మంది (48.88%) విజయం సాధించారు. అప్పటి నుండి మహిళా అభ్యర్థుల్లో విజేతల సంఖ్య తగ్గుతూ వస్తోంది. 2019 ఎన్నికల్లో పోటీ చేసిన 726 మంది మహిళల్లో కేవలం 78 మంది (10.74%) మాత్రమే లోక్‌సభలో అడుగు పెట్టారు. పురుష అభ్యర్థుల విషయానికి వస్తే 1957లో 31.7% మంది గెలుపొందగా గత ఎన్నికల్లో కేవలం 6.4% మంది మాత్రమే విజేతలయ్యారు. పోటీ పడిన వారిలో విజేతలవుతున్న వారి సంగతి పక్కన పెడితే లోక్‌సభ ఎన్నికల్లో తలపడుతున్న పురుష, మహిళా అభ్యర్థుల సంఖ్య పెరుగుతూనే ఉంది. చట్టసభలో స్థానాలు మాత్రం అప్పటి నుండి అలాగే ఉన్నాయి.

చిత్తశుద్ధి లేదు

గణాంకాలను పరిశీలిస్తే భారతీయ ప్రజాస్వామ్యం పరిణితి చెందుతోందని, మహిళలు అధిక సంఖ్యలో ఎన్నికల ప్రక్రియలో పాలుపంచుకుంటున్నారని 'పొలిటికల్ శక్తి' అనే స్వచ్ఛంద సంస్థ సహ వ్యవస్థాపకుడు, రాజకీయ విశ్లేషకుడు తారా కృష్ణస్వామి వ్యాఖ్యానించారు. పోటీ పడుతున్న పురుషులు, మహిళల మధ్య వ్యత్యాసం అధికంగా ఉంటోందని, మహిళలకు పోటీ చేసే అవకాశాలు తక్కువగా ఉండడమే దీనికి కారణమని నిపుణులు తెలిపారు. మహిళలకు గెలిచే అవకాశాలు అధికంగానే ఉన్నప్పటికీ వారిని పోటీకి నిలిపే విషయంలో రాజకీయ పార్టీలకు చిత్తశుద్ధి లేదని మహిళా హక్కుల కార్యకర్త, సెంటర్ ఫర్ సోషల్ జస్టిస్ డైరెక్టర్ రంజనా కుమారి అభిప్రాయపడ్డారు. ఒకవేళ మహిళలకు టిక్కెట్లు ఇచ్చేందుకు పార్టీలు సుముఖత వ్యక్తం చేసినప్పటికీ వారిని క్లిష్టమైన నియోజకవర్గాల్లో



నిలుపుతున్నారని ఆమె చెప్పారు. కండబలం, ధనబలం అధికంగా ఉన్న బలమైన పురుష అభ్యర్థులతో వారు తలపడాల్సి వస్తోందని అంటూ అలాంటప్పుడు అందరికీ సమానావకాశాలు ఎలా లభిస్తాయని ప్రశ్నించారు. కాగా చట్టసభల్లో మహిళా రిజర్వేషన్లకై దశాబ్దాలుగా పోరాటాలు జరుగుతున్నాయి. పదేళ్ల బిజెపి పాలనలో ఆ అంశం అటకెక్కింది. ఎన్నికల ముందు మోడీ సర్కారు రిజర్వేషన్ల బిల్లు తెచ్చింది. అయితే నియోజకవర్గాల పునర్విభజన, జనాభా గణనలతో లింక్ పెట్టింది. దాంతో మహిళా కోటా అమలుకోసం మరికొన్ని సంవత్సరాలు నిరీక్షించాల్సి వచ్చింది. బిజెపికి చిత్తశుద్ధి ఉంటే ఈ ఎన్నికల నుంచే అమలు చేయొచ్చు.

డిఎంకె కూటమి విజయానికి అగ్రనేతల ప్రచారం



రేపు రాహుల్‌గాంధీ రాక

ప్రజాశక్తి - చెన్నై బ్యూరో

లోక్‌సభ ఎన్నికల్లో తమిళనాడులో డిఎంకె కూటమి అభ్యర్థుల విజయం కోసం అగ్రనేతలు ప్రచారానికి రానున్నారు. కాంగ్రెస్, సిపిఎం, సిపిఐ, డిఎంకె, విసికె తదితర పార్టీల నుంచి అగ్రనేతలు ప్రచారం చేయనున్నారు. ఈనెల 12న ఎఐసిసి నేత రాహుల్‌గాంధీ, 15న ప్రియాంకగాంధీ, 16న పార్టీ జాతీయ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే ప్రచారానికి రానున్నారు. పుదుచ్చేరితో పాటు రాష్ట్రంలోని పది స్థానాల్లో పోటీ చేస్తున్న విషయం విదితమే. ఈ అభ్యర్థులకు మద్దతుగా రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సెల్వ పెరుంతొగై ప్రచారంలో ఉంటారు. ఇప్పటికే డిఎంకె అధినేత, తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్, యువజన నేత ఉదయ్ నిధి స్టాలిన్ సుడిగాలి పర్యటన చేస్తున్నారు. ఈ నేపథ్యంలో 12న కోయంబత్తూరులో రాహుల్‌గాంధీ, సిఎం స్టాలిన్‌తో కలిసి బహిరంగసభలో పాల్గొననున్నారు. 16న మల్లికార్జున ఖర్గే కడలూరు, కృష్ణగిరి లోక్‌సభ నియోజకవర్గాల్లో పర్యటించనున్నారు. అలాగే సిపిఎం నుంచి మదురై లోక్‌సభ స్థానానికి వెంకటేశన్, దిండిగల్ నియోజకవర్గం నుంచి సచ్చిదానందం బరిలో ఉన్నారు. సిపిఐ నుంచి తిరుపూర్ సుబ్బరాయన్, నాగపట్నం నుంచి సెల్వరాజన్ పోటీలో ఉన్నారు. వీరి గెలుపు కోసం ప్రచారానికి సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజాతో పాటు ముఖ్యమంత్రి స్టాలిన్ పాల్గొంటారు. వీరి ప్రచారం ఎప్పుడన్నది తేదీలు ఖరారు కాలేదు.



మెడలో చెప్పల దండతో ఎన్నికల ప్రచారం

లక్నో : ఉత్తరప్రదేశ్ అలీఘర్ స్వతంత్ర అభ్యర్థి పండిట్ కేశవ్ దేవ్ మెడలో చెప్పుల దండ వేసుకుని వినూత్నంగా ఎన్నికల ప్రచారం చేశారు. ఎలక్షన్ కమిషన్ 'చెప్పు' గుర్తును కేశవ్‌కు కేటాయించడంతో ఇలా చెప్పుల దండ వేసుకుని ఈ గుర్తుపై తనకు ఓటు వేయాలని ఓటర్లను అభ్యర్థిస్తున్నారు. దీనికి సంబంధించిన వీడియో సోషల్‌మీడియాలో వైరల్‌గా మారింది.

జనం గొంతుక వెంకటేశన్

- ఐదేళ్ల కృషితో ప్రజలకు చేరువ
- యువత, సాహితీ వేత్తలతో ప్రత్యేక అనుబంధం
- కరోనా కాలంలో ప్రజల్లోనే ఉన్న నేతగా ముద్ర
- మదురై సిపిఎం అభ్యర్థి

ప్రజాశక్తి నుంచి జగదీష్

తమిళనాడు, మదురై అభివద్ధికి ఎంపిగా ఐదేళ్లపాటు చేసిన కషితో సిపిఎం మదురై లోక్‌సభ అభ్యర్థి, ప్రస్తుత ఎంపి ఎస్. వెంకటేశన్ ప్రజలకు చేరువ అవుతున్నారు. కేంద్ర సాహిత్య అకాడమి అవార్డు గ్రహీత అయిన వెంకటేశన్ తమిళనాడు ప్రోగ్రెసివ్ రైటర్స్ అండ్ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ రాష్ట్ర గౌరవాధ్యక్షులుగా ఉన్నారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడైన వెంకటేశన్ మదురై ఎయిమ్స్ నిర్మాణంలో 95 శాతం పూర్తయిందని బిజెపి జాతీయ అధ్యక్షుడు జెపి నడ్డా చేసిన వ్యాఖ్యలను పచ్చి అబద్ధమని బట్టబయలు చేశారు. నడ్డా వ్యాఖ్యలు చేసిన మరుసటి రోజు మదురై ఎంపి వెంకటేశన్ ఎయిమ్స్ ప్రతిపాదిత ప్రాంతం తోపూర్ చేరుకున్నారు. 'ఎయిమ్స్ ఎక్కడ ఉంది?' అనే ప్లకార్డును పట్టుకుని నిరసన తెలిపారు. అక్కడ కనీసం ఒక్క భవనానికి కూడా పునాది వేయలేదు. ఈ అంశం తమిళనాట చర్చనీయాంశంగా మారింది. తమిళనాడు ప్రయోజనాల కోసం చర్చలు జరుగుతున్నప్పుడు ఇలా బాధ్యతాయుతమైన స్థానంలో ఉన్న జెపి నడ్డా చేసిన అబద్ధపు వ్యాఖ్యలపై తీవ్ర నిరసన వ్యక్తం అయింది.

జన వాణి

2019 నుంచి తమిళనాడు గొంతును పార్లమెంట్‌లో లేవనెత్తుతున్న ఎస్.వెంకటేశన్, లోక్‌సభకు మళ్లీ ఎన్నిక కావాలని మదురై ప్రజలు కోరుకుంటున్నారు. ఎంపిగా ఐదేళ్లలో ఆయన నియోజకవర్గానికి చేసిన కార్యక్రమాలు, అభివద్ధి మళ్లీ ప్రజలకు చేరువ చేస్తున్నారు. 2023లో ప్రజల నుంచి నేరుగా సమస్యలను తెలుసుకునేందుకు అధికారులతో ఏర్పాటు చేసిన ముఖాముఖి తమిళనాడుకు కొత్త అనుభవాన్ని మిగిల్చింది.



ప్రజలతో మమేకం

వెంకటేశన్ తనదైన శైలిలో ప్రచారం జోరుగా నిర్వహిస్తున్నారు. ఆయన గెలుపు కోసం సిపిఎం నేతలు, కార్యకర్తలు, ఇండియా ఫోరం నేతలతో పాటు కవులు, రచయితలు, సినీ ప్రముఖులు ప్రచారం చేస్తున్నారు. ప్రముఖ సినీ నటి రోహిణి రోజూ సిపిఎం అభ్యర్థి గెలుపు కోసం ప్రచారం చేస్తున్నారు. మహిళలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొంటున్నారు.

కోవిడ్ కాలంలో అన్ని ఇతర కార్యకలాపాల మధ్య, నియోజకవర్గ ప్రజలకు కూరగాయలు, నిత్యావసరాలను పంపిణీ చేయడానికి ఎంపి స్వయంగా రంగంలోకి దిగి ప్రజల్లో విశేష ఆదరణను పొందగలిగారు. హిందీని జొప్పించాలన్న కేంద్ర ప్రభుత్వ చర్యను ప్రతిఘటించారు. ఆలయాల నగరమైన మదురైకి వినూత్నమైన అభివద్ధి ప్రాజెక్టులను తీసుకురావడానికి, యువతకు మరిన్ని విద్యా, ఉపాధి అవకాశాలను అందించడానికి కషి చేశారు. 'కవల్‌కోట' రచయితను మధురై వాసులు 'సన్ ఆఫ్ వైగా' అని పిలుచుకుంటారు. మదురైకి, సంస్కతికి మూలమైన వైగా నదికి నమస్కరిస్తూ వెంకటేశన్ ప్రచారాన్ని ప్రారంభించారు. ఆయన అభివద్ధి, పర్యావరణాన్ని మిళితం చేసే తమిళనాడు ముర్పోక్ ఎజుతలార్ సంఘానికి నాయకుడుగా ఉన్నారు. యువతతో సహా అన్ని వర్గాల ప్రజల నుంచి బలమైన మద్దతును చూరగొన్నారు.

సిపిఎంకు బలమైన కేంద్రం

మదురై లోక్‌సభ నియోజకవర్గం మదురై తూర్పు, పశ్చిమ, దక్షిణ, ఉత్తర, మధ్య, మేలూర్ అసెంబ్లీ నియోజకవర్గాలను కలిగి ఉంది. సిపిఎంకు బలమైన కేంద్రంగా ఉన్న ఈ నియోజకవర్గం 1999-2004లో సిపిఎం నుండి పి మోహన్ ఎంపిగా గెలిచారు. అంతకు ముందు 1967లో సిపిఎం సీనియర్ నేత పి.రామమూర్తి ఎంపిగా ఉన్నారు. 1957లో సిపిఐకి చెందిన కెటికె తంగమణి ఎంపిగా విజయం సాధించారు. 2019 ఎన్నికల్లో వెంకటేశన్ 44.20 శాతం ఓట్లతో అన్నాడిఎంకె అభ్యర్థి వివిఆర్ రాజ్ సత్యన్‌పై 1,34,119 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. ఈసారి ఎఐఎడిఎంకెకు చెందిన పి. శరవణన్, బిజెపికి చెందిన రామ శ్రీనివాసన్ ఆయన ప్రత్యర్థులు. సార్వత్రిక ఎన్నికల మొదటి దశ పోలింగ్ లో ఈనెల 19న ఎన్నికలు జరగనున్నాయి.

సిక్కింలో ప్రాంతీయ పార్టీలదే హవా..!



ఈశాన్య భారత్‌లోని అతిచిన్న రాష్ట్రాల్లో ఒకటి సిక్కిం. సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా అసెంబ్లీ, లోక్‌సభ స్థానాలకు ఏప్రిల్ 19న ఎన్నికలు జరగనున్నాయి. కాంగ్రెస్, ప్రాంతీయ పార్టీలే పోటీలో ఉన్న సిక్కింలోకి బిజెపి చొరబడాలని చూస్తోంది. 2009 నుంచి తన అభ్యర్థులను నిలబెడుతూ గెలవాలని చూస్తున్నా అక్కడి ప్రజలు ప్రాంతీయ పార్టీలవైపే మొగ్గుచూపుతున్నారు.

స్వతంత్ర రాజ్యం నుంచి...

1642లో సిక్కిం ఒక స్వతంత్ర రాజ్యంగా ఏర్పడి ఛోగ్యాల్ రాజుల ఏలుబడిలో ఉండేది. 12 మంది రాజులు సిక్కింను పాలించారు. 18వ శతాబ్దంలో సిక్కింను బ్రిటిష్ ప్రభుత్వం వశరుచుకుంది. భారతదేశానికి స్వాతంత్ర్యం ఇచ్చే నాటికి సిక్కింపై బ్రిటీష్ వారికున్న అధికారాలను భారత్‌కు బదిలీ చేశారు. భారత రాజ్యాంగ పరిధిలోకి చేర్చుకునేందుకు కొంత సమయం పట్టటంతో ప్రత్యేక రాష్ట్రంగా కొనసాగించారు. 1975మే 16న ప్రజల అంగీకారంతో సిక్కింను భారత ప్రభుత్వంలో విలీనం చేశారు. 1977లో తొలిసారి సార్వత్రిక ఎన్నికల్లో సిక్కిం కూడా పాల్గొంది. ఈ రాష్ట్రంలో ఇప్పటి వరకు పదిసార్లు ఎన్నికలు జరిగాయి. త్వరలో జరిగే అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు జూన్ 2న వెలువడనున్నాయి. లోక్‌సభ ఓట్ల లెక్కింపు జూన్ 4న చేపడతారు.

అసెంబ్లీ ఎన్నికలు

సిక్కింలో మొత్తం 32 అసెంబ్లీ స్థానాలున్నాయి. 1979 నుంచి అసెంబ్లీ ఎన్నికల్లో ప్రాంతీయ పార్టీలు మాత్రమే గెలుస్తున్నాయి. పవన్ చామ్లింగ్ వరుసగా ఐదు సార్లు సిఎంగా గెలుపొందారు. 2019 అసెంబ్లీ ఎన్నికల్లో 17 స్థానాలు గెలుచుకుని సిక్కిం క్రాంతికారా మోర్చా (ఎస్‌కెఎం) పార్టీ అధికారంలోకి వచ్చింది. ప్రతిపక్ష సిక్కిం డెమోక్రటిక్ ఫ్రంట్ పార్టీ 15 స్థానాలను గెలుచుకుంది. బిజెపి 12 స్థానాల్లో పోటీ చేసినప్పటికీ ఒక్కసీటు కూడా సాధించలేకపోయింది. కానీ, ప్రతిపక్ష ఎస్‌డిఎఫ్ నుంచి 10 మంది ఎమ్మెల్యేలను తన పార్టీలోకి ఫిరాయించేలా చేసింది. 2019 బైపోల్స్‌లో ప్రతిపక్ష ఎస్‌డిఎఫ్‌తో పొత్తు పెట్టుకుని రెండు స్థానాలను గెలుచుకుంది.


ఒకే ఒక్క లోక్‌సభ స్థానం

సిక్కిం లోక్‌సభ స్థానానికి 14 మంది పోటీ పడుతున్నారు. 2019లో ఎస్‌కెఎం పార్టీ నుంచి ఇంద్ర హంగ్ సుబ్బా గెలిచారు. హిమాలయ పర్వత ప్రాంతంలో ఉన్న సిక్కిం రాష్ట్రం నేపాల్, భూటాన్, టిబెట్ (చైనా) దేశాలతో సరిహద్దులు కలిగి ఉండటంతో అన్ని ప్రాంతాల వారు ఇక్కడ స్థిరపడ్డారు. మొత్తం 4,62,456 మంది ఓటర్లు ఉన్నారు. 2,32,117 మంది పురుషులు, 2,30,117 మంది మహిళా ఓటర్లు. అసెంబ్లీ ఎన్నికల్లో 12 మంది మహిళా అభ్యర్థులు పోటీ పడుతున్నారు.

కార్పొరేట్ల ప్రకృతి విధ్వంసం

గత ఏడాది అకస్మాత్తుగా సంభవించిన తీస్తా నది వరదలు రాష్ట్రంలో బీభత్సం సృష్టించాయి.వరదలకు 41,870 మంది ప్రభావితమయ్యారు. 39 మంది మృతిచెందారు. వందమందికి పైగా గల్లంతయ్యారు. జాతీయ రహదారి కోసం కొండలపై తవ్వకాలు, తీస్తా నదిపై బ్రిడ్జిలు నిర్మించడంతో ఈ భయానక వాతావరణం ఏర్పడిందని స్థానికులు భావిస్తున్నారు. ఈసారి బిజెపి ఎలాగైనా గెలుపొందాలని చూస్తున్నా ఇక్కడి ఓటర్లు మాత్రం ప్రాంతీయ పార్టీలకే మద్దతు పలుకుతున్నారు.

- ఎలక్షన్ డెస్క్



2019 బలాబలాలు

పార్టీ	పోటీచేసిన స్థానాలు	గెలుపొందిన స్థానాలు
సిక్కిం క్రాంతి మోర్చా	32	17
సిక్కిం డెమొక్రాటిక్ ఫ్రంట్	32	15
కాంగ్రెస్	24	0
బిజెపి	12	0
హర్మో సిక్కిం పార్టీ	23	0

కలం బాణాలు




వైసీపీ లోకి పోతిన మహేష్

సీటిస్తే విధేయులం
లేదంటే వీరంగం
పదవి కన్న ఏమున్నది
రాజకీయ పరమార్థం

అవకాశం బట్టేగా
పార్టీలలో చిరునామా
ఆ మాత్రం దానికింక
ఎందుకంట హంగామా

వలంటీర్లకు పదివేలు చంద్రబాబు



వలంటీరులంటేనే
నిన్న దాక ఒకే ట్రబుల్
ఇపుడంతా మారిందా
జీతాలే డబుల్ డబుల్

ప్రతి రోజూ ఏదోలా
ప్రజల ముందు యు టర్న్
విశ్వాసం మిగిలేనా
వాగ్దానం పాప్ కార్న్

మా అబ్బాయి ఓడిపోవాలి - ఎకె ఆంటోనీ

కొడుకైనా బాబైనా
విధానమే ముఖ్యం
తప్పుదారి తొక్కారా
మద్దతెలా సాధ్యం?

కాషాయం కప్పుకున్న
కొడుకు తోటి కటీఫు
కేరళలో గెలవడమా
భవిత ఇంక కటాఫు

- తెర






విశాఖలో కూటమి అగచాట్లు

- పలు అసెంబ్లీ సీట్లలో అసంతృప్తులు
- ఎంపి స్థానం కోసం బిజెపి నేత జివిఎల్ పట్టు
- ఢిల్లీకి లేఖల పర్వం







ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

విశాఖ జిల్లాలో టిడిపి, జనసేన, బిజెపి కూటమి అగచాట్లు పడుతోంది. అసెంబ్లీ స్థానాల్లో ఆ పార్టీల నేతల మధ్య నేటికీ అసంతృప్తులు కొనసాగుతున్నాయి. ఇవి ఆయా పార్టీల అధిష్టానాలను ఆందోళనకు గురిచేస్తున్నాయి. విశాఖ పార్లమెంటు పరిధిలో 7 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. టిడిపి తరపున ఎంపి అభ్యర్థిగా శ్రీభరత్ పోటీ చేస్తున్నారు. అయితే బిజెపి నుంచి టికెట్ ఆశించి భంగపడ్డ జివిఎల్ నరసింహారావు ఇంకా తనకు సీటు వస్తుందన్న ఆశతో ఉన్నారు. ఢిల్లీకి పలుసార్లు వెళ్లడం, విశాఖ నుంచి తన అనుచరులతో అమిత్ షా, మోడీకి లేఖలు రాయించడం కొనసాగిస్తున్నారు. అధిష్టానం బుజ్జగించినా ఇప్పటికీ మెత్తపడలేదు. అసంతృప్తి గళాన్ని వినిపిస్తూ, తన అనుచరులతో నిరసనలకు దిగుతున్నారు. వైసిపి అభ్యర్థిగా మంత్రి బొత్స సత్యనారాయణ సతీమణి ఝాన్సీలక్ష్మి పార్లమెంటు బరిలో దిగారు. కాపు సామాజిక తరగతి ఓట్లు పార్లమెంటు పరిధిలో ఎక్కువగా ఉండడం, స్థానికురాలు అనే ఎత్తుగడతో ఆమె పేరును వైసిపి అధిష్టానం ఖరారు చేసింది. ఈ మేరకు ఆమె ఇప్పటికే ప్రచారం చేసుకుంటున్నారు.

అసెంబ్లీ సీట్లలో పరిస్థితి ఇలా..

విశాఖ తూర్పు అసెంబ్లీ సెగ్మెంట్‌లో టిడిపి నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబుకు టికెట్ దక్కింది. వైసిపి నుంచి ఎంవివి సత్యనారాయణ పోటీ చేస్తున్నారు. ఆయన ప్రస్తుతం విశాఖ ఎంపిగా ఉన్నారు. తనకు ఎమ్మెల్యే టికెట్ ఖాయం అయినప్పటి నుంచీ వార్డుల్లో పాదయాత్రలు చేస్తూ ఎంవివి ముందుకెళ్తున్నారు. ఇక టిడిపి అభ్యర్థి వెలగపూడి ఇప్పటికే ఈ నియోజకవర్గం నుంచి మూడుసార్లు వరుసగా గెలిచారు. అయితే గతంలో ఆయనకు సహకరించిన సినీ నిర్మాత కంచర్ల అచ్యుతరావు ఇటీవల వైసిపిలో చేరడం టిడిపికి ఈ సెగ్మెంట్‌లో పెద్ద ఎదురుదెబ్బే.

విశాఖ దక్షిణ నియోజకవర్గం నుంచి వైసిపి అభ్యర్థిగా వాసుపల్లి గణేష్‌కుమార్ బరిలో ఉన్నారు. 2019 ఎన్నికల్లో టిడిపి తరపున గెలిచిన ఆయన తరువాత కాలంలో వైసిపిలోకి జంప్ అయ్యారు. ఇక్కడ కూటమి నుంచి జనసేన అభ్యర్థి వంశీకృష్ణ శ్రీనివాస్ బరిలో ఉన్నారు. ఆయన కొద్ది నెలల క్రితం వరకూ వైసిపిలో కీలకంగా వ్యవహరించారు. తదనంతర కాలంలో పార్టీపై విమర్శలు గుప్పిస్తూ రాజీనామా సమర్పించారు. విశాఖ తూర్పు నియోజకవర్గానికి చెందిన ఆయనకు దక్షిణంలో టికెట్ ఇవ్వడం పట్ల జనసేన, టిడిపి నాయకులు గుర్రుగా ఉన్నారు. ఆయన అభ్యర్థిత్వాన్ని నిరాకరిస్తూ జనసేన శ్రేణులు నిరసనలకు దిగుతున్నాయి. అయితే టిడిపి మాజీ ఎమ్మెల్యే గండి బాబ్జీ, బ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ సీతంరాజు సుధాకర్ వంటివారు తన గెలుపునకు కృషి చేస్తారన్న ఆశతో వంశీకృష్ణ శ్రీనివాస్ ఉన్నారు.

ఉత్తరం అసెంబ్లీ నియోజకవర్గం నుంచి వైసిపి అభ్యర్థిగా కెకె రాజు బరిలో ఉన్నారు. ఆయన గత ఎన్నికల్లో టిడిపి అభ్యర్థి గంటా శ్రీనివాసరావుపై ఓటమి చెందారు. అయినప్పటికీ ఈ ఐదేళ్లూ నియోజకవర్గంలో పలు కార్యక్రమాలు చేపడుతూ వచ్చారు. ఆయనపై కొంత సానుభూతి వ్యక్తమవుతోంది. కూటమిలో బిజెపికి ఈ సీటు దక్కింది. మాజీ ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు ఆ పార్టీ తరపున మళ్లీ పోటీ చేస్తున్నారు. 2014లో గెలిచినప్పుడు తమను పట్టించుకోలేదంటూ ఆయనపై టిడిపి నేతలు విమర్శలు గుప్పిస్తూనే ఉన్నారు. జనసేన సహకారం కూడా ఈ నియోజకవర్గంలో ఆయనకు పూర్తి స్థాయిలో దక్కడం లేదు. జై భారత్ నేషనల్ పార్టీ అభ్యర్థిగా ఆ పార్టీ అధ్యక్షులు వివి లక్ష్మీనారాయణ ఇక్కడ నుంచి పోటీ చేస్తున్నారు.

విశాఖ పశ్చిమ నియోజకవర్గంలో 2019లో టిడిపి నుంచి గెలిచిన పెతకంశెట్టి గణబాబు ఈసారీ పోటీ చేస్తున్నారు. ఆయనపై వైసిపి అభ్యర్థిగా విశాఖ డెయిరీ ఛైర్మన్ ఆడారి ఆనంద్ కుమార్ బరిలో నిలిచారు. గణబాబుపై కొంత వ్యతిరేకత కనిపిస్తోంది.

గాజువాక నియోజకవర్గం నుంచి టిడిపి తరపున మాజీ ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు పోటీ చేస్తున్నారు. ఇక్కడ వైసిపి అభ్యర్థిగా పరిశ్రమలశాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ పోటీలో ఉన్నారు. గతంలో ఆయన అనకాపల్లి నుంచి ఎమ్మెల్యేగా గెలిచి మంత్రి అయ్యారు. స్టీల్‌ప్లాంట్ విషయంలో ఆయన మెతకగానే ఉన్నారు. ఈ ప్రాంత వాణిని వినిపించలేదు. వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు పూనుకున్న బిజెపితో టిడిపి, జనసేన పొత్తుపెట్టుకోవడం పట్ల కూటమిపై కార్మికవర్గం, ప్రజల్లో ఆగ్రహం వ్యక్తమవుతోంది. టిడిపి అభ్యర్థి పల్లాకు ఇది ప్రతికూలంగా మారే అవకాశం ఉంది. ఇక్కడ నుంచి సిపిఎం అభ్యర్థిగా ఎం జగ్గునాయుడు బరిలో ఉన్నారు. ఈ నియోజకవర్గంలోని రెండు వార్డుల్లో ప్రస్తుతం సిపిఎం, సిపిఐ కార్పొరేటర్లు ఉండటం, కార్మికవర్గం పెద్ద సంఖ్యలో ఈ నియోజకవర్గంలోనే నివసిస్తుండటం సిపిఎంకు కలిసొచ్చే అంశం. స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు నిబద్ధతతో సిపిఎం, వామపక్షాలే పోరాడుతున్నాయన్న అభిప్రాయం ఇక్కడి ప్రజల్లో ఉంది.

భీమిలి అసెంబ్లీ స్థానానికి సంబంధించి టిడిపి నుంచి గంటా శ్రీనివాసరావు పోటీలో ఉన్నారు. వైసిపి అభ్యర్థిగా సిట్టింగ్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు బరిలో ఉన్నారు. తొలి నుంచీ ముత్తంశెట్టి ప్రచారంలో ఉన్నప్పటికీ గంటా బలమైన అభ్యర్థి కావడంతో వైసిపి శ్రేణుల్లో ఆందోళన నెలకొంది.

ఉండిలో 'రఘురామ' చిచ్చు

- ఇప్పటికే రెబల్ అభ్యర్థిగా శివ ప్రచారంతో తలనొప్పులు
- తాజాగా టిడిపి అభ్యర్థి మంతెన రామరాజు మార్పు చర్చతో రాజీనామా హెచ్చరికలు
- రసవత్తరంగా పశ్చిమ డెల్టా రాజకీయం

ప్రజాశక్తి-ఏలూరు ప్రతినిధి

పశ్చిమగోదావరి జిల్లాలో ఉద్దండుల నియోజకవర్గంగా పేరొందిన ఉండి నియోజకవర్గం ప్రస్తుతం రాష్ట్ర రాజకీయాల్లోనే చర్చనీయాంశంగా మారింది. ఉండి టికెట్‌ను సిట్టింగ్ ఎమ్మెల్యే మంతెన రామరాజుకే టిడిపి కేటాయించింది. దీంతో ఈ టికెట్ ఆశించి భంగపడ్డ మాజీ ఎమ్మెల్యే వేటుకూరి వెంకట శివరామరాజు (శివ) స్వతంత్ర అభ్యర్థిగా బరిలోకి దిగనున్నట్లు ప్రకటించి ప్రచారం ప్రారంభించారు. దీంతో టిడిపికి కంచుకోటగా పేరొందిన ఉండి నియోజకవర్గంలో ఆ పార్టీ శ్రేణులు శివ, రామరాజు గ్రూపులుగా చీలిపోయారు. ఈ పరిస్థితుల్లో రఘురామ కృష్ణరాజు టిడిపిలోకి ఎంట్రీతో ఆ పార్టీ శ్రేణులు కకావికలమయ్యే పరిస్థితి దాపురించింది.

వైసిపి అధికారంలోకి వచ్చిన కొన్ని నెలల నుంచే స్వయంగా జగన్‌పైనే విమర్శలు ఎక్కుపెడుతూ.. రాష్ట్ర ప్రభుత్వ విధానాలపై పార్లమెంటులో విమర్శలు గుప్పిస్తూ.. బిజెపి జాతీయ నేతలకు సన్నిహితంగా ఉన్న వైసిపి నరసాపురం ఎంపి రఘురామ కృష్ణరాజు టిడిపి నుంచి ఉండి ఎమ్మెల్యే అభ్యర్థిగా బరిలోకి దిగనున్నారనే ప్రచారమే దీనికి కారణం. వైసిపి నేతలకు కొరకరాని కొయ్యగా మారిన రఘురామ తాను ప్రస్తుతం ఏ పార్టీలో లేనంటూనే టిడిపి కూటమి నుంచి ఎంపి అభ్యర్థిగా కచ్చితంగా బరిలోకి దిగుతానని తాడేపల్లిగూడెంలో నిర్వహించిన 'జెండా' సభలో స్వయంగా ప్రకటించిన సంగతి తెలిసిందే. దీంతో నరసాపురం ఎంపి అభ్యర్థిగా బిజెపి తరపున రఘురామ బరిలోకి దిగుతారని అంతా భావించారు. అయితే నరసాపురం ఎంపి సీటు బిజెపికే దక్కినా టికెట్ మాత్రం రఘురామకు కాకుండా ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి భూపతిరాజు శ్రీనివాసవర్మకు దక్కింది. దీంతో ఇప్పటి వరకూ వైసిపిని ఇరుకున పెట్టిన రఘురామ గొంతులో పచ్చివెలక్కాయ పడినట్లయింది. అయినా ఏమాత్రం జంకకుండా బిజెపి జాతీయ నేతలతో సన్నిహితంగా ఉన్నా.. రాష్ట్ర నేతలతో సత్సంబంధాలు లేకపోవడమే ఈ పరిణామానికి కారణమని, త్వరలోనే తానే కూటమి తరపున అభ్యర్థినవుతానంటూ బీరాలు పలికారు. ఏమైందో ఏమోగాని బిజెపి తన అభ్యర్థి మార్పునకు ససేమిరా అనడంతో రఘురామ ఎక్కడోచోట అవకాశం కల్పించాల్సిన బాధ్యత చంద్రబాబుపై పడింది. అదే క్రమంలో ఉండి నుంచి పోటీ చేసి గెలుపొందడం ద్వారా హోంమంత్రి పదవి చేజిక్కించుకుని వైసిపి అధినేతను తన పవరేమిటో చూపించాలనే తపనలో రఘురామ ఉన్నారనే ప్రచారమూ పెద్దయెత్తున సాగింది. ఈ క్రమంలోనే ఆయన ఇటీవల పాలకొల్లులో జరిగిన ప్రజాగళం సభలో చంద్రబాబు సమక్షంలో టిడిపిలో చేరారు. దీంతో ఆయన ఉండి నుంచి బరిలోకి దిగడం ఖాయమనే ప్రచారానికి బలం చేకూరింది. అయితే అనూహ్యంగా మరుసటి రోజే పాలకొల్లు నుంచి బయల్దేరుతున్న చంద్రబాబు కాన్వాయ్‌ను ఉండి సిట్టింగ్ ఎమ్మెల్యే మంతెన రామరాజు అనుచరులు అడ్డుకోవడంతో పరిస్థితి మరింత సంక్లిష్టంగా మారింది. ఈ క్రమంలో ఎమ్మెల్యే రామరాజును విజయవాడ పిలిపించి చంద్రబాబు ఒప్పించే ప్రయత్నం చేసినా పార్టీ శ్రేణులు, కుటుంబంతో మాట్లాడి నిర్ణయం తీసుకుంటానని చెప్పి వెనుదిరిగారు. వెనువెంటనే నియోజకవర్గంలో మండలస్థాయి నేతలు, కార్యకర్తలతో ఆత్మీయ సమావేశం నిర్వహించి 'నన్ను పోటీ నుంచి తప్పుకోమంటున్నారు' అని కన్నీటిపర్యంతమయ్యారు. తాను రాజకీయాల్లో ఉంటే పోటీ చేస్తానని, లేనిపక్షంలో రాజకీయాలకు గుడ్‌బై చెబుతానని, తన అడుగులు ఎటు అనేది కుటుంబంతో చర్చించి నిర్ణయం తీసుకుంటానని రామరాజు స్పష్టం చేశారు. ఇదే సమయంలో కాకినాడ జిల్లా పిఠాపురంలో జనసేన అధినేత పవన్ కల్యాణ్‌ను కలిసి తన తరఫున ప్రచారానికి రావాలని రఘురామ కృష్ణరాజు ఆహ్వానించడం, తాను ఎక్కడ నుంచి పోటీ చేసేది 48 గంటల్లో తేలుతుందని ప్రకటించడం ఆయన ఉండి నుంచి బరిలోకి దిగనున్నారని స్పష్టమవుతోందని రాజకీయ పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు. ఇదే జరిగితే రామరాజు పోటీ నుంచి తప్పుకుంటారా, లేక స్వతంత్ర అభ్యర్థిగా బరిలోకి దిగుతారా అనే చర్చ పెద్దయెత్తున సాగుతోంది. ఇప్పటికే టిడిపి రెబల్‌గా బరిలోకి దిగుతున్నట్లు ప్రకటించి ప్రచారం సాగిస్తున్న మాజీ ఎమ్మెల్యే వేటుకూరి వెంకట శివరామరాజు వెనక్కి తగ్గుతారా లేక పోటీలో కొనసాగుతారా అనే చర్చ కూడా సాగుతోంది. ఎందుకంటే రఘురామకు, మాజీ ఎమ్మెల్యే శివకు మధ్య మెరుగైన సంబంధాలున్నాయని సన్నిహితులు చెబుతున్నారు. ఒకవేళ శివ పోటీ నుంచి తప్పుకుని రఘురామ వెంట నడిస్తే రామరాజు బరిలో ఉన్నా వైసిపి, టిడిపి మధ్యే ప్రధాన పోటీ నెలకొనే అవకాశం ఉంది. లేనిపక్షంలో రఘురామ టిడిపి అభ్యర్థిగా, స్వతంత్ర అభ్యర్థులుగా రామరాజు, శివ బరిలో ఉంటే ఆ నియోజకవర్గంలో టిడిపి పరిస్థితి మూడు గ్రూపులుగా మారి వైసిపికి కలిసొచ్చే అవకాశాలు స్పష్టంగా కన్పిస్తున్నాయి. ఎందుకంటే టిడిపి ఆవిర్భవించాక 1983 నుంచి ఇప్పటి వరకూ జరిగిన ఎన్నికల్లో ఒక 2004లో మినహా మిగిలిన అన్నిసార్లూ టిడిపి అభ్యర్థులే ఇక్కడ గెలుపొందారు. రాష్ట్ర వ్యాప్తంగా 2009లో కాంగ్రెస్, 2019లో వైసిపి గాలి వీచినా ఇక్కడ మాత్రం టిడిపి అభ్యర్థులే గెలుపొందడం దీనికి నిదర్శనం. ఈ క్రమంలో రఘురామ రాకతో టిడిపి చీలికలు పేలికలుగా మారుతోందని ఆ పార్టీ కార్యకర్తలే ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ నియోజకవర్గం నుంచి వైసిపి తరపున డిసిసిబి ఛైర్మన్ పివిఎల్ నర్సింహరాజు బరిలో ఉన్నారు. గత ఎన్నికల్లో మంతెన రామరాజు చేతిలో ఓటమి పాలయ్యారు. ఏదేమైనా నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగిసేలోపు నియోజకవర్గంలో రాజకీయ పరిణామాలు ఎలా మారుతాయో వేచిచూడాలి.





అక్షరాయుధాలందించిన ఘనత 'ఉండి' సొంతం

ఉండి నియోజకవర్గానికి ఎంతో చరిత్ర ఉంది. అప్పట్లో స్వాతంత్ర్యోద్యమానికి ఊపిరిగా ఉండే ప్రసార సాధనాలైన పత్రికలన్నీ రహస్యంగా ముద్రించి పడవలు, దోనెల్లో ప్రజలకు చేరవేసిన ఘనత ఈ నియోజకవర్గానికి ఉంది. దండి సత్యాగ్రహం, క్విట్ ఇండియా ఉద్యమాల్లో పాల్గొనడమే కాకుండా ఉద్యమానికి రహస్యంగా అక్షరాయుధాలందించిన ఘనత కూడా ఉంది. అల్లూరి సీతారామరాజు జన్మించిన మోగల్లు ఈ నియోజకవర్గంలోనే ఉంది. హైదరాబాద్ ఇసిఐఎల్ ప్రాంతంలో ఎఎస్‌రావు నగర ఆవిర్భావానికి ఆద్యుడు అయ్యగారి సాంబశివరావు, స్వామి జ్ఞానానంద వంటి శాస్త్రవేత్తలు ఈ ప్రాంతానికి చెందిన వారే. ఉండి నియోజకవర్గంలోని నాయకులు ఉన్నత పదవులు అలంకరించిన వారే ఉన్నారు. కలిదిండి రామచంద్రరాజు.. ఎన్‌టి రామారావు మంత్రివర్గంలో చిన్న తరహా మంత్రిగా, చంద్రబాబు మంత్రివర్గంలో విద్యుత్‌శాఖ మంత్రిగా పనిచేశారు. టిటిడి ఛైర్మన్లుగా పాందువ్వ కనకరాజు, కలిదిండి రామచంద్రరాజు, గాదిరాజు జగన్నాథరాజు, గోకరాజు రంగరాజు, కనుమూరు బాపిరాజు, టిటిడి బోర్డు సభ్యులుగా గోకరాజు రామరాజు పనిచేశారు. నర్సాపురం మాజీ ఎంపి, బిసిసిఐ మాజీ ఉపాధ్యక్షులు గోకరాజు గంగరాజుది ఈ నియోజకవర్గమే. పశ్చిమగోదావరి జిల్లా రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షులు, మాజీ మంత్రి, ఆచంట ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాథరాజుది కూడా ఈ నియోజకవర్గమే.

రసవత్తరం 'అనంత' రాజకీయం

- రెండు ప్రధాన పార్టీల్లోనూ అసంతృప్తులు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

అనంతపురం జిల్లా రాజకీయాలు రసవత్తరంగా మారాయి. పట్టు సాధించేందుకు టిడిపి ప్రయత్నిస్తుండగా, మరోసారి గత ఫలితాలను పునరావృతం చేయాలని వైసిపి ప్రయత్నిస్తోంది. 2019 సార్వత్రిక ఎన్నికల్లో వైసిపి ఫ్యాన్ గాలి జిల్లాలో బలంగా వీచింది. ఎప్పుడూ లేని విధంగా టిడిపి చావు దెబ్బతింది. అనంతపురం జిల్లాలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలుంటే ఆరింటిలో వైసిపి విజయం సాధించింది. ఒక్క ఉరవకొండలోనే పయ్యావుల కేశవ్ టిడిపి తరుపున గెలుపొందారు. అనంతపురం పార్లమెంటు స్థానంలోనూ వైసిపి విజయం సాధించింది. అదే ఫలితాలను ఈసారి పునరావృతంచేయాలని వైసిపి పావులు కదుపుతోంది. అందుకు తగ్గట్టుగా అభ్యర్థుల ఖరారులోనూ అనేక మార్పులు చేపట్టింది. టిడిపి కూడా అందుకు అనుగుణంగా అభ్యర్థుల్లో మార్పులు చేపటట్టింది.

వైసిపిలో మార్పులు.. అసమ్మతులు..

అనంతపురం జిల్లాలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలుంటే మూడు నియోజకవర్గాల్లో మార్పులు చేపట్టింది. రాయదుర్గంలో సిట్టింగ్ ఎమ్మెల్యేగా ఉన్న కాపు రామచంద్రారెడ్డికి కాదని ఎపిఐఐసి ఛైర్మన్ మెట్టు గోవిందరెడ్డికి టిక్కెట్టు ఇచ్చింది. ఇక్కెట్టుకు దక్కకపోవడంతో కాపు రాచంద్రారెడ్డి బిజెపిలో చేరారు. ఇప్పుడు టిడిపి అభ్యర్థి కాలువ శ్రీనివాసులుకు మద్దతుగా ప్రచారంలో పాల్గొంటున్నారు. కళ్యాణదుర్గం



సిట్టింగ్ ఎమ్మెల్యేగా ఉన్న మంత్రి ఉషచరణ్ శ్రీని పెనుకొండ అసెంబ్లీకి మార్చారు. అనంతపురం ఎంపిగానున్న తలారి రంగయ్యను కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అభ్యర్థిగా నిలిపింది. శింగనమల నియోజకవర్గంలో సిట్టింగ్ ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతికి కాదని వీరాంజినేయులుకు ఇచ్చారు. సామాన్యమైన వ్యక్తికి టిక్కెట్టు ఇచ్చినట్టు వైసిపి ప్రచారం చేసుకుంటోంది. ఆ పార్టీ నాయకులు వీరాంజినేయులను మార్పు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. గత అభ్యర్థులే పోటీ ఉన్న ప్రాంతాల్లో కూడా అసమ్మతి కొనసాగుతోంది. ప్రధానంగా అనంతపురం అర్బన్‌లో టిక్కెట్టు ఆశించి దక్కని నేతలు కొందరు అసంతృప్తితోనున్నారు. ఉరవకొండలో ఇదేపరిస్థితి ఉంది. వైసిపి అభ్యర్థి విశ్వేశ్వరరెడ్డికి ఆయన సోదరుడు మధుసూదన్‌రెడ్డి నుంచి వ్యతిరేకత ఉంది. ఆయన్ను పార్టీ నుంచి సస్పెండ్ చేయడంతో కాంగ్రెసులో చేరారు. ప్రస్తుతం ఆయన ఉరవకొండ కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలో నిలిచారు.

టిడిపిలో మార్పులు.. అసమ్మతులు..

తెలుగుదేశం పార్టీ కూడా ఈసారి అభ్యర్థుల ఖరారులో కొన్ని మార్పులు చేపట్టింది. అనంతపురం అర్బన్‌కు మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్ చౌదరి కాకుండా దగ్గుపాటి వెంకటప్రసాద్‌ను వ్యక్తిని బరిలో దింపింది. ఇక్కడ ప్రభాకర్‌చౌదరి నుంచి తీవ్రమైన వ్యతిరేకత దగ్గుపాటికి ఎదురవుతోంది. కళ్యాణదుర్గంలోనూ కాంట్రాక్టర్ అయిన అమిలినేని సురేంద్రబాబుకు ఇచ్చారు. దీంత మాజీ ఎమ్మెల్యే ఉన్నం హనుమంతరాయచౌదరి, నియోజకవర్గ ఇన్‌ఛార్జీగా మొన్నటి వరకున్న మాదినేని ఉమామహేశ్వరనాయడు అసంతృప్తితో ఉన్నారు. మాదినేని ఉమామహేశ్వరనాయుడు టిడిపికి రాజీనామా చేసి వైసిపిలో చేరారు. గుంతకల్లోనూ మాజీ ఎమ్మెల్యే జితేందర్‌గౌడ్‌ను కాదని మాజీ మంత్రి గుమ్మనూరు జయరాంకు టిక్కెట్టు కేటాయించారు. దీంతో అక్కడ జితేందర్‌గౌడ్ వర్గం ప్రచారానికి దూరంగా ఉంటోంది. ఇక తక్కిన నియోజకవర్గాల్లో పెద్దగా అసమ్మతులేవీ లేవనే చెప్పవచ్చు. తాడిపత్రి నుంచి మున్సిపల్ ఛైర్మన్ జెసి.ప్రభాకర్‌రెడ్డి తనయుడు జెసి.అస్మిత్‌రెడ్డి బరిలో ఉండగా, రాయదుర్గం నుంచి మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు, ఉరవకొండ నుంచి పయ్యావుల కేశవ్ బరిలోనున్నారు.

హైదరాబాద్ స్టేట్ విలీనానంతర

తొలి (1962) సంయుక్త ఎన్నికలు

మద్రాసు రాష్ట్రంలో అంతర్భాగంగా ఉన్న ఆంధ్ర ప్రాంతం 1953లో ఆంధ్ర రాష్ట్రంగా ఏర్పడి... మళ్లీ 1956లో హైదరాబాద్ స్టేట్ (తెలంగాణ) విలీనమై "ఉమ్మడి ఆంధ్రప్రదేశ్"గా రూపుదిద్దుకున్న విషయం తెలిసిందే. ఆంధ్ర రాష్ట్రానికీ, హైదరాబాద్ స్టేట్‌కూ 1952లోనే విడివిడిగా ఎన్నికలు జరిగినా.. ఆంధ్ర రాష్ట్రానికి 1955లో మధ్యంతర ఎన్నికలొచ్చాయి. 1956లో హైదరాబాద్ స్టేట్ ఆంధ్రరాష్ట్రంలో విలీనం అయింది. అయితే హైదరాబాద్ స్టేట్ శాసనసభ్యులకు 1957 నాటికి పదవీ కాలం పూర్తయింది. ఈ కారణంగా ఆంధ్ర రాష్ట్రంలో విలీనమైన తెలంగాణా స్టేట్ నుంచి మళ్లీ ఎన్నికలు నిర్వహించాల్సి వచ్చింది.

హైదరాబాద్ స్టేట్‌కు సంబంధించి మొత్తం ఏకసభ్య (85) ద్విసభ్య (20)స్థానాలతో కలిపి 105 స్థానాలున్నాయి. ఆ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు 68, పిడిఎఫ్ పేరుతో పోటీ చేసిన కమ్యూనిస్టు పార్టీకి 22, ఇండిపెండెంట్లకు 12, పిఎస్‌పి, పిపి ఒక్కొక్కటి చొప్పున గెలుపొందాయి. కాంగ్రెస్‌కు 47.38 శాతం ఓట్లు రాగా, పిడిఎఫ్ పేరుతో పోటీ చేసిన కమ్యూనిస్టు పార్టీకి 25.75 శాతం ఓట్లు వచ్చాయి. వీరి పదవీకాలం 1962 నాటికి ముగుస్తుంది. అయితే అంతకు ముందే ఆంధ్రకు 1955లో ఎన్నికలు జరిగినందువల్ల పదవీకాలం 1960 నాటికే పూర్తి కావలసి ఉంది. అందువల్ల ఉభయ రాష్ట్రాల విలీనాన్ని దృష్టిలో ఉంచుకొని (1957నాటి ఇబ్బంది మళ్లీ తలెత్తకుండా) 1962 నాటి జనరల్ ఎన్నికలతోపాటు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు ఎన్నికలు నిర్వహించాల్సి వచ్చింది. 1962 ఎన్నికలకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ శాసనసభలో 300 అసెంబ్లీ నియోజకవర్గాలను ఏర్పాటు చేశారు. అన్నీ ఏకసభ్య నియోజకవర్గాలే. ద్విసభ్య నియోజకవర్గాలు లేవు. ఈ పరిణామాల్లో అంతకుముందు మెజారిటీ రాని కాంగ్రెస్ పార్టీకి అధికారం వచ్చేలా సహకరించిన కృషికార్ లోక్‌పార్టీ, కిసాన్ మజ్దూర్ ప్రజా పార్టీ, ప్రజా సోషలిస్టు వంటి పార్టీలు కనుమరుగయ్యాయి. ఈ ఎన్నికల నాటికి కొత్తగా స్వతంత్ర పార్టీ రంగంలోకి వచ్చింది.

1955 ఎన్నికల అనంతరం మూడేళ్ల 71 రోజులపాటు అంటే 1960 జనవరి 11 వరకూ నీలం సంజీవరెడ్డి ముఖ్యమంత్రిగా వ్యవహరించారు. ఆ తరువాత కాంగ్రెస్‌లో మళ్లీ గొడవలు వచ్చి దామోదరం సంజీవయ్యను ముఖ్యమంత్రి చేశారు. ఆయన రెండు సంవత్సరాల 60 రోజులపాటు 1962 మార్చిలో సాధారణ ఎన్నికల వరకూ ముఖ్యమంత్రిగా బాధ్యతలు నిర్వహించారు. అనంతరం శాసనసభకు ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో 300 స్థానాలున్న శాసనసభకు కాంగ్రెస్ అన్ని స్థానాలకూ పోటీ చేసింది. ఈసారి కాంగ్రెస్‌కు అప్పటివరకూ ఆదుకున్న మిత్రపక్షాలు లేవు. సింగిల్‌గా పోటీ చేసి 47.25 శాతం ఓట్లు సంపాదించి 177 స్థానాలను గెలుచుకుంది. కమ్యూనిస్టు పార్టీ కేవలం 136 సీట్లకు మాత్రమే పోటీ చేసింది. శాసనసభలో సగంకన్నా తక్కువ స్థానాల్లోనే పోటీ చేసింది. అయినా 20 శాతం ఓట్లు తెచ్చుకొని 51 స్థానాలను గెలవగలిగింది. మరో ఏడుగురు కమ్యూనిస్టులు ఇండిపెండెంట్లుగా పోటీచేసి కమ్యూనిస్టు పార్టీ మద్దతుతో విజయం సాధించారు. గెలిచిన వారు ఇండిపెండెంట్లు కనుక కమ్యూనిస్టు పార్టీ ఎమ్మెల్యేలుగా సాంకేతికంగా లెక్కలోకి రాలేదు. కొత్తగా ఎన్నికల్లో పాల్గొన్న స్వతంత్ర పార్టీ 141 సీట్లలో పోటీ చేసి 19 స్థానాలను గెలుచుకున్నది. ఈ పార్టీకి 10.40 శాతం ఓట్లు వచ్చాయి. 300 స్థానాలకు పోటీ చేసిన ఇండిపెండెంట్లు 20 శాతం ఓట్లు తెచ్చుకొని 51 స్థానాలను గెలవగలిగారు. సోషలిస్టు పార్టీ 2 స్థానాల్లో గెలుపొందింది. మరే ఇతర పార్టీకి ప్రాతినిధ్యం లభించలేదు.

1962లో పార్టీల బలాబలాలు (మొత్తం స్థానాలు 300)				
పార్టీ	పోటీ	గెలుపు	ఓట్లు	శాతం
కాంగ్రెస్	300	177	55,23,359	47.25
కమ్యూనిస్టు	136	51	22,82,767	19.53
స్వతంత్ర పార్టీ	141	19	12,15,987	10.40
ఇండిపెండెంట్లు	300	51	23,93,415	20.40
సోషలిస్టు పార్టీ	15	2	70,878	0.61

నీలం సంజీవరెడ్డి ముఖ్యమంత్రి, సుందరయ్య ప్రతిపక్ష నేత


ప్రభుత్వం ఏర్పాటు చేయగలిగే సాధారణ మెజారిటీ 151 సీట్లు వస్తే సరిపోతుంది. కాంగెస్‌కు 22 సీట్లు ఎక్కువ వచ్చాయి. ఏ పార్టీపైనా ఆధారపడే పరిస్థితి కాంగ్రెస్‌కు రాలేదు. మళ్లీ నీలం సంజీవరెడ్డిని ఎన్నుకున్నారు. అయితే ఆయన ఒక సంవత్సరం 346 రోజులు మాత్రమే అంటే 1964 ఫిబ్రవరి 1వ తేదీ వరకే ముఖ్యమంత్రిగా పనిచేశారు. అధికారయుత ప్రతిపక్ష నాయకుడుగా గన్నవరం అసెంబ్లీ నియోజకవర్గం నుంచి విజయం సాధించిన పుచ్చలపల్లి సందరయ్య ఎన్నికయ్యారు. అయితే కాంగ్రెస్‌లో అప్పటి వరకూ ఏ ముఖ్యమంత్రినీ ఐదేళ్ల పాటు పదవిలో ఉండనివ్వలేదు. ఐదేళ్ల కాలంలో ఇద్దరు, ముగ్గురు ముఖ్యమంత్రులను మార్చేసే సంప్రదాయం 1983 వరకూ కొనసాగించింది. అలాగే నీలం సంజీవరెడ్డిని కూడా పట్టుమని రెండేళ్లు కూడా ముఖ్యమంత్రి పదవిలో ఉంచలేదు.

1964లో ముఖ్యమంత్రిగా కాసు బ్రహ్మానందరెడ్డి, ప్రతిపక్ష నేతగా నాగిరెడ్డి

మిగిలిన మూడేళ్ల పదవీ కాలానికి ముఖ్యమంత్రిగా కాసు బ్రహ్మానందరెడ్డి ఎన్నికయ్యారు. అనంతర కాలంలో కమ్యూనిస్టు పార్టీలో చీలిక ఏర్పడింది. సిపిఎం ఆవిర్భవించింది. దీంతో అప్పటివరకూ ప్రతిపక్ష నేతగా ఉన్న పుచ్చలపల్లి సుందరయ్య సిపిఎం అఖిల భారత ప్రధాన కార్యదర్శిగా ఎన్నిక కావడంతో ఆ స్థానంలో గతంలో ప్రతిపక్ష నేతగా పనిచేసిన తరిమెల నాగిరెడ్డిని సిపిఎం పక్ష నేతగా ఎన్నుకున్నారు. కాసు బ్రహ్మానందరెడ్డి 1967 సాధారణ అసెంబ్లీ ఎన్నికల వరకూ ముఖ్యమంత్రిగా కొనసాగారు.

కాసు బ్రహ్మానందరెడ్డికి ముందు ముఖ్యమంత్రిగా పనిచేసిన నీలం సంజీవరెడ్డి, తరిమెల నాగిరెడ్డి స్వయానా బావా బామ్మర్దులు. 1952 ఎన్నికల్లో తరిమెల నాగిరెడ్డి అనంతపురం జిల్లా నుంచి సొంత బావ నీలం సంజీవరెడ్డిపై గెలుపొందడం అప్పట్లో సంచలనంగా మారింది. 1955 ఎన్నికల్లో తరిమెల నాగిరెడ్డి బావ సంజీవరెడ్డి చేతిలో ఓడిపోయారు. 1957 పార్లమెంట్ ఎన్నికల్లో అనంతపురం నుంచి నాగిరెడ్డి పార్లమెంట్‌కు ఎన్నికయ్యారు. తరువాత 1962 ఎన్నికల్లో వీరిరువురూ వేర్వేరు అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి అసెంబ్లీకి పోటీ చేసి గెలిచారు. ఎక్కడైనా బావ గాని వంగతోటకాడ కాదన్నట్లు వీరి రాజకీయాలకు ఎవరూ బంధుత్వాన్ని ఆపాదించలేకపోయారు. విలువలు, పార్లమెంటరీ సంప్రదాయాలు పాటించారు.

1964 ఎన్నికల్లో యోధానుయోధులు గెలుపొందారు. కాంగ్రెస్ పక్షాన నీలం సంజీవరెడ్డి, కాసు బ్రహ్మానందరెడ్డి, అయ్యదేవర కాళేశ్వరరావు, కాకాని వెంకటరత్నం తదితరులు గెలుపొందగా.. కమ్యూనిస్టు పార్టీ పక్షాన పుచ్చలపల్లి సుందరయ్య, తరిమెల నాగిరెడ్డి, ఆరుట్ల కమలాదేవి, నల్లమల గిరిప్రసాద్, బొమ్మసాని ధర్మబిక్షం తదితర నేతలు, స్వతంత్ర పార్టీ పక్షాన గౌతు లచ్చన్న, ఇండిపెండెంట్‌గా వావిలాల గోపాలకృష్ణయ్య తదితరులు ఎన్నికయ్యారు.



- యు. రామకృష్ణ


సంపాదకీయం

దాహం..దాహం!

మండుటెండలు ముంచుకు రావడంతో రాష్ట్రం దాహంతో అంగలారుస్తోంది. ప్రధాన రిజర్వాయర్లలో నీటి నిల్వలు అడుగంటగా, చెరువులు వట్టిపోయాయి. భూగర్భజలాలు ఏటికేడాది పాతాళం వైపు పరుగులు తీస్తున్నాయి. దీంతో ప్రతి సంవత్సరం తాగునీటి కోసం ప్రజలు వెంపర్లాడక తప్పని స్థితి ఏర్పడుతోంది. అయితే, గత సంవత్సరాలతో పోలిస్తే ఈ ఏడాది పరిస్థితి మరింత తీవ్రంగా ఉంది. సార్వత్రిక ఎన్నికలు కూడా ఈ సమయంలోనే జరుగుతుండటంతో అధికార యంత్రాంగం దృష్టి అటువైపు కేంద్రీకృతమయ్యే అవకాశం ఉంది. మరోవైపు రానున్న రోజుల్లో ఎండలు, వడగాడ్పులు మరింత ఉధృతంగా ఉంటాయన్న హెచ్చరికలు వాతావరణ శాఖ నుండి అందుతున్నాయి. జూన్ నెలాఖరులోనో, జులైలోనో రుతుపవనాలు పలకరించేంత వరకు ఈ స్థాయిలోనో, మరింత ఎక్కువగానో ఎండలు మండనున్నాయి. అదే జరిగితే తాగునీటి కొరత రాష్ట్రంలో మరింత తీవ్రమయ్యే ప్రమాదం ఉంది. మార్చి నెల మధ్యలోనే రాష్ట్రంలో నీటి కొరత ప్రారంభమైంది. ఏప్రిల్ రెండవ వారానికే రాష్ట్రంలోని సగానికన్నా ఎక్కువ భాగంలోని ప్రజానీకం తాగునీటి కోసం తిప్పలు పడుతున్నారు. రాయలసీమలోని దాదాపుగా అన్ని జిల్లాలోనూ నీటి కొరత ఇప్పటికే తీవ్రస్థాయికి చేరింది. రాష్ట్రంలోని 679 మండలాలకుగాను దాదాపుగా 500 మండలాల్లో తాగునీటికి కటకట ఏర్పడింది. సుమారుగా 400 మండలాల్లో ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయాలని మార్చి నెలాఖరులోనే సంబంధిత జిల్లాల కలెక్టర్లు ప్రతిపాదించారు. వాటిలో అధిక భాగం ప్రతిపాదనలు కాగితాలకే పరిమితమైనాయని, వంద మండలాల్లో కూడా ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరాను ప్రారంభించలేదని సమాచారం!

పట్టణ ప్రాంతాల్లో పరిస్థితి మరింత ఘోరంగా ఉంది. రాష్ట్రంలోని 123 పట్టణ స్థానిక సంస్థల్లోని ఏడింటిలో మూడు రోజులకోసారి తాగునీటిని అందిస్తున్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సొంత జిల్లా కేంద్రమైన కడపతో పాటు పలమనేరు, పెనుగొండ, పొదిలి, హిందూపూర్, ఒంగోలు, పొదిలి పట్టణ స్థానిక సంస్థలు ఈ జాబితాలో ఉన్నాయి. వీటన్నింటిలో ట్యాంకర్ల ద్వారా కూడా నీటిని సరఫరా చేస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. మరో 35 మున్సిపాల్టీల్లో రెండు, మూడు రోజులకోసారి నీటిని సరఫరా చేస్తున్నారు. ఈ జాబితాలో ముఖ్యమంత్రి సొంత నియోజకవర్గ కేంద్రం పులివెందులతో పాటు, ప్రతిపక్షనేత చంద్రబాబు నాయుడి సొంత నియోజకవర్గ కేంద్రం కుప్పం కూడా ఉండటం గమనార్హం. పెద్ద సంఖ్యలో భక్తులు వెళ్లే తిరుపతిలో కూడా రెండు, మూడు రోజులకోసారి నీటిని విడుదల చేస్తున్నారు. మరో 52 పట్టణ పట్టణ స్థానిక సంస్థల్లో రోజుకు ఒక పూట ప్రస్తుతానికి నీటిని ఇస్తున్నారు. రాష్ట్రంలో ఉన్న నీటి నిల్వలను పరిశీలిస్తే ఈ మాత్రపు ఊరట కూడా ఎక్కువ రోజులు ఉండే పరిస్థితి లేదు. అధికారిక సమాచారం ప్రకారమే ఏప్రిల్ నెలాఖరు నాటికి దాదాపుగా 20, మే నెల రెండు, మూడు వారాలకి మరో 25 పట్టణ స్థానిక సంస్థల్లో నీటి నిల్వలు పూర్తిగా అడుగంటనున్నాయి. అంటే, రానున్న రోజుల్లో ఏ స్థాయిలో నీటి ఎద్దడి ఉంటుందో ఊహించుకోవచ్చు.

ప్రజల దైనందిన జీవితంలో అత్యంత కీలకమైన ఈ సమస్యను ముఖ్యమంత్రిగాని, ప్రతిపక్ష నేతగాని నామమాత్రంగా కూడా ప్రస్తావించకపోవడం గమనార్హం. అక్కడక్కడ నిలదీసిన వారికి ఆపద మొక్కులతో ముఖ్యమంత్రి సరిపెట్టారు. వేసవిలో నీటి కొరత ఈ ఏడాది కొత్తగా వచ్చిందేమి కాదు. పైగా డిసెంబర్ నెలలోనే వేసవి, వడగాడ్పుల తీవ్రత గురించి వాతావరణ శాఖ హెచ్చరించింది. అయినా, ప్రభుత్వ యంత్రాంగంలో నామమాత్రపు చలనం కూడా లేదు. మార్చి నెల వరకు ఈ అంశంపై పూర్తి స్థాయిలో సమీక్ష సమావేశాన్ని అధికార యంత్రాంగం నిర్వహించలేకపోయిందంటే ఏ స్థాయిలో నిర్లక్ష్యం నెలకొందో అర్థం చేసుకోవచ్చు. రెండు, మూడు రోజుల క్రితం సాగర్ రిజర్వాయర్ నుండి చెరువులకు వదలిన నీరు ఎంతకాలం ఆదుకుంటుందో చూడాలి. శ్రీశైలం, నాగార్జునసాగర్ లతో కలిపి రాష్ట్రంలో ఉన్న 108 రిజర్వాయర్లలో ప్రస్తుతం నామమాత్రపు నీటి నిల్వలే ఉన్నాయి. అధికార యంత్రాంగం ఇప్పటికైనా ఈ విషయంపై పూర్తిస్థాయిలో దృష్టి సారించాలి. వాతావరణ మార్పుల కారణంగా చోటుచేసుకుంటున్న పరిణామాలను గమనంలో ఉంచుకుని, కార్యాచరణ ప్రణాళికను రూపొందించి, అమలు చేయాలి.



ఇతర జాతులను అణచివేసే జాతి స్వేచ్ఛగా వుండగలుగుతుందా? వుండలేదు.

- లెనిన్

ఆనాడే హెచ్చరించిన పూలే

గత ఆదివారం బీహార్‌లో ప్రధాని నరేంద్ర మోడీ ఎన్నికల ప్రచారం చేస్తూ 'ఇండియా' బ్లాక్ సనాతనానికి వ్యతిరేకమని, తాము సనాతన ధర్మాన్ని పాటించే వారమని సెలవిచ్చారు. సనాతనమంటే శాశ్వతమని అర్థం. అనాదిగా వస్తుందని వ్యవహారిక అర్థం. మోడీ నిజంగానే సనాతన ధర్మాన్ని పాటించే వాడయితే ఢిల్లీ నుండి బీహారుకు పుష్పక విమానమెక్కి రావాలి. సనాతనం పేర ప్రజలను మోసపుచ్చడాన్నే సంస్కృతీకరణ అని చెప్పి 150 ఏళ్ల క్రితమే హెచ్చరించారు మహాత్మా జ్యోతిరావు పూలే. సంస్కృతీకరణ లేదా బ్రాహ్మణీకరణ అనే పదాలను ఆయన వాడారు. బ్రాహ్మణీకరణ అంటే బ్రాహ్మణ కులాన్ని ద్వేషిస్తున్నట్లుగా భావించే అవకాశముంది కనుక మనం సంస్కృతీకరణ అన్న మాటనే ఉపయోగిద్దాం. వైదిక మతంలోని చాతుర్వర్ణ వ్యవస్థలో బహుళ సంఖ్యాకులైన శూద్రులకు, అతి శూద్రులకు అన్ని హక్కులకు, అవకాశాలకు దూరం చేసింది. చదువుకు, సొంత ఆస్తికి మాత్రమే కాదు. చేసిన కష్టానికి ప్రతిఫలం అడిగే హక్కు కూడా శూద్రునికి ఇవ్వలేదు. ఈ భూమండలంలోని అన్ని ఆస్తులకు బ్రాహ్మణుడే యజమాని అని మనుస్మృతి చెప్తుంది. కనుక ఏ వస్తువునైనా ఎవరి కష్టాన్నైనా తీసుకొనే అధికారం బ్రాహ్మణుడికి ఉంటుంది. చాతుర్వర్ణాల్లోని మిగతా మూడు వర్ణాలకు సేవ చేయడానికే శూద్రుడ్ని బ్రహ్మ సృష్టించాడు కనుక అతను ఆకలితో చావకుండా వుండేందుకు అవసరమైన డబ్బునే కూలి కింద ఇవ్వాలి. మనుస్మృతి ఈ విషయం కూడా దాపరికం లేకుండా చెప్పింది.




ఎస్. వినయ కుమార్

నిజానికి మన దగ్గర శూద్రుల దేవుళ్లు లేరు. ఇళ్లలోకి వైదిక దేవుళ్లు చాలా ఆలస్యంగానే ప్రవేశించారు. ఆ పరిణామం కూడా సంస్కృతీకరణ ఉచ్చులో పడిపోవడం వల్ల ఏర్పడిందే. తమ కష్టంతో సంపదను సృష్టించే శూద్రులు ఈ రోజు గొప్ప చదువులు చదవవచ్చు. పెద్ద పెద్ద ఉద్యోగాలు చేయవచ్చు. పెద్ద పెద్ద పదవులను సమర్థతతో నిర్వహించవచ్చు. అయినప్పటికీ వారి సామాజిక స్పృహ శిశు ప్రాయంలోనే ఉంది. పురాణాల్లో, మనుస్మృతిలో తన స్థానం ఏమిటో గమనించలేని స్థితిలో శూద్రులు ఉండిపోవడానికి కారణం కూడా సంస్కృతీకరణపై వారికి పెరిగిన మోజే. తమకు ఆ శాస్త్రాలు చేసే నష్టాన్ని గమనించలేనంత స్థితిలోకి జారిపోవడమే దానికి కారణం. ఇదే విషయాన్ని వివరిస్తూ పూలే హెచ్చరిక చేశారు. బిజెపి దగ్గర ఉన్న ప్రధాన ఆయుధమిదే. శూద్రుల ఇళ్లల్లో కర్మకాండ, పుట్టుక, చావులకు బ్రాహ్మణులను పిలిచే వారు కాదు. ఇప్పుడు ఆ స్థితి కొంత వరకు మారింది. ఆ సందర్భాల్లో బ్రాహ్మణులను పిలిపించుకొంటే తమ సామాజిక హోదా పెరుగుతుందన్న భ్రమలో పడ్డారు. అంటే సంస్కృతీకరణ ఉచ్చులో పడటమే గదా?

పూలే దృక్పథం వేరు. ఆయన వేదాలు, పురాణాలు, మనుస్మృతి వంటి శాస్త్రాలన్నింటినీ తోసిపుచ్చారు. అవన్నీ బ్రాహ్మణులు తమ ఆధిపత్యం కోసం రాసుకున్నవేనన్నారు.

ప్రముఖ ఉర్దూ, హిందీ రచయిత మున్షీ ప్రేంచంద్ స్త్రీ స్వాతంత్ర్యంపై ఎంతటి మహత్తర రచనలు చేశారో... రైతులపై కూడా అంతటి మహత్తర రచనలు చేశారు. రైతును ఎన్ని విధాలుగా దోచుకుంటారో చూపెట్టారు. అలాంటి గొప్ప నవల "గోదాన్". రైతును భూస్వామితో పాటు, గ్రామ పెద్దలు ఆచారాలు, సాంప్రదాయాలు రకరకాలుగా దోచుకొంటాయి. మరణశయ్యకు చేరతాడు. రైతు నోట్లో గంగాజలం పోయమని రైతు భార్య బ్రాహ్మణుడిని అర్థిస్తుంది. ఇంట్లో మిగిలి ఉన్న రూపాయి బిళ్లను తెచ్చి ఇదే మేమిచ్చే గోదానంగా భావించమని ప్రాధేయపడ్తుంది. బ్రాహ్మణుడు మంత్రాలు చదువుతూ గంగాజలం పోసి రైతును నేరుగా స్వర్గం వెళ్లే సౌకర్యం కల్పిస్తాడు. రైతు భార్య దిక్కు లేనిది అవుతుంది. కమ్యూనిస్టు నాయకుడు ఇ.ఎం.ఎస్ నంబూద్రిపాద్...బెంగాలీ రచయిత శరత్‌చంద్రతో పోల్చుతూ ప్రేంచంద్ గొప్ప రచయిత అని చెప్తారు. ఎందుకంటే శరత్‌లో కన్పించని వర్గ దృక్పథం ప్రేంచంద్‌లో వుందంటారు. పూలు పండించే రైతు కుటుంబం నుండే వచ్చిన పూలే కూడా రైతు సమస్యలను వాటికి పరిష్కారాలపై అప్పటి బ్రిటిష్ ప్రభుత్వం దృష్టికి తెచ్చారు. రైతుల స్థితిగతులపై 'షేత్కారాంచ అసుడ్' (పేర్యగాని చెర్నాకోల) పుస్తకం రాశారు. రైతు గురించి తపన పడిన సంఘసంస్కర్త మనకు ఆ కాలంలో మరొకరు కన్పించరు.

ఆధునిక భారతంలోని సామాజిక సంస్కరణోద్యమాల్లో మొదట కనిపించేది బ్రహ్మ సమాజం. 1828లో బ్రహ్మ సమాజాన్ని స్థాపించారు. ఇది ప్రధానంగా బ్రాహ్మణుల్లోని దురాచారాలపై పోరాడింది. అనంతరం 1873లో జ్యోతిరావు



పూలే సత్యశోధక్ సమాజ్ నెలకొల్పారు. సత్యశోధక్‌తో శూద్రులను, అతి శూద్రులను చైతన్య పరచాలనే లక్ష్యంతో ఏర్పడిందది. ఆ కృషితో పురోగామి బ్రాహ్మణులు కూడా ఉన్నారు. ఈ సమాజ్ స్థాపించే ఆయనలో దేవుడి అస్తిత్వం పట్ల పూర్తి నమ్మకం లేదు. అందుకే తను నెలకొల్పిన సంస్థకు సత్య శోధక్ సమాజ్ అని పేరు పెట్టారు. ఆయన చేసిన రచనల్లో చాలా ప్రసిద్ధి పొందిన రచన 'గులాంగిరి'. ఆ పుస్తకం ముగింపులో ఆయన దేవుడి అస్తిత్వంపై సందేహం వ్యక్తం చేశారు. అయితే ఆయన ప్రత్యేకత ఏమిటంటే ఆ సందేహ నివృత్తిపై సమయం వెచ్చించలేదు. తన సమయాన్నంతా ఆయన శూద్రులు అతి శూద్రుల అభ్యున్నతి

సనాతనం పేర ప్రజలను మోసపుచ్చడాన్నే సంస్కృతీకరణ అని చెప్పి 150 ఏళ్ల క్రితమే హెచ్చరించారు మహాత్మా జ్యోతిరావు పూలే.

శూద్రులు, అతిశూద్రులు తమ ఇళ్లల్లో జరిగే శుభ అశుభ కార్యాలకు, బ్రాహ్మణ పురోహితులను రప్పించడమెందుకు? అర్థంగాని సంస్కృత మంత్రాలెందుకు? అని ప్రశ్నించేవారు. వైదిక మతంలోని ఆచారాలు, సాంప్రదాయాలు కష్టజీవులైన శూద్రులను దోచుకోవడానికేనని పూలే దృఢ అభిప్రాయం.

కోసం, హక్కుల కోసం పోరాడేందుకు వెచ్చించారు. భావజాల రంగంలోనే కాదు, బహుముఖ ప్రత్యక్ష పోరాటాలు చేశారు. బ్రాహ్మణ స్త్రీలు కూడా ఆయన దృష్టిలో శూద్రులే.

తెలుగు నేలలో గొప్ప సంస్కరణ ఉద్యమాన్ని నడిపిన కందుకూరి వీరేశలింగం 1905లో 'హితకారిణి సమాజం' స్థాపించారు. ఆ సమాజ స్థాపనకు ముందు నుండే నమ్మకాలపై పోరాడారు. వితంతు వివాహాలను ఒక ఉద్యమంగా జరిపారు. అయితే వీటి కోసం ఆయన శాస్త్ర ప్రమాణాలను వెతికారు. వితంతు వివాహన్ని ఏ శాస్త్రం నిషేధించిందో చెప్పాలని సవాలు చేశారు. కానీ పూలే దృక్పథం వేరు. ఆయన వేదాలు, పురాణాలు, మనుస్మృతి వంటి శాస్త్రాలన్నింటినీ తోసిపుచ్చారు. అవన్నీ బ్రాహ్మణులు తమ ఆధిపత్యం కోసం రాసుకున్నవేనన్నారు. బ్రాహ్మణ ఆధిపత్యాన్ని వ్యతిరేకించే ఆయనకు బ్రాహ్మణుల పట్ల ద్వేషం లేదు. వితంతు వివాహాలపై నిషేధం, వారికి జుట్టు గొరిగించడం వంటివి కేవలం బ్రాహ్మణ స్త్రీలకు సంబంధించినవి. శూద్రుల్లో ఆ ఆచారాలు ఎక్కడైనా కనబడితే సంస్కృతీకరణ ప్రభావమే. కాగా వితంతువులకు జుట్టు గొరగబోమంటూ క్షురకుల చేత సమ్మె చేయించిన చరిత్ర మనకు పూలే ఉద్యమంలో మాత్రమే కనిపిస్తుంది. వీరేశలింగం కంటే 40 ఏళ్ల ముందు పుట్టిన వాడు పూలే. కనుక ఆధునిక చరిత్రలో వితంతు వివాహాలకు ఆద్యుడుగా పూలేనే చెప్పుకోవాలి.

పూలే పూనా మునిసిపాలిటీకి కొంత కాలం ప్రభుత్వం నియమించిన చైర్మన్. అప్పటికి ఎన్నికలు అనేవి మన దేశంలో లేవు. బ్రిటిష్ పాలకులు ఇంపీరియళ్ల, లెజిస్లేటివ్ కౌన్సిల్‌కు అలాగే ప్రావెన్షియల్ కౌన్సిళ్లకు మొదటిసారి 1920లో పరిమిత ఓటర్లతో ఎన్నికలు జరిపారు. పెద్ద పెద్ద ఆస్తిపరులు, ఉన్నత విద్యావంతులు వగైరాలు మాత్రమే ఓటర్లు. పేరుకు లెజిస్లేటివ్ బాడీలే అయినా వాటి హోదా రచ్చబండలకు మించలేదు ఆనాడు. పూనా మునిసిపాలిటీలో శూద్రులను, అతి శూద్రులను కూడా సభ్యులుగా బ్రిటిష్ ప్రభుత్వం నియమించేది. మిలటరి నేపథ్యం వల్ల అతి శూద్రుల్లో కొద్దిపాటి డొక్క శుద్ధి ఉండేది. శూద్రులు వేలి ముద్రకే పరిమితం. చదువుకుంటే తప్ప శూద్రులకు సాధికారత రాదని పూలే భావించారు. మహిళలు బానిసలకు బానిసలన్న విషయం ఆయన అర్థం చేసుకున్నారు. కనుకే తన మొట్టమొదటి పాఠశాలను అతి శూద్ర బాలికల కోసం ఆరంభించారు.

దయానంద సరస్వతి 1875లో ఆర్య సమాజం స్థాపించారు. పూలే వల్ల వర్ణాశ్రమ ధర్మానికి కలగనున్న ప్రమాదాన్ని ఆయన సరిగ్గానే గ్రహించారు. కులం లేదు అంటూనే వర్ణాశ్రమ ధర్మాన్ని సురక్షితంగా కొనసాగించే ప్రయత్నం చేశారు. ఈ నాలుగు వర్ణాల్లో బ్రాహ్మణ వర్ణానిది అగ్రస్థానం అంటూ మనుస్మృతి చేసిన సూత్రీకరణపై ఆయన యుద్ధం ప్రకటించలేదు. గుణకర్మల చేత ఎవరైనా బ్రాహ్మణుడు కావచ్చని అతుకుబొతుకు లేని సిద్ధాంతం చెప్పారు. తద్వారా బ్రాహ్మణాధిక్యతను కాపాడారు. దళితులు, ఇతర వెనుకబడిన కులాల వారు కూడా ఒక దశలో ఆర్య సమాజం వైపు ఆకర్షితులయ్యారు. ఆర్య సమాజం కుల రహిత సమాజం కోసం పోరాడుతుందని భావించారు. మహాత్మా గాంధీ కూడా కులంతో నిమిత్తం లేని హిందూ మతం కావాలన్నాడు తప్ప కుల వ్యవస్థను సంరక్షించే శాస్త్రాలను ఖండించలేదు. గుడుల్లో బ్రాహ్మణేతరులను అర్చకులుగా నియమించాలన్న డిమాండ్ వచ్చినప్పుడు... గాంధీజీ దేవాలయాల్లో హరిజనుల ప్రవేశానికి డిమాండ్ చేశారు తప్ప బ్రాహ్మణేతరులను అర్చకులుగా నియమించాలని చెప్పలేదు గదా? అని పండితులు ప్రశ్నించారు.

దండల పెళ్లిళ్లకు కూడా పూలే ఆద్యుడిగా కనిపిస్తాడు. తన దత్తత కుమారుడు డాక్టర్ యశ్వంత్‌కు దండల పెళ్లి చేశారు. శూద్రులు, అతిశూద్రులు తమ ఇళ్లల్లో జరిగే శుభ అశుభ కార్యాలకు, బ్రాహ్మణ పురోహితులను రప్పించడమెందుకు? అర్థం గాని సంస్కృత మంత్రాలెందుకు? అని ప్రశ్నించేవారు. వైదిక మతంలోని ఆచారాలు, సాంప్రదాయాలు కష్టజీవులైన శూద్రులను దోచుకోవడానికేనని పూలే దృఢ అభిప్రాయం. ఏప్రిల్ 11న పూలే జయంతి. ఈ దశలో సనాతన ధర్మ సిద్ధాంతం పేరుతో కష్టజీవులను ఏమార్చే రాజకీయాలను ఓడించి, దూరం పెట్టడమే పూలేకు సరైన నివాళి అవుతుంది. మహాత్మా పూలే హెచ్చరికను ఇప్పుడైనా అర్థం చేసుకొందాం.

/ వ్యాసకర్త 'ప్రజాశక్తి' పూర్వ సంపాదకులు /

అభిప్రాయం

సైనిక్ స్కూళ్ల ప్రైవేటీకరణ, కాషాయీకరణ

రక్షణ రంగంలో చేరుతున్న వారిలో చాలావరకు సైనిక పాఠశాలల నుండి వస్తున్నారని గమనించిన బిజెపి వాటిపై దృష్టి సారించింది.

విద్యను గరపుతూనే క్రమశిక్షణతో కూడిన మెరికల్లాంటి యువతను దేశానికి అందించేందుకు స్థాపించబడినవే సైనిక పాఠశాలలు. వీటిని మినిస్ట్రీ ఆఫ్ డిఫెన్స్ ఆధ్వర్యంలో సైనిక స్కూల్స్ సొసైటీ ద్వారా నిర్వహిస్తారు. ఇక్కడ విద్యార్థులు కులమతాలకు అతీతంగా, జాతి ప్రాంతాలతో నిమిత్తం లేకుండా అకుంఠిత దేశభక్తితో విద్యాభ్యాసం చేస్తున్నారు. ఇక్కడ ఎటువంటి విద్వేషాలకు, వైషమ్యాలకు తావుండదు. అటువంటి సైనిక పాఠశాలలను నూతన విద్యా విధానం పేరుతో బిజెపి ప్రభుత్వం ప్రైవేటీకరణ, కాషాయీకరణ చేయడానికి పూనుకుంది.

2022 వరకు 30 సైనిక పాఠశాలల్లో ఆరవ తరగతిలో 3000 మంది ప్రవేశం పొందేవారు. ప్రభుత్వ ఆధీనంలో వున్న ఈ విద్యా సంస్థలను 2022 నుండి పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్‌షిప్ (పిపిపి) కిందకు మార్చింది. ప్రతీ సంవత్సరం 5000 మంది విద్యార్థులు చేరేలా దేశవ్యాప్తంగా 100 పాఠశాలలను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించింది. 'కేంద్ర ప్రభుత్వం నిధులు ఇస్తుంది. సైనిక పాఠశాలలను నడుపుకో'మంటూ ప్రైవేట్ వారికి తలుపులు బార్లా తెరిచింది. ఎన్‌ఆర్‌సి, సిఎఎ లో చేసిన విధంగానే ఇక్కడ కూడా హిందూ స్వచ్ఛంద సంస్థలకు తప్పితే క్రిస్టియన్, ముస్లిం సంస్థలకు అనుమతులు ఇవ్వబోమని చెప్పడం లౌకికతత్వానికి విరుద్ధం. సైనిక పాఠశాలలను స్వచ్ఛంద సంస్థలకు అప్పగిస్తూ మతం రంగు పులమడం కాషాయ పైత్యానికి పరాకాష్ట. అరుణాచల్ ప్రదేశ్‌లోని తవాంగ్ పబ్లిక్ స్కూల్, మహారాష్ట్ర లోని విఠల్‌రావ్ విఖే పాటిల్ స్కూల్, రాజస్థాన్ లోని భారతీయ పబ్లిక్, సాంగ్లీ లోని ఎస్.కె ఇంటర్నేషనల్ స్కూల్, మధ్యప్రదేశ్ లోని సైనా ఇంటర్నేషనల్ స్కూల్ వంటివన్నీ కొత్తగా సైనిక్ స్కూళ్ల ఏర్పాటుకు అనుమతులు పొందిన పాఠశాలలు. ఇవన్నీ బిజెపి నాయకులు, ఆర్‌ఎస్‌ఎస్ వ్యక్తులు నడుపుతున్నవే. గత విద్యా సంవత్సరం అనుమతులు పొందిన 40 పాఠశాలల్లో 62 శాతం ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలు, బిజెపి నాయకులు, వారి మిత్రులు వున్నారు. దేశభక్తి ముసుగులో దేశ సంపదను దోచిపెడుతున్న మోడీ ఆప్తమిత్రుడు అదానీకి చెందిన అదానీ వరల్డ్ స్కూల్ కూడా ఇందులో చోటు దక్కించుకుంది. నెల్లూరు లోని కృష్ణపట్నం పోర్టును అప్పనంగా ఇవ్వడంతో పాటు తన స్కూల్‌ని సైనిక్ స్కూల్‌గా మార్చడానికి అనుమతించిందంటే ఎంత ప్రేమ లేకపోతే అలా చేస్తుంది? మన రాష్ట్రంలో దీనితో పాటు కడప జిల్లాలోని ప్రొద్దుటూరులో ఉన్న పూజా ఇంటర్నేషనల్ స్కూల్‌కు అనుమతి లభించింది. 2022 జూన్‌లో దీనిని చిన్నజీయర్ స్వామి ప్రారంభించారు. సంవత్సరం తరువాత దాని నిర్వాహకుడు రాజారెడ్డి అదే స్కూల్‌లో అనుమానస్పదంగా మృతి చెందాడు. బాబ్రీ మసీదును కూల్చి రామమందిరం నిర్మించడానికి జరిగిన సుదీర్ఘ ప్రక్రియలో కీలక పాత్ర పోషించిన రితంబర ఏకంగా రెండు పాఠశాలలకు అనుమతులు పొందారు. ఇటువంటి వారు విద్యాసంస్థలను, అందులోనూ సైనిక



ప్రభుత్వ ఆధీనంలో వున్న ఈ విద్యా సంస్థలను 2022 నుండి పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్‌షిప్ (పిపిపి) కిందకు మార్చింది. 'కేంద్ర ప్రభుత్వం నిధులు ఇస్తుంది. సైనిక పాఠశాలలను నడుపుకో'మంటూ ప్రైవేట్ వారికి తలుపులు బార్లా తెరిచింది. ఎన్‌ఆర్‌సి, సిఎఎ లో చేసిన విధంగానే ఇక్కడ కూడా హిందూ స్వచ్ఛంద సంస్థలకు తప్పితే క్రిస్టియన్, ముస్లిం సంస్థలకు అనుమతులు ఇవ్వబోమని చెప్పడం లౌకికతత్వానికి విరుద్ధం. సైనిక పాఠశాలలను స్వచ్ఛంద సంస్థలకు అప్పగిస్తూ మతం రంగు పులమడం కాషాయ పైత్యానికి పరాకాష్ట.

పాఠశాలలను నడపడం వలన విద్యార్థుల్లో మత సామరస్యానికి బదులు మత విద్వేషం, జాతి ఐక్యతకు బదులు జాత్యహంకారం నింపబడుతుంది. ఇది దేశ రక్షణను అభద్రతా భావంలోకి నెడుతుందనడంలో ఎటువంటి సందేహం లేదు. హిందూ అతివాద నేత బి.ఎస్ మూంజ్ 1937లో నాసిక్‌లో స్థాపించిన భోంస్లా మిలటరీ స్కూలే అందుకు ప్రత్యక్ష సాక్ష్యం. ఇది ప్రస్తుతం సెంట్రల్ హిందూ మిలటరీ ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యంలో నడుస్తున్నది. 2006 నాందేడ్, 2008 మాలెగావ్‌లో జరిగిన వరుస బాంబు పేలుళ్ల కేసులో నిందితులుగా ఉన్న వారు భోంస్లా మిలటరీ స్కూల్‌లో శిక్షణ పొందినవారేనని మహారాష్ట్ర ఉగ్రవాద నిరోధక శాఖ ఆరోపించింది. భవిష్యత్తులో ఈ సైనిక పాఠశాలలు దేశభక్తి కలిగిన యువతరానికి బదులు మతోన్మాదంతో బుసలు కొట్టే వారిని దేశానికి అందిస్తాయి. వీరిని హిందూత్వ భావజాలానికి వ్యతిరేకంగా ఉన్న వారిపైకి రెచ్చగొడతాయి. అందుకే రక్షణ రంగాన్ని కూడా రెగ్యులర్‌గా కాకుండా కాంట్రాక్ట్ పద్ధతిలో భర్తీ చేస్తూ నాలుగు సంవత్సరాలకే పరిమితం చేస్తున్నది.

బిజెపి దేశంలో విధ్వంసానికి పూనుకొంటున్నది. మనుస్మృతిని అమలు చేసేందుకుగాను నియంతృత్వ పోకడలు పోతున్నది. మొదట విద్య ద్వారా హిందూత్వ భావజాలాన్ని చిన్నారుల మెదళ్లలోకి ఎక్కించాలని చూస్తున్నది. మతాలకు అతీతంగా లౌకిక రాజ్యాన్ని స్థాపించడానికిగాను...మనందరం ఈ కాషాయీకరణను ముక్త కంఠంతో ఎదిరిద్దాం.

- డి.రాము,
ఎస్.ఎఫ్.ఐ విజయనగరం జిల్లా అధ్యక్షులు,
సెల్ : 9705545164

కవిత్వం

విధిగా ఓటెయ్యండి

నేను పేరెన్నికగల
ప్రపంచ ప్రతిష్టాత్మక
భారత ప్రజాస్వామ్యాన్ని!
వినమ్రంగా విధేయంగా
వినయంగా అభ్యర్థిస్తున్నా
రాజ్యాంగబద్ధంగా పొందిన
రాజకీయ ఓటు హక్కును
పౌరులందరూ పోలింగ్ నాడు
విధిగా వినియోగించమని
మరింత ప్రోత్సహించమని!
రాజకీయ బహిరంగ సభలకు
నాయకుల ప్రచార పర్వానికి
జనమే జనమని వర్ణిస్తారు
జనసందోహమని అభివర్ణిస్తారు
జన సముద్రమని ఉప్పొంగుతారు
తీరా పోలింగ్ రోజున పలుచనౌతారు!
నిర్లక్ష్యం నీడన సేదదీరడం సరికాదు
ఉప్పెనలా గడపదాటి విరివిగా రండి
ప్రజాభీష్ట ప్రభుత్వ నిర్మాణ ప్రక్రియలో
సుపరిపాలన నిర్మితిలో భాగమై
నన్ను ప్రగతి పథంలో నడపండి!
నేను ప్రజ్వలంగా వికసించాలంటే
మూలం ఓటు హక్కు వినియోగం.
ఓటు వెయ్యండి ! ఓటు వేయించండి!
నన్ను మీ ఓటుతో దీవించండి !!

- డా.సి.ఎల్. చెన్నారెడ్డి,
పౌరశాస్త్ర అధ్యాపకులు,
సెల్: 9885791661

సందర్భం

ఉద్యమమే ఊపిరిగా...



ఏప్రిల్ 14న శ్రీకాకుళం జిల్లా మామిడిపల్లిలో పైలా 14వ వర్ధంతి సభ

కమ్యూనిస్టు విలువలకూ, త్యాగానికీ, ఆదర్శాలకూ, నిబద్ధతకూ నిలువెత్తు నిదర్శనం కామ్రేడ్ పైలా వాసుదేవరావు. విప్లవోద్యమమే ఊపిరిగా శ్వాసించి, జీవితమంతా పీడిత ప్రజల విముక్తి కోసమే పరితపించారు. 78 ఏళ్ళ జీవన గమనంలో జనమే తప్ప వ్యక్తిగతం లేని అలుపెరుగని అజ్ఞాత విప్లవ సూరీడాయన. శ్రీకాకుళం రైతాంగ ఉద్యమంపై ప్రభుత్వ క్రూర నిర్బంధానికీ, ఎన్‌కౌంటర్ హత్యలకు, అణచివేతకు గురైనా, గుండె నిబ్బరంతో ఎర్ర జెండాను నిలబెట్టిన ధీశాలి.

కామ్రేడ్ పైలా వాసుదేవరావు 2010 ఏప్రిల్ 11వ తేదీన తీవ్రమైన క్యాన్సర్ వ్యాధితో మరణించారు. మరణించే నాటికి ఆయన వయస్సు 78 సంవత్సరాలు. మాష్టారుగా, ప్రసాదన్నగా ప్రజలు ప్రేమగా పిలుచుకునే కామ్రేడ్ పైలా వాసుదేవరావు 1932 ఆగష్టు 11న శ్రీకాకుళం జిల్లా వజ్రపు కొత్తూరు మండలం రిట్టపాడులో జన్మించారు. విద్యార్థి దశలోనే కమ్యూనిస్టు రాజకీయాలవైపు ఆకర్షితులయ్యారు. 1953లో కమ్యూనిస్టు పార్టీ సభ్యత్వం తీసుకున్నప్పటి నుంచి తుదిశ్వాస వీడే వరకు ఐదున్నర దశాబ్దాలకు పైబడిన విప్లవోద్యమ జీవితంలో సొంత ఆస్తి లేని వ్యక్తి పైలా. ప్రజలే తన ఆస్తి తప్ప వ్యక్తిగత జీవితమన్నదే ఎరుగరు. తనకు వారసత్వంగా వచ్చిన కాస్త భూమిని, సొంత ఇంటిని అమ్మి నాటి శ్రీకాకుళం పోరాట ఉద్యమ కేంద్రం ఉద్దానంలోని పలాసలో అమర వీరుల స్మారకంగా పార్టీ కార్యాలయాన్ని నిర్మించిన నిస్వార్థ కమ్యూనిస్టు ఆయన.

ఆయన జీవితం వడ్డించిన విస్తరి కాదు. శ్రీకాకుళ పోరాట ఉద్యమ నాయకుడిగా, దళ జీవితం గడుపుతున్నప్పుడు 1970లో, దళ సభ్యురాలు కామ్రేడ్ చంద్రమ్మను వివాహం చేసుకున్నారు. ఉద్యమ క్రమంలోనే తమకు పుట్టిన బిడ్డను సైతం తమ విప్లవ సహచరుడు అత్తలూరి మల్లికార్జునరావు కుటుంబానికి ఇచ్చేసి రక్తసంబంధం కంటే వర్గ సంబంధం గొప్పదని చాటిచెప్పారు పైలా వాసుదేవరావు, చంద్రక్క. ఆ దంపతులు ఎమర్జెన్సీ టైమ్‌లో అరెస్టయ్యి 12 ఏళ్ళ సుదీర్ఘకాలం జైలు జీవితాన్ని అనుభవించారు.

తను నమ్మిన విప్లవ రాజకీయాల పట్ల దృఢమైన విశ్వాసం, చిత్తశుద్ధి, ఆచరణ కలిగిన వ్యక్తి. భారత దేశంలో విప్లవం విజయవంతం కావాలంటే, సారూప్యత కలిగిన విప్లవ సంస్థలు, పార్టీలన్నీ ఐక్యం కావాలని బలంగా ఆకాంక్షించిన వారు పైలా మాష్టారు. క్యాన్సర్ మహమ్మారితో పోరాడుతూ, చివరి శ్వాస వరకు విప్లవాన్నే స్వప్నించిన ధీరుడాయన.

- చిట్టిపాటి వెంకటేశ్వర్లు,
రాష్ట్ర కార్యదర్శి సిపిఐ(ఎం.ఎల్) న్యూడెమొక్రసీ, సెల్ : 9989737776

జనవాక్యం

చెట్లు నరికితే ఎలా...

'పర్యావరణాన్ని కాపాడండి, లేకపోతే మానవ జాతికి చాలా ప్రమాదం' అని ప్రపంచ వ్యాప్తంగా పర్యావరణ పరిరక్షణ సంస్థలు ఘోషిస్తున్నాయి. చెట్లు కూడా పర్యావరణంలో భాగమే! మరి మన ముఖ్యమంత్రి గారు ఎటుపోయినా అక్కడ చెట్లు నరుకుతున్నారు. వందల సంవత్సరాల నాటి వృక్షాలను కూడా అమాంతం నరికేస్తున్నారు. ఇంటి ముందు ఏదైనా చెట్టు వుంటే, అడ్డమొస్తుందని కొట్టెయ్యాలనుకుంటే 'మా అనుమతి లేకుండా ఎలా కొడతావ్?' అని మున్సిపాలిటీవాళ్ళు తగులుకుంటారు. మరి ఇక్కడ ఎలాంటి అనుమతులు అవసరం లేదా? పర్యావరణాన్ని హరిస్తూ చెట్లు నరుకుతుంటే పర్యావరణ పరిరక్షణ సంస్థ ఏమి చేస్తున్నది? 'ధర్మో రక్షతి రక్షిత:' అంటే ధర్మాన్ని మనం రక్షిస్తే అది తిరిగి మనలను రక్షిస్తుంది. కొన్ని చోట్ల తాటికాయంత అక్షరాలతో దర్శనమిస్తుంటాయి. అలాగే చెట్లను రక్షిస్తుంటే అవి మనకి కావలసిన పర్యావరణాన్ని ఇస్తాయి. మనం పీల్చుకునే ఆక్సిజన్ చెట్ల నుండి లభిస్తుంది. చెట్లు కార్బన్ డయాక్సైడ్ పీల్చుకొని ఆక్సిజన్ విడుదల చేస్తాయని ఒకటో తరగతి పిల్లోడికి కూడా తెలుసు. పైగా ప్రభుత్వ స్థలాలలోని చెట్లు కొట్టాలంటే ప్రభుత్వ అనుమతి కావాలి. మరి ముఖ్యమంత్రి టూర్ చేసేటప్పుడు కొట్టే చెట్లకు ఎవరు అనుమతించారు? 2017లో యమునానది సమీపంలోని వృక్ష సంపదను, జల సంపదను నాశనం చేసినందుకు రవిశంకర్‌కు పర్యావరణ పరిరక్షణ సంస్థవారు వంద కోట్ల రూపాయల జరిమానా విధించారు. ఆయన కట్టాడా? లేదా? అన్నది తర్వాతి విషయం. ఇపుడు రాష్ట్రంలో చెట్లు నరికేస్తున్న ముఖ్యమంత్రికి కూడా లెక్క కట్టి జరిమానా విధించాలి. చట్టం దృష్టిలో అందరూ సమానులే కాబట్టి...పర్యావరణ పరిరక్షణ సంస్థ వారు తక్షణమే చట్టం అందరికీ ఒకటే అని నిరూపించాలి.

- నార్నె

ఇదేనా వికసిత భారత్?



- పోషకాహార లోపంతో చిన్నారుల కుంగుబాటు
- మహిళలు, పిల్లల్లో పెరుగుతున్న రక్తహీనత
- ఆకలితో అల్లాడుతున్న శిశువులు
- ఆహార సబ్సిడీల్లో కోత
- మోడీ పాలనా వైఫల్యాలను ఎండగట్టిన 'రిపోర్ట్ కార్డ్'

న్యూఢిల్లీ : దేశంలోని 81 కోట్ల మంది పేదలకు ఉచిత రేషన్ అందజేయడం ప్రపంచంలోనే అత్యంత వేగవంతంగా అభివృద్ధి చెందుతున్న భారత ఆర్థిక వ్యవస్థకు గౌరవప్రదమా లేక మాయని మచ్చా? 2023వ సంవత్సరపు అంతర్జాతీయ ఆకలి సూచీలో భారత్ 111వ స్థానంలో (మొత్తం 125 దేశాలలో) ఎందుకు ఉంది? దేశంలోని 32 శాతం మంది చిన్నారులు ఎందుకు బరువు పెరగడం లేదు? అంటూ కేంద్ర ప్రభుత్వ వైఫల్యాలను ఫ్యాన్ ఇండియా (ఫైనాన్షియల్ అకౌంటబిలిటీ నెట్‌వర్క్ ఇండియా) ఎండగట్టింది. పౌర సమాజ సంస్థలు, సంఘాలు, ప్రజా ఉద్యమాలు, పౌరులతో కూడిన ఈ సంస్థ బుధవారం నాడిక్కడ ఈ మేరకు ఒక 'రిపోర్ట్ కార్డు'ను విడుదల చేసింది. 'ఆహార భద్రత, పౌష్టికాహార రిపోర్ట్ కార్డు (2014-2024)'ను విశ్లేషించిన వారికెవరికైనా ఈ ప్రశ్నలు ఉదయించక మానవని పేర్కొంది. గత పది సంవత్సరాల పాలనలో నరేంద్ర మోడీ నేతృత్వంలోని బిజెపి ప్రభుత్వాలు ఇచ్చిన హామీలు, చెప్పుకున్న గొప్పలను ఈ రిపోర్టులో ప్రస్తావించారు.

ప్రభుత్వ పత్రాలు, ప్రకటనలను పరిశీలించిన తర్వాతే రిపోర్టు కార్డును తయారు చేశారు. 2014 ఎన్నికల సమయంలో బిజెపి విడుదల చేసిన మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీలను ఇందులో ఉదహరించారు. పోషకాహార లోపంతో బాధపడుతున్న చిన్నారులకు సంబంధించిన సమస్యలను పరిష్కరిస్తామంటూ అందులో బిజెపి హామీలు గుప్పించింది. కానీ పది సంవత్సరాల మోడీ పాలనలో మనకు కన్పిస్తున్న వాస్తవాలేమిటి?

పోషకాహార లోపం...రక్తహీనత

జాతీయ కుటుంబ ఆరోగ్య సంస్థ (ఎన్‌హెచ్‌ఎఫ్‌ఎస్) అందజేసిన తాజా నివేదిక ప్రకారం మన దేశంలో ఐదు సంవత్సరాల కంటే తక్కువ వయసున్న చిన్నారుల్లో 36 శాతం మందిలో వయసుకు తగిన విధంగా ఎదుగుదల లేదు. పోషకాహార లోపమే దీనికి కారణమని నివేదిక స్పష్టం చేసింది. ఆ వయసున్న పిల్లల్లో మరో 32 శాతం మందికి తగినంత బరువు లేదు. 2018లో కేంద్రం 'అనీమియా ముక్త్ భారత్' అనే కార్యక్రమాన్ని చేపట్టింది. పథకాలు కోటలు దాటుతున్నాయి. కానీ, ఆచరణ గడప దాటడం లేదు. అందుకే ఇప్పటికీ మహిళల్లో రక్తహీనత సమస్య అలాగే కొనసాగుతోంది. 2015-16లో 15-49 సంవత్సరాల మధ్య వయసున్న మహిళల్లో 53 శాతం మంది రక్తహీనతతో బాధపడగా 2019-20లో అది 57.2 శాతానికి పెరిగింది.

వాస్తవానికి 67 శాతం మంది చిన్నారుల్లో ఏదో ఒక విధమైన రక్తహీనత (హిమోగ్లోబిన్ స్థాయి 11 కంటే తక్కువ) కన్పిస్తోంది. మోడీ హయాంలో 2015-16, 2019-21 మధ్యకాలంలో 6-59 నెలల మధ్య వయస్సులైన చిన్నారుల్లో రక్తహీనత 59 శాతం నుండి 67 శాతానికి పెరిగింది. మోడీ స్వరాష్ట్రమైన గుజరాత్‌ను 2014 ఎన్నికల ప్రచారంలో 'మోడల్ రాష్ట్రం'గా పొగిడేవారు. అయితే ఆ రాష్ట్రంలో 6-59 నెలల మధ్య వయస్సున్న చిన్నారుల్లో రక్తహీనత అత్యధికంగా 80 శాతం ఉండడం గమనార్హం. గుజరాత్‌లోని నర్మద (93.2 శాతం), పంచమహల్ (91 శాతం), ఆరావళి (89.5 శాతం) జిల్లాల్లో బాలల్లో రక్తహీనత అధికంగా ఉన్నదని ఎన్‌ఎఫ్‌హెచ్‌ఎస్-5 నివేదిక స్పష్టం చేసింది.

శిశువులకు అందని ఆహారం

పట్టణాలు, గ్రామాల్లో నివసిస్తున్న పేదలకు...ముఖ్యంగా ఎస్సీలు, ఎస్టీలు వంటి అట్టడుగు వర్గాల వారికి ఆహార భద్రత అనేది అందని ద్రాక్షగానే మిగిలిపోతోంది. ఎస్సీలు, ఎస్టీల్లో కుంగుబాటుతనం 40 శాతం వరకూ ఉండగా ఇతర సామాజిక తరగతుల్లో ముఖ్యంగా హిందువులకు చెందిన చిన్నారుల్లో అది 30 శాతంగా ఉందని ఫ్యాన్-ఇండియా రిపోర్టుకార్డు వివరించింది. 'గడచిన 24 గంటల కాలంలో ఏ విధమైన ఆహారం లభించని' 6-23 నెలల మధ్య వయసున్న పిల్లలు మన దేశంలో అధికంగానే ఉన్నారని, ఈ విషయంలో ప్రపంచంలో భారత్ మూడో స్థానంలో ఉన్నదని నివేదిక కార్డు తెలిపింది. ఇలాంటి పరిస్థితుల్లో తల్లులు, పిల్లలకు అందజేస్తున్న పోషకాహారాన్ని పెంచడానికి ఉద్దేశించిన పథకాలకు కేంద్రం నిధుల కేటాయింపు పెంచవచ్చు కదా? అసలు ప్రభుత్వం పెడుతున్న ఖర్చులో వాస్తవాలు ఏమిటి?

మధ్యాహ్న భోజనంలో గుడ్డేది?

మధ్యాహ్న భోజన పథకాన్నే తీసుకుందాం. ఇప్పుడు దీనిని పిం-పోషణ్ అని పిలుస్తున్నారు. దీనికి 2013-14లో 0.79 శాతం నిధులు కేటాయిస్తే 2024-25లో విదిల్చింది 0.23 శాతం మాత్రమే. దారుణమైన విషయమేమంటే అభం శుభం తెలియని చిన్నారులకు అందించే ఆహారాన్ని కూడా కాషాయీకరణ చేస్తున్నారు. మధ్యాహ్న భోజనంలో వారికి పోషక విలువలున్న కోడిగుడ్లు ఇవ్వడం లేదు. ఎన్‌హెచ్‌ఎఫ్‌ఎస్-4, ఎన్‌హెచ్‌ఎఫ్‌ఎస్-5 నివేదికల మధ్య కాలంలో 21 రాష్ట్రాల పిల్లల్లో కుంగుబాటుతనం పెరిగింది. ఇక ప్రధానమంత్రి మాతృవందన యోజన పథకాన్ని చూద్దాం. ఈ పథకంలో లబ్దిదారుల సంఖ్య 2019-20లో 96 లక్షలు ఉండగా 2021-22 నాటికి 61 లక్షలకు పడిపోయింది. అదీకాక ఈ పథకంలో చేరిన మహిళలకు జాతీయ ఆహార భద్రతా చట్టం కింద రూ.6,000 అందించాల్సి ఉండగా రూ.5,000 మాత్రమే ఇస్తున్నారు.

అంగన్‌వాడీలపై పని ఒత్తిడి

పిల్లలకు పోషకాహారం సరిగా అందుతోందా, వారు ఆరోగ్యంగా ఉన్నారా అనే విషయాలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ, పర్యవేక్షించే అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లపై పని ఒత్తిడి పెరిగిపోతోంది. ఖాళీలను భర్తీ చేయడంలో ప్రభుత్వాలు ఉదాశీనంగా వ్యవహరిస్తున్నాయి. పనిచేస్తున్న వారికి సైతం గౌరవవేతనం, ఇతర ప్రయోజనాలు అరకొరగానే ఉంటున్నాయి. దేశంలో 70,444 అంగన్‌వాడీ వర్కర్లు, 1,23,287 హెల్పర్ల పోస్టులు ఖాళీగా ఉన్నాయని ప్రభుత్వమే చెబుతోంది.

ఆహార సబ్సిడీలకూ అంతంతే

ప్రజా పంపిణీ వ్యవస్థ కింద ఆహార సబ్సిడీలకు జరుపుతున్న బడ్జెట్ కేటాయింపులు నానాటికీ తగ్గిపోతున్నాయి. 2023-24లో రూ.2.12 లక్షల కోట్లకు అంచనాలను సవరించగా 2024-25లో కేటాయించింది రూ.2.05 లక్షల కోట్లు మాత్రమే. బడ్జెట్‌లో ఆహార సబ్సిడీ కేటాయింపుల్లో మోడీ ప్రభుత్వం గత పదేళ్లుగా ఎడాపెడా కోతలు విధించింది. 2014-15 బడ్జెట్‌లో 6.4 శాతం కేటాయించగా 2024-25లో 4.3 శాతం మాత్రమే కేటాయించారు. ప్రధానమంత్రి గరీబ్ కల్యాణ్ అన్న యోజన పథకం కింద దేశంలోని పేదలకు ఐదు కిలోల ఆహారధాన్యాలను ఉచితంగా అందజేస్తామని జనవరిలో ప్రభుత్వం గొప్పగా చెప్పుకుంది. దీనిని ఓ చారిత్రక నిర్ణయంగా అభివర్ణించింది. దేశంలో ఆహార, పోషకాహార భద్రతను పటిష్టవంతం చేసేందుకు ప్రధాని కట్టుబడి ఉన్నారని చెప్పడానికి ఇదో ఉదాహరణ అని కొనియాడింది. అయితే ప్రభుత్వం వద్ద ఉన్న సమాచారం, అది చేసిన కేటాయింపులు చూస్తుంటే కథ వేరేలా ఉన్నదని అర్థమవుతుంది. దేశ భవిష్యత్తుకు బాటలు వేయాల్సిన చిన్నారులు నీరసంతో, నిస్సత్తువగా, పేలగా, కుంగుబాటుతనంతో కన్పిస్తుంటే భారత్ వికసిస్తుందని ఎలా అనుకోగలం?



ఎన్నికల ప్రచారంలో బిజెపి అభ్యర్థి విపరీత చర్య

కోల్‌కతా: లోక్‌సభ ఎన్నికల ప్రచారం సందర్భంగా పశ్చిమ బెంగాల్‌లో బిజెపి అభ్యర్థి ఒకరు వికృత చేష్టకు పాల్పడ్డాడు. ప్రచార సమయంలో ఒక యువతి బుగ్గపై ఆయన ముద్దు పెట్టారు. ఉత్తర మాల్దా లోక్‌సభ స్థానం నుండి బిజెపి తరపున పోటీ చేస్తున్న ఖగేన్ ముర్మూ శ్రీహిపూర్ గ్రామంలో ఇంటింటి ప్రచారానికి వెళ్లినప్పుడు ఈ ఘటన చోటుచేసుకుంది. యువతిని పట్టుకుని ముద్దు పెట్టిన దృశ్యాలు నెట్టింట వైరల్‌గా మారాయి. ముర్మూపైనా తీవ్ర స్థాయిలో విమర్శలు వస్తున్నాయి. 'మహిళా రెజ్లర్లను లైంగికంగా వేధించే ఎంపీలు.. బెంగాలీ మహిళలపై అసభ్యకర పాటలు రాసే నేతలు.. ఇలాంటి జాలాయిలకు కొదవలేదు. మహిళలకు 'మోడీ పరివార్' ఇస్తున్న గౌరవం ఇది.

ఢిల్లీ సంక్షేమ మంత్రి రాజీనామా

న్యూఢిల్లీ : ఢిల్లీ సంక్షేమశాఖ మంత్రి రాజ్‌కుమార్ ఆనంద్ బుధవారం తన పదవికీ రాజీనామా చేశారు. కేబినెట్, పార్టీ పదవులను వదులుకున్నారు. రాజీనామా సందర్భంగా ఆప్‌పై అవినీతి ఆరోపణలు చేశారు. 'ప్రజలకు సేవ చేసేందుకు, అవినీతిపై పోరాడాలన్న బలమైన సంకల్పాన్ని చూసి ఆప్‌లో చేరాను. కానీ ఈరోజు ఆ పార్టీనే అవినీతికి అడ్డాగా మారిపోయింది. అందుకే దీనిని వీడాలని నిర్ణయించుకున్నాను" అని రాజ్‌కుమార్ తెలిపారు. అలాగే ఆప్‌లో నాయకత్వ పదవులకు నియామకాల విషయంలో వివక్ష ఉందని ఆరోపించారు. రాజ్‌కుమార్ పటేల్ నగర్ నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. కేజ్రీవాల్ అరెస్టు తర్వాత ఒక మంత్రి రాజీనామా చేయడం ఇదే తొలిసారి.

బిజెపి భయంతోనే.. : ఆప్

మంత్రి రాజ్ కుమార్ ఆనంద్ తన పదవికి, పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేయడంపై ఆప్ నాయకులు స్పందించారు. బిజెపి బెదిరింపులు, ఒత్తిడి కారణంగానే రాజ్‌కుమార్ రాజీనామా చేసి ఉండొచ్చనని ఆప్ నాయకులు, ఢిల్లీ మంత్రి సౌరభ్ భరద్వాజ్ తెలిపారు. అలాగే, 'రాజీనామ చేసినందుకు రాజ్‌కుమార్‌పై నిందలు వేస్తామని, ద్రోహి అని పిలుస్తామని చాలా మంది అనుకుంటారు. కానీ మేం అలాచేయం. ఎందుకంటే అతను భయపడి ఉండాడని మేం భావిస్తున్నాం. అతనికి కుటుంబం, పిల్లలు, బంధువులు ఉన్నారు' అని భరద్వాజ్ అన్నారు. 'ఒక దళిత ఎమ్మెల్యేనే ఈ విధంగా బెదిరిస్తే సామాన్యుల పరిస్థితి ఎలా ఉంటుందో ఒక్కసారి ఆలోచించండి' అని తెలిపారు. అలాగే, కేజ్రీవాల్‌ను అరెస్టు చేసిన ఉద్దేశమే ఇది అని రాజ్యసభ ఎంపీ సంజయ్ సింగ్ విమర్శించారు. కేజ్రీవాల్‌ను అరెస్టు చేసి ఆప్‌ను అంతం చేయాలని బిజెపి కోరుకుటుందని చెప్పారు.

ఛత్తీస్‌గఢ్‌లో రోడ్డు ప్రమాదం

- 15 మంది మృతి

దుర్గ్: ఛత్తీస్‌గఢ్‌లోని దుర్గ్ జిల్లాలో ఘోర ప్రమాదం సంభవించింది. ప్రైవేటు సంస్థ ఉద్యోగులను తీసుకెళుతున్న బస్సు మంగళవారం రాత్రి 8.30 గంటలకు మట్టి గని వద్ద మొరం కోసం తవ్విన గోతిలో పడిపోయింది. ప్రమాద స్థలంలోనే 11 మంది మరణించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరో నలుగురు మరణించారు. 12 మందికిపైగా గాయపడ్డారు. ఓ డిస్టిలరీ కంపెనీలో పనిచేస్తున్న 30 మంది ఉద్యోగులను ఇళ్లకు తీసుకొస్తున్న బస్సు కుమ్హారీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఖాప్రీ గ్రామం సమీపంలో ప్రమాదానికి గురైంది. రోడ్డు పక్కకు జారి 40 అడుగుల లోతున్న గోయ్యిలో పడిపోయింది.

రష్యా, చైనా దౌత్య సంబంధాలకు 75ఏళ్ళు

- రష్యా విదేశాంగ మంత్రితో జిన్‌పింగ్ భేటీ



బీజింగ్ : చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్ మంగళవారం ఇక్కడ రష్యా విదేశాంగ మంత్రి సెర్గి లావ్‌రోవ్‌తో భేటీ అయ్యారు.రష్యా, చైనాల మధ్య దౌత్య సంబంధాలు ఏర్పడి 75ఏళ్ళు పూర్తయిన సందర్భంగా రష్యా అధ్యక్షుడు పుతిన్‌కు తమ తరపున శుభాకాంక్షలు తెలియచేయాల్సిందిగా జిన్‌పింగ్ కోరారు. ఇరు దేశాల సంబంధాలు సాఫీగా, నిలకడగా అభివృద్ధి చెందేలా పరస్పరం మార్పిడులు కొనసాగించాలని పుతిన్, తాను అంగీకరించినట్లు జిన్‌పింగ్ తెలిపారు. దౌత్య సంబంధాల వార్షికోత్సవాన్ని అవకాశంగా తీసుకుని ఇరువురు నేతల మధ్య కుదిరిన కీలకమైన ఏకాభిప్రాయాన్ని పూర్తి స్థాయిలో అమలు చేయడానికి కృషి చేయాలన్నారు. తమ జాతీయ ప్రయోజనాలకు అనువైన అభివృద్ధి పంథాను అనుసరించడంతో రష్యా ప్రజలకు చైనా మద్దతునిస్తుందని చెప్పారు. తీవ్రవాదాన్ని ఎదుర్కొనడంలో, సామాజిక భద్రతను, సుస్థిరతను కొనసాగించడంలో రష్యాకు తోడ్పాటునందిస్తామన్నారు. చైనా-రష్యా సంబంధాల అభివృద్ధికి చైనా ఎల్లప్పుడూ ప్రాధాన్యతనిస్తుందన్నారు. రష్యాతో ద్వైపాక్షిక కమ్యూనికేషన్‌ను బలోపేతం చేయడానికి సిద్ధంగా వున్నామన్నారు. బ్రిక్స్‌లో, ఎస్‌సిఓలో బహుముఖ వ్యూహాత్మక సమన్వయాన్ని పెంచుతామన్నారు. పుతిన్ తరపు శుభాకాంక్షలను లావ్‌రోవ్ తెలియచేశారు. జిన్‌పింగ్ బలమైన నాయకత్వంలో చైనా పలువిజయాలను సాధిస్తోందని, ఇతర దేశాలు ఉమ్మడి అభివృద్ధిని సాధించేలా కీలకమైన అవకాశాలను కల్పిస్తోందన్నారు.

మార్చిలో మండిన ఎండలు

- అత్యంత వేడి మాసంగా రికార్డు

న్యూఢిల్లీ : ఈ ఏడాది వేసవి ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉంటాయని ఇప్పటికే పలు సంస్థలు ఇప్పటికే ప్రకటించాయి. అందుకు తగ్గట్లుగానే ఫిబ్రవరి నెల నుంచే ఉష్ణోగ్రతలు ఎక్కువగా నమోదవుతున్నాయి. ఈ క్రమంలోనే గత నెల మార్చి చరిత్రలోనే అత్యంత 'ఉష్ణమయ మార్చి'గా నిలిచిపోయింది. గడచిన 1.25 లక్షల ఏళ్లలో ఎన్నడూ ఈ స్థాయి వేడి లేదు. ప్రపంచవ్యాప్తంగా కరవులు, కార్చిచ్చు, వరదలకు ఇదే కారణమని భావిస్తున్నారు. అలాగే, గత 174 ఏళ్లలో గత ఏడాది 2023 అత్యంత ఉష్ణమయ ఏడాదిగా నిలిచింది. 2024లోనూ రికార్డు ఉష్ణోగ్రతలు కొనసాగుతాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. అలాగే గత ఏడాది జూన్ నుంచి వరుసగా పదో నెలలో ఉష్ణోగ్రతలకు సంబంధించిన కొత్త రికార్డు నమోదైంది. ఎల్‌నినో వాతావరణ పోకడ, మానవచర్యలతో ఉత్పన్నమవుతున్న గ్రీన్‌హౌస్ వాయువులే ఇందుకు కారణం. యూరప్ చెందిన కోపర్‌నికస్ క్లైమేట్ ఛేంజ్ సర్వీస్ (సీ3ఎస్) ఈ విషయాన్ని వెల్లడించింది. ఈ సంస్థ వెల్లడించిన వివరాల ప్రకారం గత నెల మార్చిలో పుడమిపై సరాసరి ఉష్ణోగ్రత 14.4 డిగ్రీల సెల్సియస్ ఉంది. పారిశ్రామికీకరణకు ముందునాటి కాలం (1850-1900)తో పోలిస్తే ఇది 1.68 డిగ్రీల సెల్సియస్ అధికం. 1991- 2020 కాలంలో మార్చి నెలల్లో నమోదైన వేడితో పోలిస్తే ఇది 0.73 డిగ్రీల సెల్సియస్ ఎక్కువ. ఇప్పటివరకూ మార్చికి సంబంధించి అధిక ఉష్ణోగ్రతలు 2016లో నమోదయ్యాయి. ఈ ఏడాదితో పోల్చినా ఈ ఏడాది మార్చిలో 0.10 డిగ్రీల సెల్సియస్ మేర ఎక్కువగా నమోదైంది. అలాగే, గత 12 నెలల్లో (2023 ఏప్రిల్ నుంచి గత నెల మార్చి వరకూ) పుడమి సరాసరి ఉష్ణోగ్రతలో రికార్డు చోటుచేసుకుంది. ఇది.. 1991-2020 కాలంలో నమోదైన సరాసరి ఉష్ణోగ్రత కన్నా 0.70 డిగ్రీల సెల్సియస్ అధికం. పారిశ్రామికీకరణకు ముందునాటితో పోలిస్తే ఇది 1.58 డిగ్రీల సెల్సియస్ మేర ఎక్కువ. భూతాపంలో పెరుగుదలను 1.5 డిగ్రీల సెల్సియస్‌కు మించకుండా చేయాలని 'పారిస్ ఒప్పందం'లో ప్రపంచ దేశాలు నిర్దేశించకున్నాయి. అయినా జనవరితో ముగిసిన ఏడాది కాలం మొత్తం ఈ పరిమితి దాటిపోయింది. పారిశ్రామికీకరణకు ముందునాటితో పోలిస్తే ఇప్పటికే పుడమి సరాసరి ఉష్ణోగ్రత 1.15 డిగ్రీల సెల్సియస్ మేర పెరిగింది.

పనామా పత్రాల కేసులో విచారణ షురూ!

పనామా సిటీ : ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టించిన పనామా పత్రాల కేసులో మనీ లాండరింగ్ ఆపరేషన్‌కు సంబంధించి అభియోగాలు మోపిన 27మందిపై సోమవారం ఇక్కడి పనామా క్రిమినల్ కోర్టులో విచారణ మొదలైంది. 2016లో పెద్ద ఎత్తున పత్రాలను లీక్ కావడంతో దీనంతటికీ మూలమైన మొసాక్-ఫోన్సెకా (న్యాయ సంస్థ) యజమానులు కూడా ఈ విచారణను ఎదుర్కొంటున్నవారిలో వున్నారు. ప్రపంచంలోనే అత్యంత కుబేరులైన వ్యక్తులు కొందరు తమ దేశాల్లో పన్ను ఎగ్గొట్టి, పనామాలోను, బ్రిటిష్ వర్జిన్ ఐలండ్స్ వంటి చోట్ల డొల్ల కంపెనీలను పెట్టి పెద్ద మొత్తంలో వి నల్లధనాన్ని 2000 సంవత్సరం నుంచి ఎలా దాచుకున్నారో ఈ పత్రాలు వెల్లడిస్తున్నాయి. ఈ రహస్య పత్రాలను జర్మనీకి చెందిన వార్తా పత్రిక సుడుచ్చె జీటుగ్, అంతర్జాతీయ ఇన్వెస్టిగేటివ్ జర్నలిస్టుల కన్సార్షియంతో కలిపి బయటపెట్టాయి. మనీలాండరింగ్ వ్యవహారంలో వీరికి మొసాక్-ఫోన్సెకా అనే న్యాయ సంస్థ తోడ్పాటు నందించింది. పెద్ద మొత్తంలో నల్ల డబ్బును విదేశీ బ్యాంకుల్లో రహస్యంగా ఏ విధంగా దాచుకుంటున్నారో తెలియచేసే కోటీ 10లక్షల రహస్య డాక్యుమెంట్లను బయటపెట్టడాన్నే పనామా పత్రాలుగా పేర్గాంచాయి.

ఈ కేసు పర్యవసానాలు చాలా విస్తృతంగా వున్నాయి. ఐస్‌ల్యాండ్ మాజీ ప్రధాని రాజీనామాతో పాటు అర్జెంటీనా, ఉక్రెయిన్ తదితర నేతలపై కూడా స్క్రూటినీ జరిగింది.భారత్‌కు చెందిన బడా బాబులు కూడా కొందరు ఇందులో ఉన్నారు. చాలాకాలం నుండి ఆలస్యమవుతూ వస్తున్న విచారణ ఎట్టకేలకు సోమవారం ప్రారంభమైంది. ఈ చర్యలకు తాము దోషులం కాదని జురెగెన్ మొసాక్, రామన్ ఫోన్సెకా కోర్టు రూమ్‌లో స్పష్టం చేశారు. ఫోన్సెకా పనామాలోని ఆస్పత్రిలో వున్నారని ఆయన తరపు న్యాయవాదులు తెలిపారు. మొసాక్, ఫోన్సెకాలకు పనామా పౌరసత్వం వుంది. తన స్వంత పౌరులను పనామా బయటకు పంపించదు. మొసాక్- ఫోన్సెకా కుట్రపూరితంగా వ్యవహరించి తమ క్లయింట్లు సంపదను అక్రమంగా దాచి పెట్టుకోడానికి, తమకు చెల్లించాల్సిన పన్నులు కట్టకుండా ఎగ్గొట్టడానికి, అమెరికా చట్టాలను ఉల్లంఘించేలా చేశారని అమెరికన్ ఫెడరల్ ప్రాసిక్యూటర్లు వాదించారు.

గాజాలో కాల్పుల విరమణ పాటించాలి

- 800మందికి పైగా ఆరోగ్య నిపుణులు బహిరంగ లేఖ

గాజా : గాజాలో తక్షణమే కాల్పుల విరమణ అమలు చేయాలని కోరుతూ 800మందికి పైగా ప్రజారోగ్య రంగ నిపుణులు బుధవారం ఓ బహిరంగ లేఖ రాశారు. ఇజ్రాయిల్ నిరంతర దాడులతో గాజాలో నెలకొన్న ప్రజారోగ్య విపత్తు పట్ల వారు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవమైన ఏప్రిల్ 7 నాటికి గాజాలో ఇజ్రాయిల్ నరహంతక దాడులకు ఆరు మాసాలు పూర్తయిన సందర్భంగా వారు ఈ లేఖ రాశారు. . పీపుల్స్ హెల్త్ మూవ్‌మెంట్ (పిహెచ్‌ఎం), గ్రాస్‌రూట్స్ నెట్‌వర్క్ ఆఫ్ హెల్త్ వర్కర్స్, కార్యకర్తలు, సంస్థలు, అంతర్జాతీయ విద్యావేత్తలతో సహా పలు అంతర్జాతీయ ఆరోగ్య సంస్థలు ఈ లేఖపై సంతకాలు చేశాయి. గాజాలో మానవ కల్పిత క్షామం పట్ల వారు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. గాజాలో ఆరోగ్య మౌలిక సదుపాయాలను లక్ష్యంగా చేసుకోవడాన్ని వారు తీవ్రంగా నిరసించారు. ఇజ్రాయిల్ బాంబు దాడుల్లో ప్రజారోగ్య వ్యవస్థ పూర్తిగా నాశనమైందన్నారు. దీనికి నెతన్యాహు ప్రభుత్వమే బాధ్యత వహించాలని ఆ లేఖలో స్పష్టం చేశారు. ఇజ్రాయిల్ నిరంతర దాడుల నుండి బతికి బట్ట కట్టినవారు ప్రజారోగ్యానికి సంబంధించిన పెను విపత్తును ఎదుర్కొంటున్నారని ఆ లేఖలో వారు ఆందోళన వ్యక్తం చేశారు. గాజాలో బేషరతుగా తక్షణమే కాల్పుల విరమణ పాటించాలని, ఆరోగ్య కార్యకర్తలకు రక్షణ కల్పించాలని, పరిశుభ్రమైన తాగునీరును అందించాలని, పారిశుధ్య పరిస్థితులు మెరుగుపరచాలని, ఎలాంటి ఆటంకాలు లేకుండా మానవతా సాయం అందేలా చూడాలని ఆ లేఖలో వారు అంతర్జాతీయ సమాజానికి విజ్ఞప్తి చేశారు.

ఐరాసలో కీలక సంస్థలకు భారత్ ఎన్నిక !

న్యూయార్క్ : ఐక్యరాజ్య సమితికి చెందిన కీలకమైన సంస్థలకు భారత్ ఎన్నికైంది. అంతర్జాతీయ మాదకద్రవ్యాల నియంత్రణా బోర్డు (ఐఎన్‌సిబి) కు భారత్ నామినీ జగ్‌జిత్ పవాడియా తిరిగి ఎన్నికయ్యారు.

2025-2030 వరకు ఐదేళ్ళ పదవీకాలానికి ఎన్నిక నిర్వహించగా పవాడియా41 ఓట్లతో మొదటి స్థానంలో నిలిచారు. రెండో స్థానంలో నిలిచిన అభ్యర్థికి 30ఓట్లు లభించాయి. 70 ఏళ్ల జగ్‌జిత్ పవాడియా భారత ప్రభుత్వంలో 35ఏళ్ళ పాటు వివిధ కీలక బాధ్యతలు నిర్వహించారు. అలాగే మహిళల స్థితిగతులపై కమిషన్‌కు కూడా భారత్ ఎన్నికైంది. దీనితో పాటు ఐక్యరాజ్య సమితికి చెందిన ఇతర కార్యనిర్వాహక బోర్డులకు కూడా ఎన్నికైంది. ఐరాస అనుబంధ సంస్థల్లో గల 17ఖాళీలను భర్తీ చేయడానికి ఐక్యరాజ్య సమితి ఆర్థిక, సామాజిక మండలి (ఇసిఓఎస్‌ఓసి) మంగళవారం ఎన్నికలు నిర్వహించింది. విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ కూడా ఇదే విషయాన్ని ఎక్స్‌లో పోస్టు ద్వారా తెలియచేశారు.

సుప్రీంను ఆశ్రయించిన కేజ్రీవాల్

- అత్యవసర విచారణకు సిజెఐ అంగీకారం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

తనను ఇడి అరెస్టు చేయడాన్ని సమర్థిస్తూ ఢిల్లీ హైకోర్టు ఇచ్చిన రూలింగ్‌ను ఢిల్లీముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ బుధవారం సుప్రీంకోర్టులో సవాల్ చేశారు. దీనిపై అత్యవసర విచారణ జరపాలని ఆయన విజ్ఞప్తి చేశారు. దీనికి అత్యున్నత న్యాయస్థానం అంగీకరించింది. మద్యం విధానానికి సంబంధించిన మనీలాండరింగ్ కేసులో ఇడి తనను అరెస్ట్ చేయడం అక్రమమంటూ కేజ్రీవాల్ ఇటీవల ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించగా, తగిన ఆధారాలతోనే ఇడి అరెస్టు చేసిందని జస్టిస్ స్వర్ణ కాంత్ శర్మ నేతృత్వంలోని ఏక సభ్య ధర్మాసనం మంగళవారం తీర్పు చెప్పింది. అంతేకాదు, ఇందులో ఏవిధమైన చట్ట ఉల్లంఘన కానీ, సుప్రీం కోర్టు గతంలో ఇచ్చిన తీర్పులను ఉల్లంఘించడం గానీ జరగ లేదని జస్టిస్ శర్మ వ్యాఖ్యానించారు. దీనిని సవాల్ చేస్తూ కేజ్రీవాల్ తరపున సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వి సుప్రీం కోర్టులో పిటిషన్ వేశారు. తమ పిటిషన్‌ను అత్యవసర విచారణకు స్వీకరించాలని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి డివై చంద్రచూడ్‌ను ఆయన కోరారు.' ఇ-మెయిల్ పంపండి. చూస్తాను' అని సిజెఐ చంద్రచూడ్ పిటిషనర్ తరపు న్యాయవాదికి చెప్పారు. బలవంతపు చర్యల నుంచి రక్షణ కల్పించేందుకు హైకోర్టు తిరస్కరించడంతో మార్చి21న కేజ్రీవాల్‌ను ఇడి అరెస్టు చేసింది. ఏప్రిల్ 14 వరకు ఆయనను ప్రత్యేక న్యాయస్థానం జ్యుడిషియల్ కస్టడీకి పంపింది. జ్యుడీషియల్ కస్టడీలో ఉన్న సమయంలో తన లాయర్లను కలిసేందుకు అదనపు సమయం ఇవ్వాలని కోరుతూ కేజ్రీవాల్ విజ్ఞప్తిని ఢిల్లీలోని రౌస్ అవెన్యూ కోర్టు బుధవారం కొట్టివేసింది.

यूनियन बैंक ऑफ इंडिया भारत सरकार का उपक्रम | యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా భారత ప్రభుత్వ రంగ సంస్థ

గవర్నర్‌పేట బ్రాంచి - 01451
డి.నెం. 27-18-85, హోటల్ రాజ్‌టవర్స్ దగ్గర
కాంగ్రెస్ ఆఫీస్ రోడ్డు, విజయవాడ - 520002

అమ్మకం గురించి ఋణగ్రహీతకు తెలియపరచు ప్రకటన (30 రోజుల ప్రకటన)
(RULE 6 (2) RULE 8(6) OF SECURITY INTEREST (ENFORCEMENT) RULES 2002)

ఋణగ్రహీతలు / కో-అబ్లిగెంట్స్ / తనఖాదారులు/హామీదారులు : 1) శ్రీ రామమూర్తి బొలిశెట్టి (ఋణగ్రహీత), డి.నెం. 59ఎ-21/3-3(1), ప్లాట్ నెం. 43, 2వ క్రాస్ రోడ్డు, విజయ నగర్ కాలనీ, పటమట, విజయవాడ - 520010. **2) శ్రీ రామమూర్తి బొలిశెట్టి,** (ఋణగ్రహీత) తండ్రి : శ్రీ పురోషోత్తమరావు, ఫ్లాట్ నెం. 404, 3వ అంతస్తు, మహేశ్వరి హైట్స్, పవర్ గ్రిడ్ దగ్గర, గుణదల రోడ్డు, నున్న, కృష్ణా జిల్లా, విజయవాడ - 521212. **3) శ్రీమతి వాణి కుమారి బొలిశెట్టి,** (కో-అప్లికెంట్), భర్త శ్రీ పురుషోత్తమరావు, డి.నెం. 59ఎ-21/3-3(1), ప్లాట్ నెం. 43, 2వ క్రాస్ రోడ్డు, విజయ నగర్ కాలనీ, పటమట, విజయవాడ - 520010.

విషయం: సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎసెట్స్ & ఎన్ఫోర్స్మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, (యాక్టు 54 యొక్క 2002) ప్రకారం యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియావారి బకాయి వసూలు కొరకు మీకు చెందిన ఆస్తి అమ్మకం.

చట్టం 13(2) విభాగం పరిధిలో నేను / బ్యాంక్ డిమాండ్ నోటీసు **తేది. 08-09-2023** ద్వారా మీకు డిమాండ్ పంపినప్పటికీ మీరు బ్యాంకుకు చెల్లించవలసిన బకాయి మొత్తం చెల్లించుటలో మీరు విఫలమైనారు.

పైన చెప్పిన చట్టం పరిధిలో సంక్రమించిన అధికారాలతో ఈ దిగువ తెలిపిన ఆస్తిని **తేది. 24-01-2024**న అధీకృత అధికారి సూచనాత్మకంగా స్వాధీన పరచుకున్నారు.

ఆస్తిని స్వాధీన పరచుకున్న తర్వాత కూడా, మీరు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు చెల్లించవలసిన బకాయి మొత్తమును మీరు చెల్లించలేదు. అందువలన, ఈ నోటీసు తేదీ నుండి 30 దినములు తర్వాత దిగువ తెలిపిన ఆస్తిని ఇ-వేలం ద్వారా విక్రయించవలసిన అవసరం ఏర్పడినది.

విడిగా జారీచేయబడు అమ్మకం ప్రకటన ద్వారా, వేలం తేదీ మరియు సమయం మరియు సర్వీసు ప్రొవైడర్ వివరములు తెలియచేయ బడతాయి మరియు హెచ్చు ధర ఆఫర్ చేసిన వ్యక్తికి ఆస్తి విక్రయించబడుతుంది.

కాబట్టి, ఆస్తులను ప్రైవేటు అమ్మకం ద్వారా కూడా విక్రయించవచ్చును. లేదా వ్యక్తుల నుండి కొటేషన్లు కూడా పొందవచ్చును. బ్యాంక్ ఆమోదయోగ్యమైన మరియు కొనుగోలుదారుని ఉద్దేశించిన నిబంధనలు మరియు షరతులకు లోబడి ఆస్తి విక్రయించవచ్చును.

మీరు ప్రైవేటు అమ్మకం ద్వారా లేదా కొటేషన్ పొందడం ద్వారా ఆస్తిని ఎవరికైనా విక్రయించే ప్రతిపాదనలను కలిగి ఉన్నట్లుయితే, ఈ నోటీసు అందిన తేది నుండి 7 రోజులలోపుగా దానిని బ్యాంక్‌కు తెలియజేయగలరు.

విఫలమైనచో, మీకు అలాంటి ప్రతిపాదన ఏమీ లేదని పైన సూచించిన ప్రకారం ఇ-వేలం ద్వారా ఆస్తి విక్రయం చేయుటకు బ్యాంక్ తదుపరి పక్రియ కొనసాగిస్తుంది.

ఇ-వేలం ప్రకటన ప్రచురణ తేదీన లేదా ఆలోగా బ్యాంక్ డిమాండ్ నోటీసు **తేది. 08-09-2023** నందు సూచించిన పూర్తి మొత్తంతో పాటు చెల్లించు తేదీ వరకు అందుపై తదుపరి వడ్డీ మరియు అప్పటివరకు సంభవించిన ఖర్చులు మరియు వ్యయాలు చెల్లించి ఆస్తిని విడిపించుకోవచ్చునని దయచేసి మీరు గమనించిగలరు. ఇట్టి విషయంలో షెడ్యూలులో తెలిపిన ఆస్తి అమ్మకానికి తదుపరి వేలం ఉండదు.

షెడ్యూల్ ఆస్తి

తనఖా ఆస్తులు : కృష్ణా జిల్లా, నున్న, గుణదల రోడ్డు, పవర్ గ్రిడ్ దగ్గర, ఆర్.ఎస్.నెం. 722/2ఎ వద్ద గల మహేశ్వరి హైట్స్ నందు (మొత్తం 2776.47 చ॥గ॥ల విస్తీర్ణంలోని ఆస్తి నందు అవిభక్త మరియు పేర్కొనబడని వాటా 30 చ॥గ॥ల) మూడవ అంతస్తులోని ఫ్లాట్ నెం. 404. **ఆస్తికి హద్దులు : తూర్పు :** డొంక, **దక్షిణం :** గొల్లపూడి పంపింగ్ స్కీమ్ కెనాల్, **పడమర :** అన్నపురెడ్డి వెంకటేశ్వరరెడ్డి, అన్నపురెడ్డి సీతారావమ్మ గార్ల ఆస్తి, **ఉత్తరం :** బడిశ దుర్గ గారి ఆస్తి, **ఫ్లాట్‌కి హద్దులు : తూర్పు :** ఫ్లాట్ నెం. 403, **దక్షిణం :** శూన్యాకాశము, **పడమర :** మెట్లు, కామన్ కారిడార్, **ఉత్తరం :** శూన్యాకాశము.

రిజర్వుధర : రూ. 21,93,000/- **ఇ.యం.డి. : రూ. 2,19,300/-**

తేది : 10-04-2024
ప్రదేశం : విజయవాడ

సం/- అధీకృత అధికారి
యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్
బ్రాంచి ఆఫీస్ యాక్సిస్ బ్యాంక్ లి., డోర్ నెం.22/1223/ఎ-1, 1వ అంతస్తు, జి.టి.రోడ్డు, నెల్లూరు, ఆంధ్రప్రదేశ్-524003.

స్వాధీనత ప్రకటన (రూల్-8(1) (స్థిరాస్తుల వివరములు)

ఇందుమూలంగా **యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్ (ఇంతకు పూర్వము యు.టి.ఐ బ్యాంక్ లిమిటెడ్ గా తెలిసిన)** యొక్క అధీకృత అధికారి వారి నమోదిత కార్యాలయము: "త్రిసూల్", సామర్తేశ్వర్ గుడి ఎదురుగా, లా గార్డెన్ దగ్గర, ఎల్లిస్‌బ్రిడ్జ్, అహ్మదాబాద్-380006, ఇతర ప్రదేశములలో ఉన్న బ్రాంచీలు నందు గల **యాక్సిస్ బ్యాంక్ లి., డోర్ నెం.22/1223/ఏ-1, 1వ అంతస్తు, జి.టి.రోడ్డు, నెల్లూరు, ఆంధ్రప్రదేశ్-524003** వారి యొక్క అధీకృత అధికారిగా ఉన్న ఈ దిగువ సంతకందారుడు సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 మరియు అందలి సెక్షన్ 13(12) తో కలిపి చదవబడే ప్రకారం సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) నిబంధనలు, 2002 యొక్క రూల్ 3 క్రింద తమకు లభించిన అధికారములను వినియోగించుకుంటూ ఈ దిగువ తెలియజేసిన ఋణగ్రహీతలను బకాయిలు చెల్లించవలసినదిగా కోరుతూ డిమాండ్ నోటీసు జారీ చేసినారు.

అప్లికెంట్/కో-అప్లికెంట్/హామీదారుల యొక్క పేర్లు / ఖాతా నెం.లు : 1) శ్రీ పులి నాగసుధాకర్, ఇంటి నెం.3-13, పెదపూడి, కూచిపూడ్, ఐ. మొవ్వ మండలం, కె.పి. సెంటర్, కృష్ణా జిల్లా, ఆంధ్రప్రదేశ్-521136. **2) శ్రీ పులి దుర్గాప్రసాద్,** ఇంటి నెం.3-13, పెదపూడి, కూచిపూడ్, ఐ. మొవ్వ మండలం, కె.పి. సెంటర్, కృష్ణా జిల్లా, ఆంధ్రప్రదేశ్-521136. **3) శ్రీమతి పులి వెంకట నరసమ్మ,** ఇంటి నెం.3-13, పెదపూడి, కూచిపూడ్, ఐ. మొవ్వ మండలం, కె.పి. సెంటర్, కృష్ణా జిల్లా, ఆంధ్రప్రదేశ్-521136.

అకౌంట్ నెం. : 917030049481167 & 917030049481170, **డిమాండ్ నోటీసు తేదీ : 11.02.2022,** **స్వాధీనం నోటీసు తేదీ : 06.04.2024**

బకాయి మొత్తం : రూ.42,18,988/- (అక్షరాల నలభై రెండు లక్షల పద్దెనిమిది వేల తొమ్మిది వందల ఎనభై ఎనిమిది రూపాయలు మాత్రమే) ఒప్పంద రేటుపై భవిష్యత్తు వడ్డీ, ఖర్చులు మరియు ఇతర పరిణామాలు, నష్టాలు మొదలైనవి. వాటిపై ఆస్తులను స్వాధీనం చేసుకుని విక్రయించాలని అన్నారు.

షెడ్యూల్ ఆస్తి వివరములు : కృష్ణా జిల్లా, మొవ్వ మండలం, పెదపూడి గ్రామం & గ్రామ పంచాయితీ, డోర్ నెం.3-13, ఆర్.ఎస్.నెం.50/3 లోని విస్తీర్ణం 1161.6 చ॥గ॥లుతో గల భూమి. **హద్దులు : తూర్పు :** జిల్లా పరిషద్ రోడ్డు, **పడమర :** రోడ్డు, **దక్షిణం :** రోడ్డు, **ఉత్తరం :** రోడ్డు.

పైన తెలియజేయబడిన నోటీసు నందు బకాయి మొత్తములను డిమాండ్ నోటీసులు స్వీకరించిన 60 దినములలోగా చెల్లింపు చేయవలసినదిగా కోరినారు. అయినప్పటికినీ సదరు నోటీసులు నందు చెప్పబడిన బకాయి మొత్తములను తిరిగి చెల్లింపులో ఋణగ్రహీతలు విఫలమైనందున ఈ దిగువ సంతకందారుడు తమకు పై చట్టం యొక్క 13(4) తో కలిపి చదవబడే సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) నిబంధనలు, 2002 యొక్క రూల్ 8తో కలిపి చదవబడే ప్రకారం తమకు లభించిన అధికారములను వినియోగించుకుంటూ పైన చెప్పబడిన తేదీలలో సదరు ఆస్తులను స్వాధీనత చేసికొని ఉన్నారని ఈ నోటీసు ద్వారా సాధారణ ప్రజానీకమునకు మరియు ముఖ్యంగా ఋుణగ్రహీతలను హెచ్చరించడమైనది. సాధారణ ప్రజానీకము మరియు ముఖ్యంగా ఋణగ్రహీతలు ఈ నోటీసు ద్వారా చేయు హెచ్చరిక ఏమనగా పైన చెప్పబడిన ఆస్తులతో ఏవిధమైన లావాదేవీలు జరుపరాదు, అట్లు జరపబడిన ఎడల అట్టి లావాదేవీలు యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్, వారి యొక్క పైన చెప్పబడిన నోటీసు నందు బకాయి మొత్తములు మరియు తదుపరి వడ్డీ, ఇతర ఖర్చులు మొదలగునవి ఛార్జ్‌కి లోబడి ఉండును.

సదరు పై సర్ఫేసి 2002 చట్టం యొక్క సెక్షన్ 13 నందు సబ్-సెక్షన్ 8 లో గల నిబంధనలకు లోబడి ఋణగ్రహీతలు తమ సెక్యూర్డ్ ఆస్తులను తిరిగి విడిపించుకొనుటకు శ్రమించు కాలపరిమితిని దయచేసి గమనించవలసినదిగా కోరడమైనది.

సెక్యూర్డ్ క్రెడిటార్ వారిచే ఈ నోటీసు ప్రచురణ తేదీకి ముందుగా ఏ సమయములోనైనా వారి బకాయి మొత్తములు మరియు ఇతర అన్ని కాస్ట్స్, ఛార్జీలు మరియు వారిచే చేయబడిన ఖర్చులుతో కలిపి చెల్లించిన ఎడల లేదా బహిరంగ వేలం లేదా కొటేషన్లు లేదా టెండర్లు బహిరంగ లేదా ప్రైవేటు వారి నుండి స్వీకరించిన, ట్రీటీ, లీజు, అసైన్‌మెంట్ లేదా అమ్మకం ద్వారా బదిలీ చేయుటకు ముందుగానే పూర్తిగా చెల్లించవలెను.

1) సెక్యూర్డ్ క్రెడిటార్ వారిచే ఈ హామీ ఆస్తులు లీజు ద్వారా, అసైన్‌మెంటు లేదా విక్రయం ద్వారా బదిలీ చేయబడదు; మరియు

2) సెక్యూర్డ్ క్రెడిటార్ వారిచే లీజు లేదా అసైన్‌మెంట్ లేదా ఈ ఆస్తుల విక్రయం వంటి ఏదేని చర్యలు తీసుకొనుటకు తగినంత ముందుగానే వారి బకాయి మొత్తములు ఈ సబ్-సెక్షన్ క్రింద పూర్తిగా చెల్లించినచో వారిచే బదిలీ లేదా లీజు లేదా ఆస్తుల విక్రయం వంటి తదుపరి తీసికొనబడవు.

తేది : 06.04.2024, ప్రదేశము : నెల్లూరు

సం/- అధీకృత అధికారి, యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్

ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంక్ లిమిటెడ్
(గతంలో క్యాపిటల్ ఫస్ట్ లిమిటెడ్‌గా తెలిసినది, ఐడిఎఫ్‌సి బ్యాంక్ లిమిటెడ్‌తో అమల్గామేట్ చేయబడినది మరియు ప్రస్తుతం ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంక్ లిమిటెడ్‌గా తెలిసినది) | CIN :L65110TN2014PLC097792
రిజిస్టర్డు ఆఫీసు: కెఆర్‌ఎం టవర్స్, 8వ అంతస్తు, హర్రింగ్టన్ రోడ్, చెట్‌పేట్, చెన్నై-600031.
Tel : +91 44 4564 4000 1 Fax: +91 44 4564 4022

IDFC FIRST Bank

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 యొక్క సెక్షన్ 13(2) క్రింద ప్రకటన


దిగువ రుణగ్రహీతలు మరియు సహ-రుణగ్రహీతలు **ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంక్ లిమిటెడ్ (గతంలో క్యాపిటల్ ఫస్ట్ లిమిటెడ్‌గా తెలిసినది, ఐడిఎఫ్‌సి బ్యాంక్ లిమిటెడ్‌తో అమల్గామేట్ చేయబడినది మరియు ప్రస్తుతం ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంక్ లిమిటెడ్‌గా తెలిసినది)** నుండి దిగువ పేర్కొన్న సెక్యూర్డ్ రుణాలను పొంది యున్నారు. దిగువ పేర్కొన్న రుణగ్రహీతలు మరియు సహ-రుణగ్రహీతల రుణాలకు వారి సంబంధించిన ఆస్తుల తాకట్టు ద్వారా హామీగా చూపబడినవి. ఆ విధంగా వారు సంబంధిత రుణ ఒప్పందాల నియమ& నిబంధనలు పాటించుటలో ఇర్రెగులర్ అయినందున, వారి రుణాలు ఆర్‌బిఐ మార్గదర్శకాల ప్రకారం ఎన్‌పిఏగా వర్గీకరించబడినవి. **ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంక్ లిమిటెడ్ (గతంలో క్యాపిటల్ ఫస్ట్ లిమిటెడ్‌గా తెలిసినది, ఐడిఎఫ్‌సి బ్యాంక్ లిమిటెడ్‌తో అమల్గామేట్ చేయబడినది మరియు ప్రస్తుతం ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంక్ లిమిటెడ్‌గా తెలిసినది)**కి వారిచే బాకీయున్న మొత్తాలు దిగువ పట్టికలో మరింత స్పష్టంగా వివరించబడిన సదరు నోటీసుల ప్రకారం పేర్కొనబడినవి మరియు సదరు మొత్తాలను తదుపరి వడ్డీతో వర్తించబడును మరియు దానిని వారి సదరు తేదిల నుండి వర్తించు ఒప్పంద రేటు ప్రకారం చెల్లించవలెను.

క్ర. సం.	రుణ ఖాతా నెం.	రుణం రకం	రుణగ్రహీతలు మరియు సహ-రుణగ్రహీతల పేరు	సెక్షన్ 13(2) నోటీసు తేది	సెక్షన్ 13(2) నోటీసు ప్రకారం బాకీపడిన మొత్తం	ఆస్తి చిరునామా
1	92793860	ఆస్తి పై రుణం	1) మజ్జిగ సుధీర్ కుమార్ 2) మజ్జిగ అనురాధ	23.03.2024	INR 6,40,765.11/-	గుంటూరు జిల్లా, పల్నాడు జిల్లా, నరసరావుపేట రిజిస్ట్రేషన్ జిల్లా, నరసరావుపేట ఉపజిల్లా, నరసరావుపేట మండలం, హెచ్/ఓ యల్లమంద, గురవాయపాలెం గ్రామ పంచాయతీ, యల్లమండ గ్రామం, డి.నెం.289/సి, అసెస్‌మెంట్ నెం.1319, డోర్ నెం.11-12, 113.33చ.గ.లు లేదా 94.75 చ.మీ.ల విస్తీర్ణపు సైటు, 5 సంవత్సరాల క్రితం నిర్మించిన 432చ.అ.ల ఆర్‌సిసి రూఫ్డ్ రెసిడెన్షియల్ బిల్డింగ్, ఆంధ్రప్రదేశ్-522611, దిగువ సరిహద్దులలో: **తూర్పు: మజ్జిగ కోటేశ్వరరావు స్థలం-20 అ.లు, పడమర: సిమెంట్ రోడ్-20 అ.లు, ఉత్తరం: గల్లీ సిమెంట్ రోడ్-51 అ.లు, దక్షిణం: మజ్జిగ పెద కోటేశ్వరరావు స్థలం-51 అ.లు.** పై పేర్కొన్న సరిహద్దులలో 113.33చ.గ.లు లేదా 94.75 చ.మీ.ల విస్తీర్ణపు సైటు, 5 సంవత్సరాల క్రితం నిర్మించిన 432చ.అ.ల ఆర్‌సిసి రూఫ్డ్ రెసిడెన్షియల్ బిల్డింగ్, అందులోని అన్ని సౌలభ్య హక్కులతో.

మిమ్మలను ఇందుమూలంగా కోరబడునది ఏమనగా, ఈ ప్రకటన తేది నుండి 60 రోజుల్లోగా వారి సంబంధిత తేదీల నుండి దానిపై ఒప్పంద రేటుతో వడ్డీ మరియు ఇతర ఖర్చులు, చార్జీలు మొ॥న వాటితో పై పట్టికలో చూపిన వివరాల ప్రకారం **ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంక్ లిమిటెడ్ (గతంలో క్యాపిటల్ ఫస్ట్ లిమిటెడ్‌గా తెలిసినది, ఐడిఎఫ్‌సి బ్యాంక్ లిమిటెడ్‌తో అమల్గామేట్ చేయబడినది మరియు ప్రస్తుతం ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంక్ లిమిటెడ్‌గా తెలిసినది)** వారికి బకాయి మొత్తాలను చెల్లించవలసిందిగా కోరబడుచున్నది, విఫలం చెందినచో, క్రింది సంతకందారు **ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంక్ లిమిటెడ్ (గతంలో క్యాపిటల్ ఫస్ట్ లిమిటెడ్‌గా తెలిసినది, ఐడిఎఫ్‌సి బ్యాంక్ లిమిటెడ్‌తో అమల్గామేట్ చేయబడినది మరియు ప్రస్తుతం ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంక్ లిమిటెడ్‌గా తెలిసినది)** వారికి బకాయి మొత్తాలను రాబట్టుటకు ఇందు పై పేర్కొన్న తాకట్టుపెట్టిన ఆస్తులపై, SARFAESI చట్టంలోని సెక్షన్ 13(4) మరియు సెక్షన్ 14 క్రింద ప్రొసీడింగ్ ప్రారంభించెదరు. తదుపరి మీరు, అమ్మకం/ లీజు లేదా ఇతర రూపాల ద్వారా గాని సదరు సెక్యూర్డ్ అసెట్‌ను బదిలీచేయుట నుండి సదరు చట్టం యొక్క సెక్షన్ 13(13) క్రింద మీరు నిషేధింపబడినారు.

సం/-
అధీకృత అధికారి
ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంక్ లిమిటెడ్
(గతంలో క్యాపిటల్ ఫస్ట్ లిమిటెడ్‌గా తెలిసినది, ఐడిఎఫ్‌సి బ్యాంక్ లిమిటెడ్‌తో అమల్గామేట్ చేయబడినది మరియు ప్రస్తుతం ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంక్ లిమిటెడ్‌గా తెలిసినది)

తేది: 11-04-2024
ప్రదేశం: గుంటూరు, ఆంధ్ర ప్రదేశ్



మీ కోసం

టమాటాలను వంటలో ఉపయోగించే ముందు ఐదారు నిమిషాల పాటు వేడినీటిలో ఉంచితే కూర చాలా రుచిగా ఉంటుంది.

జీవన సౌరభం

ఏమీ లేనప్పుడు ఓపిక, అన్నీ ఉన్నప్పుడు ప్రవర్తన.. మనిషి వ్యక్తిత్వాన్ని పెంచుతాయి.

పుస్తకం


పుస్తకం ఉంటే ధైర్యం
చదివితే జీవితం సుగమం
ప్రతి కమ్మ చదివితే
అగుపించును అమ్మ రూపం

పుస్తకం మలినాన్ని కడిగేస్తది
మనిషితనాన్ని గుర్తుచేస్తది
ప్రపంచ చరిత్ర పుస్తకమే
సమస్త పోరాటం అక్షరమే!

పుస్తకం ఆలోచన కలిగిస్తది
ధైర్యాన్ని నూరిపోస్తది
పుస్తకం తాకితే మాట్లాడినట్లు
పిల్లలతో కలిసి తిరుగుతున్నట్లు
ఎప్పుడూ అనిపిస్తది!



- కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి,
94415 61655.



బొమ్మ గీయండి!

పిల్లలూ , ఈ రోజు '4వ' నెంబరు ఉపయోగించి చిన్న తిమింగలం బొమ్మ గీయడం నేర్చుకుందాం. అంకెల వరుసను అనుసరించి బొమ్మ గీయండి.

నేను గీసిన బొమ్మ



- ఎస్.రక్షిత,
7వ తరగతి,
పెద్ద గొట్టి ముక్కల,
శివంపేట, మెదక్ జిల్లా.



పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

పక్షుల ప్రేమికుడు



ప్రపంచంలో జరుగుతున్న పర్యావరణ మార్పులతో ఎన్నో జీవజాతులు అంతరించి పోతున్నాయి. అలాంటి అరుదైన పక్షి జాతులను గుర్తించి, వాటి రక్షణ కోసం తనవంతుగా కృషి చేస్తున్నారు మధురైకి చెందిన పర్యావరణవేత్త, పక్షుల పరిశీలకులు ఎన్.రవీంద్రన్. అరుదైన పక్షులను కెమెరాలో బంధించటం, వాటిని డాక్యుమెంట్ చేయటం, ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లటం చేస్తున్నారు.

తమిళనాడు రాష్ట్రం మధురై ప్రాంతంలోని జిల్లా కేంద్రమైన రామనాథపురానికి చెందిన ఎన్.రవీంద్రన్ (56) జంతుశాస్త్రంలో పట్టభద్రులు. ఎలక్ట్రికల్ కంపెనీలో ఉద్యోగి. పక్షిజాతి ప్రేమికుడు. పర్యావరణ వేత్త కూడా. పక్షుల చిత్రాలను తన కెమేరాను క్లిక్ చేయటం, ద్వారా నిక్షిప్తం చేయటం, వాటి వివరాలు తెలుసుకోవటానికి సర్వేలు చేయటం ఆయనకు అలవాటుగా మారింది. వలస పక్షుల విధానాల గురించి లోతైన అధ్యయనం చేస్తున్నారు. ప్రపంచ వ్యాప్తంగానూ పర్యావరణ మార్పులు, చర్చలపైనా ఆయన ఆసక్తి చూపుతున్నారు. 2010లో పక్షి జాతులకు సంబంధించిన పాఠశాల ప్రాజెక్టు విషయమై తన బంధువుకు అధ్యయనం నిమిత్తం ఆయన సహకరించారు. పక్షులు – వాటి ఆవాసాలు – పర్యావరణం వంటి విషయాలు తెలుసుకోవడంలో సహకరించారు. ఆ తద్వారా ఆ ప్రాజెక్టు విజయవంతం కావటంతో ఆ బంధువు ఎంతో సంతోషించారు. చిన్నప్పటి నుంచి పక్షుల పరిశీలన ఉన్న రవీంద్రన్‌కి ఆ కృషి, అభినందన గొప్ప ఉత్సాహాన్నిచ్చింది. తన పరిశీలన, పరిశోధన కొనసాగించాలని అనుకున్నాడు. మధురైలో 'ఇరుగుగల్' అనే స్వచ్ఛంధ సేవా సంస్థ ద్వారా ఒక చిన్న 'బర్డ్ లవర్స్ క్లబ్' ఏర్పాటు చేశారు. 'పక్షి జాతుల పరిరక్షణ' ఈ క్లబ్ లక్ష్యం. రవీంద్రన్‌తో పాటుగా మరికొందరు మధురై, రామనాథపురానికి చెందినవారు ఈ క్లబ్‌లో చేరారు. పాఠశాలలు, కళాశాలలు, విద్యాలయాలకు వెళ్లి పర్యావరణ పరిరక్షణ గురించి, అంతరించిపోతున్న పక్షి జాతుల గురించి అవగాహన కల్పించేవారు.



విస్తృతంగా సదస్సులు, సమావేశాలు నిర్వహించేవారు. ఈ క్రమంలో 2014లో జరిగిన రోడ్డు ప్రమాదంలో రవీంద్రన్ కుడి కన్నుకు దెబ్బతగిలింది. పాక్షికంగా చూపు కూడా కోల్పోయారు. అయినా, పక్షులపై అధ్యయనాన్ని కొనసాగిస్తూనే ఉన్నారు. 2015 నుంచి పక్షుల అధ్యయనంపై మరింత దృష్టి పెట్టాలని నిర్ణయించుకున్నారు. రవీంద్రన్ ఇప్పటివరకు మధురైలోనే 250 కంటే ఎక్కువ పక్షి జాతులను గుర్తించారు. గతంలో ఇంత మొత్తంలో ఈ ప్రాంతంలో పక్షి జాతులు ఉన్నాయనే పరిశీలన జరగలేదు. హిమాలయన్ గ్రిఫాన్, ఈజిప్షియన్ రాబందు, స్టోన్ చాట్‌తోపాటు మరికొన్ని అరుదైన జాతులు వీటిలో ఉన్నాయి. దాదాపు 35 సంవత్సరాల తర్వాత ఈ ఏడాది రామనాథపురంలో కనిపించిన 'ఓస్టెర్ క్యాచర్'ను గుర్తించింది కూడా ఆయనే. తన కెమెరాలో కూడా ఆ పక్షిని బంధించారు. ఈ ఏడాది ప్రాదేశిక, చిత్తడి నేల పక్షుల గణనకు జిల్లా ఆటవీశాఖకు ఆయన ఎంతో సహకరించారు కూడా.



అటవీశాఖకు తోడ్పాటును అందిస్తూ ...


ఈ ప్రాంతంలో ఏటా మార్చి నెలలో వలస పక్షులు రావటం, సంతానోత్పత్తి చేయడం, తరువాత తమ ప్రాంతానికి తిరిగి వెళ్లిపోవటం జరుగుతుంది. ఆ సమయంలో అటవీశాఖ కూడా పక్షుల గణన చేపడుతుంది. అటవీశాఖ సిబ్బందితోపాటుగా కొందరు వాలంటీర్లు కూడా ఈ గణనలో పాల్గొంటారు. వారికి రవీంద్రన్ కూడా సహకరిస్తారు. తన కెమెరాల్లో బంధించిన పక్షి జాతుల చిత్రాలతో పాటు వాటి పేర్లు, సమగ్ర సమాచారం అందజేస్తుంటారు. ఇప్పుడు ఆయన తన పూర్తి వ్యాపకం పక్షుల పరిరక్షణగానే మారిపోయింది. రాష్ట్రం అంతటా ప్రయాణిస్తూ తన స్వీయపరిశీలనను, అనుభవాలను విద్యార్థులకు, యువతీ యువకులకు బోధిస్తున్నారు. కరోనా సమయంలోనూ ఆన్‌లైన్‌లో తన బోధనను అందించారు.

అరుదైన పక్షులకు ఆలవాలం

మధురై ప్రాంతంలోని రామనాథపురం జిల్లా ప్రకృతి అందాలకు ఆలవాలం. జీవ వైవిధ్యానికి పెట్టించి పేరు. ఈ జిల్లాలోనే ప్రపంచ కృత్రిమ జలాశయం (మద్రై), కంజిరంకులం, చిత్రంగుడి అలగంకుళం అభయారణ్యం, మెల్సెల్వనూర్–కీల్సెల్వనూర్ పక్షుల అభయారణ్యం ఉన్నాయి. ఇవన్నీ వివిధ పక్షి జాతుల ఆవాసాలకు నిలయాలు. దేశ, విదేశాల నుంచి వేలాది కిలోమీటర్లు ప్రయాణించి రామనాథపురం పక్షుల కేంద్రానికి చేరుకుంటాయి. వలస పక్షులు ఇక్కడ సంతానోత్పత్తి చేసుకుని తిరిగి ఆయా దేశాలకు వెళ్లిపోతుంటాయి. నీరు పుష్కలంగా ఉండటంతో మత్స్యసంపద కూడా పెరుగుతోంది. పక్షుల ఆహారానికి కొరత లేదు. సమనాథం, అవనియాపురం, వండియూర్ సరస్సుల్లో విస్తృతమైన పక్షుల జాతులు చూడొచ్చు. ప్రధానంగా పెలికాన్, పెయింటెడ్ స్టార్క్, వైట్‌ఐబీస్, నైట్ హెరాయిన్, నల్ల కంకణాల పిట్ట, పరజలు, పాము మెడబాతు, కామన్‌మోర్‌హెన్ తదితర పక్షిజాతులు ఇక్కడ కనిపిస్తాయి. మధురైలోని ఇదయపట్టి వంటి బయో–హెరిటేజ్ సైట్‌లను రక్షించటానికి కొన్ని ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామని రవీంద్రన్ తెలిపారు.

ఎన్నికలు ముగిసే వరకు ఐజాక్ జోలికెళ్లొద్దు

ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్‌కు కేరళ హైకోర్టు ఆదేశం



తిరువనంతపురం : పతనాంతిట్ట లోక్‌సభ నియోజకవర్గం నుండి ఎల్‌డిఎఫ్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న కేరళ మాజీ ఆర్థిక మంత్రి థామస్ ఐజాక్‌ను ఫెమా ఉల్లంఘనల కేసులో ప్రశ్నించేందుకు లోక్‌సభ ఎన్నికలు పూర్తయ్యేవరకు పిలవవద్దని కేరళ హైకోర్టు మంగళవారం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి)ని కోరింది. కెఐఐఎఫ్‌బి జారీ చేసిన మసాలా బాండ్ విషయంలో విదేశీ మారక ద్రవ్య నిర్వహణా చట్టం (ఫెమా) నిబంధనలను ఉల్లంఘించారన్న కేసు ఆయనపై నమోదైంది. ఐజాక్ దాఖలు చేసిన పిటిషన్ విచారణకు వచ్చినప్పుడు జస్టిస్ టి.ఆర్.రవి మాట్లాడుతూ, పిటిషనర్ ఎన్నికల్లో పోటీ చేస్తున్నందున, ఇవి ముగిసేవరకు ఆయనకు సమన్లు జారీ చేసి ఇబ్బంది పెట్టొద్దని ఇడిని హెచ్చరించారు. ఇడి అందచేసిన ఫైళ్ళను కోర్టు పరిశీలించిన అనంతరం న్యాయమూర్తి ఈ వ్యాఖ్యలు చేశారు. మసాలా బాండ్ ద్వారా అందిన నిధుల లావాదేవీల్లో కొన్నింటికి ఐజాక్ వివరణ ఇవ్వాల్సిన అవసరం వుందని కోర్టు పేర్కొంది. అయితే ఈ దశలో ఆ లావాదేవీల ఆదేశాలు వెల్లడించడం సరికాదని వ్యాఖ్యానించింది. ఈ వివరాలను దర్యాప్తును ఎదుర్కొంటున్న వ్యక్తికి అందచేయాల్సి వుంటుందని పేర్కొంది. ఈ లావాదేవీలపై దర్యాప్తు నిర్వహించాలంటే ఎన్నికలు ముగిసిన తర్వాత చేపట్టాలని కోర్టు స్పష్టం చేసింది. ఐజాక్‌కు ఎప్పుడు వీలుంటే ఆ తేదీల్లోనే తమ ముందు హాజరు కావాల్సిందిగా కోరామని ఇడి తరపు న్యాయవాది కోర్టుకు తెలిపారు. దీనిపై మే 22న తదుపరి విచారణకు కోర్టు వాయిదా వేసింది. కెఐఐఎఫ్‌బి వైస్ ఛైర్మన్‌గా, ఎగ్జిక్యూటివ్ కమిటీ ఛైర్మన్‌గా తన పదవీ కాలంలో మసాలా బాండ్ ద్వారా అందిన నిధుల వినియోగంపై మౌఖిక సాక్ష్యమివ్వడానికి ఇడి ముందుకు హాజరు కావాల్సిందిగా తనకు సమన్లు జారీ చేశారని ఐజాక్ పేర్కొన్నారు. కానీ తాజా సమన్ల వెనుక గల ఏకైక ఉద్దేశం తన ఎన్నికల ప్రచారానికి అవరోధం కలిగించడమేనని అన్నారు.

2025 కల్లా కులగణన

మేనిఫెస్టోలో సమాజ్‌వాదీ పార్టీ హామీ

లక్నో : 2025కల్లా కులాల ప్రాతిపదికగా జనగణన చేపడ తామని, కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పిస్తామని, అగ్నిపథ్ పథకాన్ని రద్దు చేస్తామని సమాజ్‌వాది పార్టీ హామీ ఇచ్చింది. సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేష్ యాదవ్ బుధవారం తన పార్టీ ఎన్నికల మేనిఫెస్టోను సీనియర్ పార్టీ నేతల సమక్షంలో ఇక్కడ విడుదలజేశారు. దీనికి 'జనతా కా మాంగ్ పాత్ర – హమారా అధికార్' అని నామకరణం చేశారు. కేంద్రంలో ఈసారి పిడిఎ ప్రభుత్వం ఏర్పడుతుందని ఆయన అన్నారు. పిడిఎ ప్రభుత్వం అంటే అంటే వెనుకబడిన తరగతులు, దళితులు, మైనారిటీలతో కూడిన ప్రభుత్వమని అర్థం. కేంద్రంలో ఇండియా బ్లాక్ అధికారంలోకి వచ్చిన వెంటనే కులగణన చేపడతామన్నారు. ఎస్‌సి, ఎస్‌టి, బిసిల ఖాళీలను ఏడాదిలోగా భర్తీ చేస్తామన్నారు. యువతకు శాపంగా మారిన అగ్నిపథ్‌ను రద్దు చేసి, రెగ్యులర్ రిక్రూట్‌మెంట్‌ను ప్రవేశపెడతామన్నారు. పాత పెన్షన్ పథకాన్ని పునరుద్ధరిస్తామన్నారు. 2029కల్లా దారిద్ర్యాన్ని సంపూర్ణంగా నిర్మూలిస్తామన్నారు. రైతుల వ్యవసాయ రుణాలను రద్దు చేస్తామని, రైతాంగ కమిషన్‌ను ఏర్పాటు చేస్తామని, ఉచితంగా నీటిపారుదల సదుపాయాలను కల్పిస్తామని హామీ ఇచ్చారు. భూమిలేని చిన్న, మధ్య తరగతి రైతులకు నెలకు రూ.5వేలు పెన్షన్ ఇస్తామన్నారు. మహిళలపై నేరాల కట్టడికి జాతీయస్థాయిలో హెల్ప్‌లైన్ ఏర్పాటు చేయడంతో పాటు నియోజకవర్గాల పునర్విభజన జరిగేవరకు వేచి వుండకుండా అధికారంలోకి వచ్చిన రెండేళ్ళలోనే చట్టసభల్లో మహిళలకు 33శాతం రిజర్వేషన్ కల్పిస్తామని హామీ ఇచ్చారు.

రిలయన్స్‌తో 'టెస్లా' జట్టు..!

న్యూఢిల్లీ : భారత మార్కెట్‌పై కన్నేసిన టెస్లా అధినేత ఎలన్ మస్క్ ఇక్కడ వ్యాపార విస్తరణ కోసం ముకేష్ అంబానీకి చెందిన రిలయన్స్ ఇండస్ట్రీస్‌తో జట్టు కట్టనున్నారని తెలుస్తోంది. దీనికోసం రెండు సంస్థల మధ్య కీలక చర్చలు జరుగుతున్నాయి. రిలయన్స్ భాగస్వామ్యంలో టెస్లా దేశంలో తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేయనుందని వార్తలు వస్తున్నాయి. ఉమ్మడి భాగస్వామ్యంలో ఒక సంస్థను ఏర్పాటు చేసే ప్రతిపాదనను తాజాగా పరిశీలిస్తున్నట్లు హిందూ బిజినెస్ లైన్ ఓ కథనం ప్రచురించింది. ఆ వివరాల ప్రకారం.. దాదాపు నెల రోజులుగా రిలయన్స్‌తో టెస్లా ప్రతినిధులు చర్చలు జరుపుతున్నారు. విద్యుత్ వాహనాల తయారీ, అమ్మకాలు సహా ఇతర అనుబంధ సేవలను రిలయన్స్ సమకూర్చనున్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. అత్యధిక జనాభా గల దేశాల్లో ఇవి కార్ల వినియోగం అవసరమని ఎలాన్ మస్క్ ట్వీట్ చేసిన మరుసటి రోజే ఈ వార్తలు రావడం విశేషం.

భారత్‌లో టెస్లా కార్ల తయారీ కేంద్రం ఏర్పాటుకు అవసరమైన స్థలం సమకూర్చడానికి మహారాష్ట్ర, గుజరాత్ రాష్ట్రాలు పలు ప్రతిపాదనలను టెస్లా ప్రతినిధుల ముందు ఉంచారని సమాచారం. తెలంగాణ ప్రభుత్వంతోనూ చర్చలు కొనసాగుతున్నటు తెలుస్తోంది. దాదాపు 2–3 బిలియన్ డాలర్ల (రూ.8–16వేల కోట్లు) వరకు పెట్టుబడి పెట్టే అవకాశం ఉంది. కాగా.. కుడివైపు స్టీరింగ్ ఉండే కార్ల తయారీని జర్మనీలో ఉన్న టెస్లా ప్లాంట్‌లో ప్రారంభించినట్లు ఇటీవల రాయిటర్స్ తెలిపింది. వాటినే భారత మార్కెట్‌లోకి ఎగుమతి చేసే అవకాశం ఉన్నట్లు పేర్కొంది.

త్వరలోనే మోడీతో మస్క్ భేటీ..

భారత్‌లో ప్లాంట్ ఏర్పాటుపై టెస్లా అధినేత ఎలాన్ మస్క్ ఏప్రిల్ 22న ప్రధాని మోడీతో భేటీ కానున్నారని తెలుస్తోంది. ఆ తర్వాత టెస్లా కార్ల తయారీ ప్లాంట్, పెట్టుబడులపై ప్రకటన చేస్తారని సమాచారం. అమెరికన్ కార్ల కంపెనీ టెస్లా అధినేత ఎలన్ మస్క్ డిమాండ్ చేసినట్లుగా ఇటీవల మోడీ సర్కార్ విద్యుత్ వాహనాల (ఇవి) పాలసీని ప్రకటించింది. ఇవిలపై అమాంతం దిగుమతి సుంకాన్ని తగ్గించింది. దేశంలో ఏదైనా కంపెనీ కనీసం రూ.4,150 కోట్లు పెట్టుబడిగా పెడితే చాలు పలు రాయితీలు పొందవచ్చు. ఈ రెండు ప్రధానాంశాలు కూడా టెస్లాను దృష్టిలో పెట్టుకుని రూపొందించినట్లు స్పష్టమవుతోంది. కొత్త పాలసీ ప్రకారం.. ఇవి కంపెనీలు 35 వేల డాలర్ల (రూ.29లక్షలు) కంటే అధిక ధర కలిగిన కార్లను 15 శాతం సుంకంతో ఏటా 8,000 ఇవి కార్ల వరకు దిగుమతి చేసుకోవడానికి ఇవి పాలసీ అనుమతిస్తుంది. ప్రస్తుతం కార్ల ధరను బట్టి 70–100 శాతం వరకు దిగుమతి సుంకాలు అమల్లో ఉన్నాయి. భారత్‌లో ఎన్నికల వేళ టెస్లాకు అనుకూల విధానాలు చేపట్టడం చర్చనీయాంశంగా మారింది.

పవన్‌కల్యాణ్‌కు ఇసి నోటీసులు

ప్రజాశక్తి – అమరావతి బ్యూరో

జనసేన పార్టీ అధినేత పవన్‌కల్యాణ్‌కు ఎన్నికల కమిషన్ బుధవారం నోటీసులిచ్చింది. 48 గంటల్లో వివరణ ఇవ్వాలని ఆదేశించింది. ఇటీవల అనకాపల్లి ఎన్నికల ప్రచారంలో సిఎం వైఎస్ జగన్‌ను ఉద్దేశించి స్కామ్ స్టార్, ల్యాండ్ గ్రాబర్, శాండ్ అండ్ లిక్కర్ ఎంపరర్ అంటూ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారంటూ ఈ నెల 8న విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు సిఇఒకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలోనే ఎన్నికల కమిషన్ నోటీసులిచ్చింది.

రాజస్తాన్‌కు షాక్

గుజరాత్ టైటాన్స్ చేతిలో అనూహ్య ఓటమి... ధనాధన్ బ్యాటింగ్‌తో చెలరేగిన రషీద్‌ఖాన్



జైపూర్: ఇండియన్ ప్రిమియర్ లీగ్(ఐపిఎల్) సీజన్–17లో రాజస్తాన్ రాయల్స్ జట్టు తొలి ఓటమిని చవిచూసింది. ఈ సీజన్‌లో వరుస విజయాలతో దూసుకెళ్తోన్న రాజస్తాన్‌కు గుజరాత్ బ్రేక్ వేసింది. తొలిగా బ్యాటింగ్‌కు దిగిన రాజస్తాన్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 3వికెట్ల నష్టానికి 196పరుగుల భారీస్కోర్‌ను నమోదు చేయగా.. ఆ లక్ష్యాన్ని గుజరాత్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో ఏడు వికెట్లు నష్టపోయి 199పరుగులు చేసి సంచలన విజయం సాధించింది. గుజరాత్ గెలుపులో ఆల్‌రౌండర్ రషీద్ ఖాన్ కీలకపాత్ర పోషించాడు. చివరి 4 ఓవర్లలో 60 పరుగులు చేయాల్సిన దశలో గుజరాత్ కెప్టెన్ శుభ్‌మన్(72), తెవాటియా(14; 8బంతుల్లో ఫోర్, సిక్సర్), రషీద్ ఖాన్(24నాటౌట్; 11బంతుల్లో 4ఫోర్లు) కీలకపాత్ర పోషించారు. తొలుత కెప్టెన్ సంజు శాంసన్(68నాటౌట్), రియాన్ పరాగ్(76) అద్భుత బ్యాటింగ్‌తో అలరించారు. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన రాజస్థాన్ దూకుడుగా ఇన్నింగ్స్‌ను ప్రారంభించింది. ఓపెనర్ యశస్వి జైస్వాల్ (19 బంతుల్లో 24 పరుగులు) మొదటి మూడు ఓవర్లు చెలరేగి ఆడాడు. కానీ నాలుగో ఓవర్‌లో ఉమేశ్ యాదవ్ వేసిన బంతికి క్యాచ్ ఔటయ్యాడు. మరో ఓపెనర్ జోస్ బట్లర్ (10 బంతుల్లో 8 పరుగులు) విఫలమైనప్పటికీ.. ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన సంజూ శాంసన్(38బంతుల్లో 68 పరుగులు) , రియాన్ పరాగ్ (48 బంతుల్లో 76 పరుగులు) పరుగుల వేటలో దుమ్ముదులిపేశారు. ఇద్దరూ చెరో హాఫ్ సెంచరీతో జట్టుకు కీలక స్కోర్‌ను అందించారు. అయితే వీళ్ల భాగస్వామ్యానికి 19వ ఓవర్‌లో బ్రేక్ పడింది. 18.4 ఓవర్‌కు మోహిత్ శర్మ వేసిన బంతికి పరాగ్ ఔటయ్యాడు. పరాగ్ ఔటయిన తర్వాత క్రీజులోకి వచ్చిన హెట్‌మయిర్ (5 బంతుల్లో 13పరుగులు) కూడా ఫర్వాలేదనిపించాడు. ఫలితంగా నిర్ణీత 20 ఓవర్లు ముగిసేసరికి రాజస్థాన్ 3 వికెట్ల నష్టానికి 196 పరుగులు చేసింది. భారీ ఛేదనలో గుజరాత్ ఓపెనర్లు సాయి సుదర్శన్(35), శుభ్‌మన్(72) తొలి వికెట్‌కు 64పరుగుల పునాది వేశారు. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ రషీద్ ఖాన్‌కు లభించింది.

స్కోర్‌బోర్డు...

రాజస్తాన్ రాయల్స్ ఇన్నింగ్స్: జైస్వాల్ (సి)వేడ్ (బి)ఉమేశ్ 24, బట్లర్ (సి)తెవాటియా (బి)రషీద్ ఖాన్ 8, సంజు శాంసన్ (నాటౌట్) 68, రియాన్ పరాగ్ (సి)విజయ్ శంకర్ (బి)మోహిత్ శర్మ 76, హెట్‌మైర్ (నాటౌట్) 13, అదనం 7. (20 ఓవర్లలో 3వికెట్ల నష్టానికి) 196పరుగులు. **వికెట్ల పతనం:** 1/32, 2/42, 3/172 **బౌలింగ్:** ఉమేశ్ 4–0–47–1, జాన్సన్ 4–0–37–0, రషీద్ ఖాన్ 4–0–18–1, నూర్ అహ్మద్ 4–0–43–0, మోహిత్ 4–0–51–1.

గుజరాత్ టైటాన్స్ ఇన్నింగ్స్: సాయి సుదర్శన్ (ఎల్‌బి)కుల్దీప్ సేన్ 35, శుభ్‌మన్ (స్టంప్)సంజు (బి)చాహల్ 72, మాథ్యూ వేడ్ (బి)కుల్దీప్ సేన్ 4, అభినవ్ మనోహర్ (బి)కుల్దీప్ సేన్ 1, విజయ్ శంకర్ (బి)చాహల్ 16, రాహుల్ తెవాటియా (రనౌట్)బట్లర్/ఆవేశ్ ఖాన్ 22, షారుక్ ఖాన్ (ఎల్‌బి)ఆవేశ్ ఖాన్ 14, రషీద్ ఖాన్ (నాటౌట్) 24, నూర్ అహ్మద్ (నాటౌట్) 0, అదనం 11, (20 ఓవర్లలో 7వికెట్ల నష్టానికి) 199పరుగులు. **వికెట్ల పతనం:** 1/64, 2/77, 3/79, 4/111, 5/133, 6/157, 7/195 **బౌలింగ్:** బౌల్ట్ 2–0–8–0, ఆవేశ్ ఖాన్ 4–0–48–1, కేశవ్ మహరాజ్ 2–0–16–0, అశ్విన్ 4–0–40–0, చాహల్ 4–0–43–2, కుల్దీప్ సేన్ 4–0–41–2.

ఈస్ట్‌జోన్ 154ఆలౌట్

మహిళల ఇంటర్ జోనల్ మల్టీ–డే ట్రోఫీ



ముంబయి: మహిళల ఇంటర్ జోనల్ మల్టీ–డే టోర్నమెంట్‌లో ఈస్ట్‌జోన్ మహిళలజట్టు తొలి ఇన్నింగ్స్‌లో 154పరుగులకే పరిమితమైంది. అంతకుముందు సౌత్‌జోన్ బౌలర్లు సమిష్టిగా రాణించడంతో ఈస్ట్‌జోన్ జట్టు భారీస్కోర్‌పై ఆశలు వదులుకుంది. దీంతో ఆ జట్టు కేవలం 21పరుగుల స్వల్ప ఆధిక్యత లభించింది. మహారాష్ట్ర క్రికెట్ అసోసియేషన్‌లో జరుగుతున్న ఈ మ్యాచ్‌లో ఓవర్‌నైట్ స్కోర్ 108పరుగులతో తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన ఈస్ట్‌జోన్ జట్టును సౌత్‌జోన్ కెప్టెన్ మిన్ను మణి నిలువరించింది. మరో ఎండ్‌లో టిటాస్ సద్ధు కూడా చెలరేగడంతో ఆ జట్టు తొలి ఇన్నింగ్స్‌లో స్వల్ప వ్యవధిలోనే వికెట్లన్నీ చేజార్చుకుంది. అనంతరం రెండో ఇన్నింగ్స్ సౌత్‌జోన్ జట్టు 70.5ఓవర్లలో 179పరుగులకే ఆలౌటైంది. దీంతో తొలి ఇన్నింగ్స్ ఆధిక్యత 21పరుగులు పోసు ఆ జట్టు 159పరుగుల లక్ష్యాన్ని ఛేదించాల్సి వచ్చింది. ఛేదనలో ఈస్ట్‌జోన్ జట్టు రెండోరోజు ఆట ముగిసే సమయానికి 2 వికెట్లు నష్టపోయి 38పరుగులు చేసింది.

శ్రీజేశ్ నిలువరించినా..

ఆసీస్ చేతిలో 1–2తో ఓటమి

సిడ్నీ: వరుస ఓటములకు చెక్ పెట్టాలని స్టార్ గోల్ కీపర్ శ్రీజేశ్ మైదానంలోకి అడుగిడినా.. భారత హాకీ జట్టుకు ఓటమి తప్పలేదు. ఐదు టెస్ట్ మ్యాచ్‌ల సిరీస్ ఆడేందుకు ఆస్ట్రేలియా పర్యటనకు వెళ్లిన భారత హాకీ జట్టు బుధవారం జరిగిన మూడో మ్యాచ్‌లో 1–2గోల్స్ తేడాతో ఆసీస్ చేతిలో ఓటమిపాలైంది. తొలి రెండో మ్యాచ్‌లతో పోల్చిచూస్తే ఈ మ్యాచ్‌లో భారత హాకీ జట్టు ఆటగాళ్లు అద్భుతంగా పుంజుకున్నారు. డిఫెన్స్‌లో పటిష్టంగా ఉన్న భారత్.. ఆస్ట్రేలియాకు చివరి వరకు గట్టి పోటీనిచ్చింది. 44వ ని.లో భారత్ తరపున ఏకైక గోల్‌ను జుగ్‌రాజ్ సింగ్ పెనాల్టీని గోల్‌గా మలుచగా.. 44, 49వ ని.లలో జెరెమీ హేవార్డ్ ఆసీస్ తరపున రెండు గోల్స్ కొట్టి భారత జట్టు విజయావకాశాలపై నీళ్లు చల్లాడు.

ప్రి క్వార్టర్స్‌కు సింధు

ఆసియా బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్

నింగ్బో(చైనా): ఆసియా బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌లో భారత్‌కు మిశ్రమ ఫలితాలు దక్కాయి. మహిళల సింగిల్స్‌లో పివి సింధు శుభారంభం చేయగా.. పురుషుల సింగిల్స్‌లో స్టార్ షట్లర్ లక్ష్యసేన్ ఓటమిపాలయ్యాడు. బుధవారం జరిగిన తొలిరౌండ్ పోటీలో సింధు వరుససెట్లలో మలేషియా షట్లర్‌ను చిత్తుచేసింది. హోరాహోరీగా సాగిన ఈమ్యాచ్‌లో సింధు 21–18, 14–21, 21–19తో మలేషియాకు చెందిన 33వ ర్యాంకర్ గో–జిన్–వుయ్‌ను ఓడించింది. ఈ మ్యాచ్ సుమారు 64నిమిషాలసేపు హోరాహోరీగా సాగింది. ప్రి క్వార్టర్స్‌లో సింధు 6వ సీడ్ చైనాకు చెందిన హన్–వుయ్‌తో క్వార్టర్స్ బెర్త్‌కు పోటీపడనుంది. ఇక పురుషుల సింగిల్స్‌లో కిదాంబి శ్రీకాంత్, లక్ష్యసేన్ పోరాటం ముగిసింది.

ఐపిఎల్‌లో నేడు

ముంబయి × బెంగళూరు

వేదిక: ముంబయి; రా.7.30గం॥లకు

పాయింట్ల పట్టిక

జట్టు	మ్యా	గె	ఓ	పా	నె.ర.
రాజస్తాన్	5	4	1	8	0.87
కోల్‌కతా	4	3	1	6	1.52
లక్నో	4	3	1	6	0.77
చెన్నై	5	3	2	6	0.66
సన్‌రైజర్స్	5	3	2	6	0.34
గుజరాత్	6	3	3	6	-0.63
పంజాబ్‌కింగ్స్	5	2	3	4	-0.19
ముంబయి	4	1	3	2	-0.70
బెంగళూరు	5	1	4	2	-0.84
ఢిల్లీ క్యాపిటల్స్	5	1	4	2	-1.37

మ్యా:మ్యాచ్‌లు; గె:గెలుపు; ఓ:ఓటమి; పా:పాయింట్లు; నె.ర.:నెట్‌రన్‌రేట్

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68